www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

నేవీ చేతికి మరో అణ్వాస్త్రం! 2

అమ్ముల పొదిలో మూడో స్వదేశీ అణు జలాంతర్గామి
2 నెలల వ్యవధిలో రెండో సబ్‌మెరైన్ ప్రారంభం
విశాఖలో సైలెంట్‌గా ఎస్-4స్టార్ జలప్రవేశం
16న షిప్ బిల్డింగ్ సెంటర్ నుంచి ప్రారంభం
అరిధమన్‌గా నామకరణం చేసే అవకాశం



బుధవారం | 23-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 188 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం, తిథి: సప్తమి రా. 1.19 తదుపరి అష్టమి; నక్షత్రం: పునర్వసు పూర్తి; వర్జ్యం: రా. 5.57 -7.35; దుర్ముహూర్తం: ఉ. 11.36-12.22; అమృతఘడియలు: తె. 3.47-5.25; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.14; సూర్యాస్తమయం: 5.44 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru




అనంతపురం రూరల్ మండలంలోని ఉప్పరపల్లి సమీపంలో నీట మునిగిన జగనన్న కాలనీ

కరువు సీమలో కుండపోత

అనంత, సత్యసాయి జిల్లాలను ముంచెత్తిన వాన
నీట మునిగిన పలు కాలనీలు.. దెబ్బతిన్న పంటలు

దానా గండం!

బంగాళాఖాతంలో వాయుగుండం 13
నేడు తుఫాన్‌గా.. రేపటికి తీవ్ర తుఫాన్‌గా మారే చాన్స్

బెంగళూరు కకావికలం


మునిగిన ఇళ్లు.. జన జీవనం అస్తవ్యస్తం
విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం
నిర్మాణ దశలో భవనం కూలి ముగ్గురి మృతి

ఏపీని ఆపలేరు!

మోదీ.. పవన్.. నేను.. మా త్రయంతో రాష్ట్రం మున్ముందుకే: సీఎం



డ్రోన్ సదస్సులో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఇతర ప్రతినిధులు


డ్రోన్లతో బుద్ధుడి ఆకారం ఆవిష్కరణ

గేమ్ చేంజర్‌గా డ్రోన్..15 రోజుల్లో పాలసీ
నాడు టెలికాం నియంత్రణల సడలింపు
ఇప్పుడు డ్రోన్ డీరెగ్యులేషన్ సాధిస్తాం
డ్రోన్‌దే భవిష్యత్.. డేటాయే సంపద..
డ్రోన్ కేపిటల్‌గా అమరావతి
తయారీకి ఓర్వకల్లులో 300 ఎకరాలిస్తాం
గతంలో ప్రతి ఇంట్లో ఐటీ ఉద్యోగి ఉండాలన్నా.. ఇప్పుడు ప్రతి ఇంట్లో ఒక వ్యాపారవేత్త ఉండాలి
డ్రోన్ సమ్మిట్‌లో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన

"టెలికాం రంగంలో ప్రైవేటు పెట్టుబడులను అడ్డుకునేలా ఎన్నో ఆంక్షలు ఉండేవి. అప్పటి ప్రధాని వాజపేయితో మాట్లాడాక .. టెలికాం నియంత్రణలను చాలావరకు సడలించారు. ధీరూభాయ్ అంబానీతో మాట్లాడినపుడు తనకు టెలికాం రంగంలో ఏమాత్రమూ అనుభవం లేదని తెలిపారు. కానీ, ఆ తర్వాత రెండు రోజులకు ఆయనే ఫోన్ చేసి.. టెలికాం రంగంలోకి వస్తున్నట్లుగా చెప్పారు. టెలికాం రంగంలోకి రిలయన్స్ రావడంతో రివల్యూషన్ వచ్చింది. సెల్ ఫోన్ ధరలు రూ.20,000 నుంచి ఒక్కసారిగా రూ.2,000కు తగ్గాయి" - సీఎం చంద్రబాబు

అమరావతి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ .. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు తాను ఉండగా సాంకేతికతలో ఇండియాను ఎవరూ తాకలేరని, ఆంధ్రప్రదేశ్‌ను ఎవరూ ఆపలేరని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. మంగళగిరిలోని ప్రైవేటు కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం జరిగిన అమరావతి డ్రోన్ సమ్మిట్ - 2024కు ముఖ్యమంత్రి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ..చైనా, జపాన్, యూరోపియన్ దేశాల్లో యువత సంఖ్య

మిగతా 12వ పేజీలో...

డ్రోన్ భళా.. ఏపీకి కొత్త కళ

విన్యాసాలు అదుర్స్.. 5 గిన్నిస్ రికార్డులు
పండక్కు ముందే నింగిలో దీపావళి కాంతులు
5,500 డ్రోన్లు ఒకేసారి లేవడంతో నక్షత్రభ్రాంతి
కృష్ణాతీరాన సప్త వర్ణ చిత్రాల ఆవిష్కారం
300 ఎకరాలలో డ్రోన్ సిటీ: రామ్మోహన్ 12

ప్రధాని చేతుల మీదుగా రాష్ట్ర విజన్ ప్రణాళిక

నవంబరు మొదటివారంలో ముహూర్తం 3



బ్రిక్స్ సదస్సు సందర్భంగా రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రధాని మోదీ ఆలింగనం

సంక్షోభానికి చర్చలే పరిష్కారం

- మేం అన్ని పక్షాలతో సంప్రదింపుల్లో ఉన్నాం
- ఏ సమస్య అయినా శాంతియుత మార్గాల్లో పరిష్కారం కావాలి.. మేం పూర్తిగా సహకరిస్తాం
- శాంతిస్థాపన ప్రక్రియకు సిద్ధం.. బ్రిక్స్‌లో మోదీ
- రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రధాని సమావేశం

కజాన్, అక్టోబరు 22: ఎలాంటి సంక్షోభానికైనా చర్చలే పరిష్కార మార్గమని.. సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని.. ప్రధాని నరేంద్ర మోదీ రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో అన్నారు. రెండున్నరేళ్లకు పైబడి సాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తాము అన్ని పక్షాలతో సంప్రదింపుల్లో ఉన్నామని, శాంతి స్థాపనకు అవసరమైన ఎలాంటి సహకారాన్నైనా అందించేందుకు భారత్

మిగతా 2వ పేజీలో...

అధ్యక్షా అక్రమం

అసెంబ్లీ టెండర్లలో గోల్‌మాల్!

ఎల్-1ను కాదని ఎల్-2కు ఆడియో సిస్టం నిర్వహణ బాధ్యత
ఎక్కువ ధర వేసిన సంస్థకు పని అప్పగింత
ఫైలుపై రాసి ఆదేశించిన నాటి స్పీకర్ తమ్మినేని
టెండర్ ఫైళ్లను పరిశీలించిన ఆడిట్ విభాగం
మూడేళ్లలో రూ.18 లక్షల ప్రజాధనం వృథా అయినట్లు నివేదిక 13



బొత్సకు జీ హుజూర్!



తిరుమల దర్శనాల్లో రెడ్‌కార్పెట్ 14
కూటమి ప్రభుత్వంలోనూ అదే దర్జా
బొత్స సిఫారసుపై ఒకేరోజు 26 మందికి దర్శనం
మంత్రి చెప్పినా.. రోజుకు 12 మందికే అనుమతి
మాజీ మంత్రి సిఫారసుపై అంత మందికి ఎలా?
పాత పరిచయాలతో కీలక అధికారి నిర్వాకం



విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆగినట్లే!?

సంస్థ బలోపేతంపై కేంద్రం దృష్టి
మళ్లీ లాభాలబాట పట్టించడానికి కసరత్తు
పునర్నిర్మాణ ప్రణాళికకు రూపకల్పన
ఈ దిశగా ఇప్పటికే 1,650 కోట్ల సాయం
దీపమ్ నుంచి డీనోటిఫై చేయనిదే నమ్మలేమని కార్మికుల స్పష్టీకరణ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)
ఆంధ్రుల హక్కుగా అవతరించిన విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ ఆగిపోయినట్లేనని అధికార వర్గాలు చెబుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం దీనిని బలోపేతం చేసి.. ఏ విధంగా మళ్లీ లాభాల బాట పట్టించాలనే దానిపై కసరత్తు చేస్తోందని అంటున్నాయి. ఇందులో భాగంగా పునర్నిర్మాణ

మిగతా 14వ పేజీలో...

వాట్సా‌ప్‌లోనే ఇక సర్టిఫికెట్లు

మంత్రి లోకేశ్ సమక్షంలో మెటాతో ఎంఓయూ
'యువగళం' హామీని నిలబెట్టుకున్న మంత్రి
ధ్రువీకరణ పత్రాలు, బిల్లుల చెల్లింపు, ఈ-గవర్నెన్స్ సేవలు అందించనున్న మెటా


మంత్రి లోకేశ్ సమక్షంలో మెటాతో ఒప్పందంపై సంతకాలు

యువగళం పాదయాత్రలో విద్యార్థులు, నిరుద్యోగులు వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం పడుతున్న కష్టాలను గమనించాను. మొబైల్‌లోనే వాటిని అందిస్తామని ఆనాడు హామీ ఇచ్చాను. మాట ఇచ్చిన ప్రకారం.. వాట్సా‌ప్‌లోనే సర్టిఫికెట్లు, పౌరసేవలు పొందేలా మెటాతో ఒప్పందం చేసుకున్నాం. - మంత్రి లోకేశ్

న్యూఢిల్లీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏటా కులం, ఇతర ధ్రువీకరణ పత్రాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా వాట్సాప్ ద్వారానే వాటిని పొందే విధానం ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో అందుబాటులోకి రానుంది. వివిధ రకాల బిల్లులు కూడా వాట్సాప్ ద్వారానే చెల్లించవచ్చు. ప్రజలకు ప్రభుత్వం నుంచి పౌర సేవలు వాట్సాప్ బిజినెస్ ద్వారా అందించేందుకు ఈ మేరకు మెటా

మిగతా 14వ పేజీలో...

మరో 79 విమానాలకు బాంబు బెదిరింపులు 2

వారంలో ఇప్పటికి 169 బెదిరింపు కాల్స్
దేశవ్యాప్తంగా సీఆర్పీఎఫ్ స్కూళ్లకూ బెదిరింపులు
బెంగళూరు-వారాణసీ విమానం శంషాబాద్‌లో అత్యవసర ల్యాండింగ్
ఆ సమయంలో దిగాల్సినవి విజయవాడకు..
ఢిల్లీ-హైదరాబాద్ సర్వీసు 45 నిమిషాలు గాల్లోనే


నెల్లూరులోని ఎస్ఎన్‌జే డిస్టిలరీలో తనిఖీ చేస్తున్న సీఐడీ అధికారులు

మద్యం డిస్టిలరీల్లో సీఐడీ సోదాలు

జగన్ హయాంలో కుంభకోణంపై ఆరా 14
ఇన్వాయిస్, ప్రొడక్షన్, సేల్స్ రికార్డుల స్వాధీనం
సిబ్బంది, ఫార్మాసిస్ట్‌ల వాంగ్మూలాలు నమోదు
'జే బ్రాండ్' సహా కీలక అంశాలపై నిశిత పరిశీలన
ఉత్పత్తికి, విక్రయాలకు మధ్య తేడా గుర్తింపు!

షేర్.. బే(జా)ర్!

స్టాక్ మార్కెట్ భారీ పతనం 10
సెన్సెక్స్ 930 పాయింట్లు డౌన్
2 వారాల కనిష్ఠ స్థాయికి సూచీ
24,500 దిగువకు జారిన నిఫ్టీ
రూ.9.19 లక్షల కోట్ల సంపద ఫట్

'వక్ఫ్' జేపీసీ భేటీలో రగడ

- గ్లాసు పగులగొట్టిన తృణమూల్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ
- చేతికి గాయం, నాలుగు కుట్లు

న్యూఢిల్లీ, అక్టోబర్ 22(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు బిల్లుపై మంగళవారం జరిగిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) సమావేశంలో తీవ్ర గందరగోళం నెలకొంది. అది చివరకు తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడి సస్పెన్షన్‌కు దారి తీసింది. ఈ సమావేశంలో కోల్‌కతా హైకోర్టు మాజీ న్యాయమూర్తి, బీజేపీ ఎంపీ అభిజిత్ గంగూలీ, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. వాదోపవాదాల సందర్భంగా ఆవేశంతో కల్యాణ్ బెనర్జీ తన టేబుల్‌పై ఉన్న గాజు నీటి సీసాను పగులగొట్టారు. ఆయన బొటన వేలు, చూపుడు వేలుకు గాయాలయ్యాయి. దాంతో పగిలిన సీసాను ఆయన కమిటీ ఛైర్మన్ జగదంబికా పాల్ డెస్క్ వైపు విసిరివేసే ప్రయత్నం చేశారు. అనంతరం కల్యాణ్ చేయికి వైద్యులు చికిత్స చేసి నాలుగు కుట్లు వేశారు. ఛైర్మన్ డెస్క్ వైపు పగిలిన సీసాను విసిరే ప్రయత్నం చేసినందుకు అధికార పక్ష సభ్యులు తప్పుపట్టారు. ఆయనను సమావేశాల రెండు సిట్టింగ్‌లతోపాటు ఒకరోజు హాజరు కాకుండా సస్పెండ్ చేశారు.

లారెన్స్ బిష్ణోయ్‌ని ఎన్‌కౌంటర్ చేస్తే కోటి ఇస్తాం

- పోలీసులకు క్షత్రియ కర్ణిసేన రాజ్ షెకావత్ ఆఫర్

న్యూఢిల్లీ, అక్టోబరు 22: జైల్లో ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్‌ని 'ఎన్‌కౌంటర్' చేస్తే రూ. 1.11 కోట్లు ఇస్తామని పోలీసులకు క్షత్రియ కర్ణిసేన ఆఫర్ చేసింది. ఈ మేరకు క్షత్రియ కర్ణిసేన నేత రాజ్ షెకావత్ ప్రకటించారు. నిరుడు డిసెంబరులో ప్రముఖ రాజ్‌పుత్ నేత సుఖ్‌దేవ్ సింగ్ గోగమేడిని బిష్ణోయ్ గ్యాంగ్ కాల్చి చంపడంతో ప్రతీకారంగా ఈ మేరకు నజరానా ఇస్తామని ప్రకటించారు. దీనికి సంబంధించి ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ప్రస్తుతం బిష్ణోయ్ మత్తు పదార్థాల స్మగ్లింగ్ ఆరోపణల కేసులో సబర్మతి జైల్లో ఉన్నారు.

అమూల్, జగన్... ఓ లవ్ స్టోరీ: నీలాయపాలెం

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అమూల్‌కు వైసీపీ సర్కార్ ఇచ్చిన ఆస్తుల్ని కూటమి ప్రభుత్వం తిరిగి తీసుకోవాలని టీడీపీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ పరిధిలోని వివిధ డెయిరీల కింద రూ.వేల కోట్లపైగా ఆస్తులు, 700 ఎకరాల భూములున్నాయి. ఇవన్నీ అమూల్‌కు అప్పగించాలని జగన్ శతవిధాలా ప్రయత్నించారు. చిత్తూరులో రూ.385 కోట్ల పెట్టుబడి పెడుతుందని, రూ.150 కోట్లతో ఐస్‌క్రీం ప్లాంట్ పెడుతుందని చెప్పి, రూ.వెయ్యి కోట్ల డెయిరీ ఆస్తులను అమూల్‌కు ధారదత్తం చేశారు. జగన్‌కు అమూల్ అంటే అంత లవ్ ఎందుకో ఎవరికీ తెలీదు. పాల సేకరణ జరగనప్పుడు లీజుకు తీసుకున్న ఆస్తుల్ని తిరిగి ఇచ్చేయాలి. అమూల్‌కు ఆస్తుల అప్పగింతపై కూటమి ప్రభుత్వం సమీక్ష జరపాలి' అని నీలాయపాలెం కోరారు.

'సనాతన' వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పను: ఉదయనిధి

చెన్నై, అక్టోబరు 22: తాను కరుణానిధి మనవడినని.. సనాతన ధర్మాన్ని డెంగ్యూ, మలేరియాతో పోల్చుతూ దానిని నిర్మూలించాలంటూ గతంలో చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదని తమిళనాడు ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ స్పష్టం చేశారు. మహిళలను అణచివేసే చర్యలకు వ్యతిరేకంగా తాను ఆ వ్యాఖ్యలు చేశానని మంగళవారమిక్కడ అన్నారు. 'మహిళలను చదవడానికి అనుమతించలేదు. ఇళ్ల నుంచి బయటకు రానివ్వలేదు. భర్తలు చనిపోతే వారు కూడా చనిపోవలసిందే. ద్రవిడ నేతలైన పెరియార్, అన్నాదురై, కరుణానిధిల అభిప్రాయాలకు అనుగుణంగా నేను గత ఏడాది మాట్లాడాను' అని చెప్పారు. తన మాటలను వక్రీకరించారని కూడా ఉదయనిధి అన్నారు. దేశవ్యాప్తంగా పలు కోర్టుల్లో కేసులు పెట్టారని.. క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారని.. కానీ తన మాటలకు కట్టుబడి ఉన్నానని, కేసులను ఎదుర్కొంటానని తేల్చి చెప్పారు.

జల వనరుల శాఖలో అడహాక్ పదోన్నతులు

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జల వనరుల శాఖలో పలువురు ఇంజనీరింగ్ అధికారులకు ప్రభుత్వం అడహాక్ పదోన్నతులు కల్పించింది. ఎం.మధుసూదనరెడ్డికి తెలుగుగంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వు జారీ చేశారు. ఎస్ఈ డి.రామగోపాల్‌కు నార్త్ కోస్ట్ చీఫ్ ఇంజనీర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. కమతం శ్రీనివాసుకు కడప ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్‌గా, శ్యాంప్రసాద్‌కు ఒంగోలు ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎస్.సుగుణాకరరావుకు విజయవాడ ఇరిగేషన్ సర్కిల్ పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.



అడ్వాణీకి క్రియాశీలక సభ్యత్వాన్ని అందజేసిన పురందేశ్వరి

న్యూఢిల్లీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బీజేపీ వ్యవస్థాపక సభ్యులు, మాజీ ఉప ప్రధాని లాల్‌కృష్ణ అడ్వాణీకి బీజేపీ క్రియాశీలక సభ్యత్వాన్ని నేరుగా ఆయన ఇంటికి వెళ్లి ఆ పార్టీ నేతలు అందజేశారు. బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్, రామ్‌మాధవ్ తదితరులు అడ్వాణీ నివాసానికి వెళ్లి ఆయనకు పార్టీ క్రియాశీలక సభ్యత్వ పత్రాన్ని అందజేశారు.

మరో 79 విమానాలకు
బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ, అక్టోబరు 22: విమానాలకు బాంబు బెదిరింపు కాల్స్ ఆగడం లేదు. ఇలాంటి కాల్స్ చేసే వారికి జీవిత ఖైదు విధించేలా చట్ట సవరణ చేస్తామని, నో ఫ్లై జాబితాలో చేర్చుతామని సోమవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించిన సంగతి తెలిసిందే. అయినా, ఈ బెదిరింపు కాల్స్ ఆగలేదు. గడిచిన 24 గంటల్లో మరో 79 విమానాలకు బెదిరింపు కాల్స్ వచ్చాయి. వీటిలో మంగళవారం ఒక్క రోజే 50 విమానాలకు బెదిరింపులు రావడం గమనార్హం. ప్రధానంగా అంతర్జాతీయ మార్గాల్లో నడిచే విమానాలకు ఈ కాల్స్ వచ్చాయి. ఇండిగో విమానాలు 23, విస్తారా 21, ఆకాశ 12, ఎయిరిండియాకు చెందిన 23 విమానాలకు బెదిరింపు కాల్స్ వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటితో కలిసి వారం రోజుల్లో మొత్తం 169 విమానాలకు బెదిరింపు కాల్స్ వచ్చినట్లయింది. తాజాగా దేశీయ సర్వీసులతో పాటు జెడ్డా, ఇస్తాంబుల్, రియాద్ వంటి అంతర్జాతీయ నగరాలకు వెళ్లే విమానాలకు ఈ కాల్స్ వచ్చాయి. 90కి పైగా విమానాలకు బాంబు బెదిరింపులపై ఢిల్లీ పోలీసులు 8 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. మరోవైపు సీఆర్‌పీఎఫ్ పాఠశాలలకూ బాంబు బెదిరింపు కాల్స్ వచ్చాయి. వీటిపై సీఆర్‌పీఎఫ్, నిఘ విభాగం, ఢిల్లీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాంబు బెదిరింపులు.. శంషాబాద్‌లో అత్యవసర ల్యాండింగ్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి): బెంగళూరు నుంచి వారాణసీకి వెళ్తున్న ఎయిర్ ఆకాశ్ (క్యూపీ 1612) విమానానికి బాంబు బెదిరింపు రావడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మంగళవారం సాయంత్రం 5:10 గంటలకు అత్యవసర ల్యాండింగ్ చేశారు. బాంబు తనిఖీ బృందాలు సోదా చేసి బాంబు లేదని నిర్ధారించడంతో ఊపిరి పీల్చుకున్నారు. హైదరాబాద్ నుంచి జోధ్‌పూర్ వెళ్తున్న విమానానికి బాంబు బెదిరింపు రావడంతో జోధ్‌పూర్‌లో దిగిన వెంటనే భద్రతా సిబ్బంది తనిఖీలు చేశారు. బాంబు బెదిరింపు కాల్స్ కారణంగా హైదరాబాద్‌లో దిగాల్సిన రెండు విమానాలను విజయవాడకు తరలించారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్ వస్తున్న ఎయిరిండియా విమానం 45 నిమిషాలు గాల్లో చక్కర్లు కొట్టింది. ఈ విమానంలో తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. అలాగే గోవా నుంచి మధ్యాహ్నం హైదరాబాద్ బయల్దేరిన ఇండిగో విమానాన్ని కూడా విజయవాడకు మళ్లించారు. అది రాత్రి 7 గంటలకు తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంది.

వయనాడ్‌లో ప్రియాంకతో నవ్య ఢీ

- బీజేపీ అభ్యర్థిగా మాజీ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

వయనాడ్, అక్టోబరు 22: కేరళలో కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఖాళీచేసిన వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గ ఉప ఎన్నికలో ఆయన చెల్లెలు ప్రియాంకాగాంధీ వాద్రాపై బీజేపీ ఓ మాజీ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను బరిలోకి దించింది. ఆ పార్టీ తరఫున కోలికోడ్ (క్యాలికట్) కార్పొరేషన్ కౌన్సిలర్‌గా పదేళ్లుగా పనిచేస్తున్న నవ్య హరిదాస్ పోటీచేస్తున్నారు. నెహ్రూ కుటుంబ సభ్యురాలిగా ప్రియాంకకు జాతీయ స్థాయిలో పేరు ఉండిఉండొచ్చని.. అయితే ఆమె కంటే తనకే ఎక్కువ రాజకీయానుభవం ఉందని నవ్య మంగళవారం వ్యాఖ్యానించారు. వయనాడ్‌లో త్రిముఖ పోటీ నెలకొంది. ఎల్‌డీఎఫ్ అభ్యర్థిగా సీపీఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే సత్యన్ మొకేరీ పోటీచేస్తున్నారు. నవ్య 2009లో మెరైన్ ఇంజనీర్ శోభిన్ శ్యామ్‌ను పెళ్లిచేసుకుని సింగపూర్ వెళ్లారు. అక్కడ నాలుగేళ్లు పనిచేశారు. అనంతరం నెదర్లాండ్స్, అజార్‌బైజాన్‌లో కూడా పనిచేశారు. 2015లో సెలవుపై కోలికోడ్ వచ్చారు. ఆ సమయంలో కోలికోడ్ కార్పొరేషన్ ఎన్నికలు జరుగుతున్నాయి. బీజేపీ ఆమెకు కరపరంబ వార్డు టికెట్ ఇచ్చింది. ఆమె కుటుంబానికి ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉండడమే దీనికి కారణం. వరుసగా రెండు దఫాలు గెలిచి పదేళ్లుగా ఆమె కౌన్సిలర్‌గా కొనసాగుతున్నారు. 2021లో అసెంబ్లీ ఎన్నికల్లో కూడా పోటీచేసి ఓడిపోయారు. ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. వయనాడ్ లోక్‌సభ స్థానంలో తమ పార్టీకి సంస్థాగత బలం ఎక్కువగా లేదని ఆమె అంగీకరించారు. అయితే ప్రధాని మోదీ అభివృద్ధి ఎజెండా తనను కచ్చితంగా విజయతీరానికి చేరుస్తుందన్న ఆశాభావంతో ఉన్నారు. ఇక్కడ తమకు ఏటికేడాదీ బలం పెరుగుతోందన్నారు. 2019 ఎన్నికల్లో బీజేపీ మిత్రపక్షం బీడీజేఎస్ 78,816 ఓట్లు సాధించగా.. మొన్నటి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కె.సురేంద్రన్ 1,41,045 ఓట్లు పొందారని గుర్తుచేశారు. రాహుల్ మెజారిటీ 4,31,770 ఓట్ల నుంచి 3,64,422 ఓట్లకు తగ్గిపోయిందన్నారు. ప్రస్తుతం ఇక్కడ పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్యే ఉందని ఆమె చెప్పారు. కాంగ్రెస్ బాధ్యతారాహిత్యం కారణంగానే ఉప ఎన్నిక జరుగుతోందన్నారు. ఇటీవలి ఎన్నికల్లో వయనాడ్‌లో ఓట్లు కోరుతూ వెలసిన రాహుల్ ఫ్లెక్సీలు ఇప్పటికీ చాలా చోట్ల కనిపిస్తున్నాయని చెప్పారు. రాయ్‌బరేలీలో కూడా గెలిచిన ఆయన ఆ స్థానాన్ని ఉంచుకుని వయనాడ్‌ను వదిలేసి తన చెల్లెలిని పోటీకి దించుతున్నారని, ఇది కుటుంబ ఆధిపత్యానికి నిదర్శనమని.. ఎన్నికల్లో ఇదే తమ ప్రధాన ప్రచారాంశంగా ఉంటుందని నవ్య తెలిపారు.

ప్రియాంక మంచి ప్రతినిధి: రాహుల్

తన చెల్లెలు ప్రియాంక కంటే మంచి ప్రతినిధి వయనాడ్‌కు ఉండరని రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. బుధవారం ఆమె నామినేషన్ దాఖలు కార్యక్రమానికి ఆయనతో పాటు సోనియాగాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా హాజరు కానున్నారు. 'వయనాడ్ ప్రజలకు నా హృదయంలో ప్రత్యేక స్థానం ఉంది. వారికి ప్రియాంక కంటే ఉత్తమ ప్రతినిధిగా మరెవరినీ నేను ఊహించలేను. వయనాడ్ అవసరాలను తీర్చడంలో ఆమె ముందుంటారు. పార్లమెంటులో గట్టిగా తన వాణి వినిపిస్తారు' అని మంగళవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు నామినేషన్ వేసే ముందు 11 గంటలకు కాల్‌పేట కొత్త బస్టాండ్ నుంచి రాహుల్, ప్రియాంక రోడ్‌షో నిర్వహిస్తారు. ఇందులో పాల్గొనాలని ఆయన ప్రజలకు పిలుపిచ్చారు. నవంబరు 13న పోలింగ్ జరుగనుంది. 23న ఓట్లు లెక్కించి ఫలితం ప్రకటిస్తారు.

సంక్షోభానికి చర్చలే పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. సమయం వస్తే అన్ని విధాలా సహకరిస్తామని.. మానవత్వానికే తమ ప్రాధాన్యమని చెప్పారు. రష్యాలోని కజాన్ నగరంలో మంగళవారం ప్రారంభమైన బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) సదస్సుకు హాజరైన ప్రధాని మోదీ.. రష్యా అధినేతతో చర్చలు జరిపారు. జూలైలో ఇరు దేశాల 22వ శిఖరాగ్ర సమావేశం కోసం ప్రధాని మోదీ మాస్కోలో పర్యటించిన సంగతి తెలిసిందే. మూడు నెలల వ్యవధిలోనే ఆయన రష్యాలో రెండోసారి పర్యటించడం గమనార్హం. అప్పటిలాగానే.. బ్రిక్స్ సదస్సు సందర్భంగా మంగళవారం సైతం రష్యా అధ్యక్షుడిని మోదీ ఆలింగనం చేసుకున్నారు. మూడు నెలల్లోపే రష్యాలో రెండోసారి పర్యటిస్తుండడాన్ని ప్రస్తావించి.. ఇది రెండు దేశాల మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలకు, ప్రగాఢమైన విశ్వసనీయతకు నిదర్శనమన్నారు. బ్రిక్స్ సదస్సుకు సారథ్యం వహించడమే కాక.. మరికొన్ని దేశాలూ చేరేలా చొరవ చూపినందుకు పుతిన్‌కు అభినందనలు తెలిపారు. సదస్సు ముగింపు సందర్భంగా.. ఇరాన్, ఈజిప్ట్, ఇథియోపియా, సౌదీ అరేబియా, యూఏఈలను సభ్యదేశాలుగా చేర్చుకుంటూ 'కజాన్ డిక్లరేషన్'ను ప్రకటించనున్నారు. దీంతో సభ్యదేశాల సంఖ్య 10కి పెరగనుంది. కాగా, వాతావరణ మార్పులు, ఆర్థిక సహకారం తదితర కీలక విషయాల్లో ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు బ్రిక్స్ ప్రధాన వేదికగా మారిందని మోదీ పేర్కొన్నారు. కజాన్‌లో భారత రాయబార కార్యాలయాన్ని ప్రారంభించిన ప్రధాని.. రష్యాతో చరిత్రాత్మక సంబంధాలను గుర్తు చేశారు. అలాగే.. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్‌తో కూడా మోదీ భేటీ అయ్యారు.



రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ

మా బంధం దృఢమైనది..

భారత్‌తో సంబంధాలను అత్యంత విశిష్టమైనవిగా పుతిన్ అభివర్ణించారు. ఈ బంధం చెక్కుచెదరని.. స్నేహం నిరంతరం మెరుగవుతూనే ఉంటుందని పేర్కొన్నారు. తన భాషను మోదీ అర్థం చేసుకుంటారని.. ఈ సమావేశంలో అనువాదం అవసరం లేదని వ్యాఖ్యానించారు. దీనికి మోదీ చిరునవ్వులు చిందించారు. కాగా, జూలైలో జరిగిన ద్వైపాక్షిక సమావేశాలను పుతిన్ ప్రస్తావించారు. మోదీ, తాను ఎన్నోసార్లు ఫోన్‌లో మాట్లాడుకున్నట్లు చెప్పారు. తన ఆహ్వానాన్ని మన్నించి కజాన్‌కు వచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. కాగా.. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ బుధవారం భేటీ కానున్నట్టు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడించారు. గడిచిన ఐదేళ్లకాలంలో మోదీ, జిన్‌పింగ్ పలు వేదికలపై కలిసి కనిపించినప్పటికీ.. ముఖాముఖి భేటీ కావడం మాత్రం ఇదే తొలిసారి. 2019లో కిర్గిజ్‌స్థాన్‌లో జరిగిన షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్ సమ్మిట్‌లో వీరిద్దరూ ముఖాముఖి మాట్లాడుకున్నారు. ఆ తర్వాత 2020లో గల్వాన్‌లోయలో ఇరు దేశాల సైనికుల మధ్య ఘర్షణ నేపథ్యంలో ఈ ఇద్దరు నేతలూ ఇన్నాళ్లుగా ఏకాంతచర్చలు జరపలేదు.

కృష్ణభక్తుల స్వాగతం

బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు కజాన్‌కు వెళ్లిన ప్రధాని మోదీకి.. ఆయన బస చేసిన హోటల్ వద్ద ఇస్కాన్ సభ్యులు కృష్ణుడి భజనలతో, సంస్కృత గీతంతో స్వాగతం పలికారు. వారు కృష్ణ భజన చేస్తున్నంతసేపూ మోదీ రెండు చేతులూ జోడించి అలా ఉండిపోయారు. అలాగే, కొందరు రష్యా కళాకారులు.. తమ సంప్రదాయ నృత్యాలతో మోదీకి స్వాగతం పలికారు. ప్రధాని రాక సందర్భంగా ఆ హోటల్ వద్దకు వచ్చిన పలువురు భారతీయులు చేతిలో మువ్వన్నెల పతాకాలను పట్టుకుని, ఉత్సాహంగా ఊపుతూ ఆయన్ను పలకరించారు. వారిలో చాలా మందితో మోదీ కరచాలనం చేశారు. పలువురు ఆయనతో సెల్ఫీలు దిగారు.

పినిపే శ్రీకాంత్ ఆదేశాలతోనే వలంటీర్ హత్య

- మనస్పర్థలు, వ్యక్తిగత విభేదాలతోనే దారుణం
- మెడకు తాడు బిగించి దుర్గాప్రసాద్ హత్య
- కేసు వివరాలు వెల్లడించిన కొత్తపేట డీఎస్పీ

కొత్తపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి గ్రామానికి చెందిన వలంటీర్ జనుపల్లి దుర్గాప్రసాద్ అలియాస్ జనప హత్యకేసులో మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్‌ను అరెస్టు చేసినట్లు కొత్తపేట డీఎస్పీ వై. గోవిందరావు తెలిపారు. శ్రీకాంత్ ఆదేశాలతోనే ఈ హత్య జరిగిందన్నారు. మంగళవారం రాత్రి ఆయన వివరాలను మీడియాకు వెల్లడించారు. "జనుపల్లి దుర్గాప్రసాద్ 2022 జూన్ 6 నుంచి కనిపించకుండా పోయినట్లు ఆయన భార్య శ్రావణ సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశాం. 2022 జూన్ 10న కోటిపల్లి రేవులో దుర్గాప్రసాద్ మృతదేహం కనిపించింది. పోస్టుమార్టం నివేదికలో మెడకు తాడు బిగించి, హత్య చేసినట్లు నిర్ధారణ అయింది. అనుమానితుల ఫోన్ కాల్స్ డేటాను, గూగుల్ టైమ్‌లైన్‌ను విశ్లేషించి 2024అక్టోబరు 18న వడ్డే ధర్మేశ్‌ను అరెస్టు చేశారు. ఆయన ఇచ్చిన స్టేట్‌మెంట్ ప్రకారం పినిపే శ్రీకాంత్‌కు, దుర్గాప్రసాద్‌కు మధ్య మనస్పర్థలు, వ్యక్తిగత విభేదాలు ఉన్నాయని గుర్తించాం. ఈ కారణంగానే శ్రీకాంత్ ఆదేశాల మేరకు కొంతమంది వ్యక్తులు దుర్గాప్రసాద్‌ను చంపడానికి ప్లాన్ చేశారు. 2022 జూన్ 6 రాత్రి వడ్డే ధర్మేశ్.. దుర్గాప్రసాద్‌ను కోటిపల్లి రేవు వద్దకు రప్పించారు. అక్కడ నలుగురు వ్యక్తులు దుర్గాప్రసాద్‌పై దాడి చేసి మెడకు తాడు బిగించి చంపినట్లు ధర్మేశ్ చెప్పారు. ఆ తర్వాత శ్రీకాంత్ హైదరాబాద్, అక్కడ నుంచి తమిళనాడుకు పారిపోయి ఫోన్ స్విచ్‌ఆఫ్ చేశారు. శ్రీకాంత్ కాల్‌డేటా, లోకేషన్ ఆధారంగా 2024 అక్టోబరు 20 రాత్రి మదురైలో పోలీసులు అరెస్టు చేసి కొత్తపేట తీసుకువచ్చారు. రిమాండ్ రిపోర్టుతోపాటు అమలాపురం కోర్టు మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచాం" అని డీఎస్పీ వివరించారు.



శ్రీకాంత్ రభస

డీఎస్పీ మీడియాతో మాట్లాడుతున్న సమయంలో పోలీసుల ప్రత్యేక వాహనంలో ఉన్న శ్రీకాంత్.. బయటకు వచ్చి బిగ్గరగా అరుస్తూ రభస చేశారు. "నన్ను కుట్రపూరితంగా ఇరికించారు. చనిపోయిన దుర్గాప్రసాద్ నాకు అత్యంత సన్నిహితుడు" అని కేకలు వేశారు. హత్య కేసులో అన్యాయంగా ఇరికిస్తున్నారని పినిపే శ్రీకాంత్ ఆరోపించారు.

ముస్లింలు మూడో వివాహాన్ని రిజిస్టర్ చేసుకోవచ్చు

- పర్సనల్ లా అందుకు అనుమతి ఇస్తోంది: బాంబే హైకోర్టు

ముంబయి, అక్టోబరు 22: ముస్లింలు ఒకటి కన్నా ఎక్కువ వివాహాలను రిజిస్టర్ చేసుకోవచ్చని, ఇందుకు వారి పర్సనల్ లా అనుమతి ఇస్తోందని బాంబే హైకోర్టు తెలిపింది. మూడో వివాహం రిజిస్టర్ చేయాలంటూ ఓ వ్యక్తి చేసిన వినతిపై తగిన నిర్ణయం తీసుకోవాలని థాణె మునిసిపల్ కార్పొరేషన్ అధికార్లకు ఆదేశాలు ఇస్తూ ఈ మేరకు స్పష్టత ఇచ్చింది. ఆ వ్యక్తి అల్జీరియాకు చెందిన మహిళను మూడో వివాహం చేసుకున్నాడు. దాన్ని రిజిస్టర్ చేయాల్సిందిగా ఫిబ్రవరిలో థాణె మునిసిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మ్యారేజీ రిజిస్ట్రార్ కార్యాలయంలో దరఖాస్తు చేశాడు. అయితే మహారాష్ట్ర వివాహ బ్యూరోల నియంత్రణ-వివాహాల రిజిస్ట్రేషన్ చట్టం ప్రకారం ఒక వివాహాన్ని మాత్రమే రిజిస్టర్ చేసే అవకాశం ఉందని పేర్కొంటూ అతని వినతిని తిరస్కరించారు. దాంతో ఆయన పిటిషన్ దాఖలు చేయగా జస్టిస్ బి.పి.కొలాబావాలా, జస్టిస్ సోమశేఖర్ సుదర్శన్‌ల ధర్మాసనం విచారణ జరిపింది.

లోకం తీరు



తూర్పు లద్దాఖ్‌లో
ప్రతిష్టంభన తొలగినట్టే!

- భారత్‌తో ఒప్పందాన్ని నిర్ధారించిన చైనా
- అమలు కోసం కలిసి పనిచేస్తామని వెల్లడి
- విశ్వాసం పునరుద్ధరణకు ప్రయత్నిస్తున్నామన్న భారత ఆర్మీ చీఫ్

బీజింగ్, అక్టోబరు 22: తూర్పు లద్దాఖ్‌లో నాలుగేళ్లుగా భారత సైన్యంతో కొనసాగుతున్న ప్రతిష్టంభన తొలగినట్టేనని చైనా వెల్లడించింది. సరిహద్దు గస్తీపై ఇరుదేశాలూ ఒక ఒప్పందానికి వచ్చాయని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, విదేశాంగశాఖ కార్యదర్శి విక్రం మిశ్రీ సోమవారం వెల్లడించిన విషయం తెలిసిందే. అయితే, మంగళవారం వరకూ దీనిపై చైనా నుంచి ఎటువంటి ప్రకటనా వెలువడలేదు. బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మంగళవారం రష్యాకు పయనమైన తర్వాత చైనా నుంచి తాజా ఒప్పందంపై ప్రకటన వెలువడింది. చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ మంగళవారం బీజింగ్‌లో మీడియా అడిగిన ఒక ప్రశ్నకు ఈ మేరకు సమాధానం ఇచ్చారు. ఒప్పందం అమలు కోసం భారత్‌తో కలిసి చైనా పనిచేస్తుందని ఆయన చెప్పారు. బ్రిక్స్ సదస్సులో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో జిన్‌పింగ్ ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉందా? అని మీడియా ప్రశ్నించగా, అలాంటిది ఏమైనా ఉంటే తెలియజేస్తామని లిన్ సమాధానమిచ్చారు. కాగా, సరిహద్దు గస్తీపై భారత్, చైనా ఒక ఒప్పందానికి వచ్చిన నేపథ్యంలో ఇప్పుడు విశ్వాసం పునరుద్ధరణకు ప్రయత్నిస్తున్నామని భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది చెప్పారు. దీని కోసం ఇరుపక్షాలూ ఒకరికొకరు భరోసా ఇవ్వాల్సి ఉంటుందన్నారు. మంగళవారం ఢిల్లీలో ఆయన మాట్లాడారు.

రష్యాకు ఉ.కొరియా సైన్యంపై ద.కొరియా ఆందోళన

సియోల్, న్యూయార్క్, అక్టోబరు 22: ఉక్రెయిన్‌పై చేస్తున్న యుద్ధంలో రష్యా తరఫున పాల్గొనేందుకు ఉత్తర కొరియా తన సైనికులను పంపించడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ చర్య తమ భద్రతకు, అంతర్జాతీయ సమాజానికి ముప్పు కలిగిస్తుందని దక్షిణ కొరియా తెలిపింది. అందువల్ల ఉత్తర కొరియా సైనికులను వెంటనే వెనక్కి పిలిపించాలని డిమాండు చేసింది. ఈ నెల మొదట్లో ఉత్తర కొరియా 1,500 మంది ప్రత్యేక ఆపరేషన్ దళాల సిబ్బందిని రష్యాకు పంపించినట్టు దక్షిణ కొరియా నిఘా వర్గాలు తెలిపాయి. 10వేల మంది ఉత్తర కొరియా సైనికులు రష్యాకు మద్దతుగా వస్తారన్న సమాచారం తనకు అందిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ ప్రకటించారు. నవంబరు ఒకటో తేదీన ఆ సైనికులు యుద్ధభూమికి వెళ్లే అవకాశం ఉందని అమెరికా అంచనా వేస్తోంది. ప్రస్తుతం వారు రష్యాలోని తూర్పు ప్రాంతంలో శిక్షణ పొందుతూ వాతావరణ పరిస్థితులకు అలవాటు పడుతున్నారని భావిస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం దక్షిణ కొరియా విదేశాంగ శాఖ ఉప మంత్రి కిమ్ హోంగ్ కిన్ తమ దేశంలోని రష్యా రాయబారి గ్రెగోరీ జినోవివ్‌ను పిలిపించి తీవ్ర నిరసన తెలిపారు. మరోవైపు ఉత్తర కొరియా నిర్ణయం 'ప్రమాదకరం...తీవ్ర ఆందోళనకర పరిణామం' అని అమెరికా అభిప్రాయపడింది. ఈ 'నాటకీయ పరిణామం'పై మిత్రపక్షాలతో చర్చలు జరిపినట్టు తెలిపింది. ఇందుకు ఉత్తర కొరియాకు భారీ మూల్యాన్ని చెల్లించాల్సి వస్తుందని అమెరికా, బ్రిటన్‌లు కలిసి రష్యాను హెచ్చరించాయి.

నేవీ చేతికి మరో అణ్వాస్త్రం..!

భారత్ అమ్ములపొదిలో మూడో స్వదేశీ అణు జలాంతర్గామి.. రెండు నెలల వ్యవధిలో రెండో సబ్‌మెరైన్ ప్రారంభం

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవలే స్వదేశీ అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిఘాత్‌ను అట్టహాసంగా ప్రారంభించిన భారత్.. రెండు నెలల వ్యవధిలోనే మరో న్యూక్లియర్ సబ్‌మెరైన్‌ను జలప్రవేశం చేయించి ప్రపంచం నివ్వెరపోయేలా చేసింది. హిందూ-పసిఫిక్ ప్రాంతంలో చైనా సముద్ర కార్యకలాపాలు పెచ్చుమీరుతున్న తరుణంలో.. భారత్ తన సముద్ర అణ్వాయుధ రక్షణ సామర్థ్యాన్ని పెంచుకునే దిశగా మరో అణు జలాంతర్గామిని రంగంలోకి దించింది. విశాఖపట్నంలోని షిప్ బిల్డింగ్ సెంటర్ (ఎస్‌బీసీ) నుంచి ఈ నెల 16నే తన నాలుగో అణు జలాంతర్గామి ఎస్4స్టార్‌ను గుట్టుచప్పుడు కాకుండా ప్రారంభించింది. విశాఖపట్నం కేంద్రంగా అణు జలాంతర్గాముల నిర్మాణం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇక్కడి వ్యవహారాలన్నీ నేరుగా ఢిల్లీలోని ప్రధాన మంత్రి కార్యాలయమే పర్యవేక్షిస్తోంది. ఈ ఏడాది ఆగస్టు 29న ఇదే ఎస్‌బీసీ నుంచి కొత్త అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిఘాత్‌ను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఇది జరిగి రెండు నెలలైనా కాకముందే మరో శక్తిమంతమైన, అంతకంటే మెరుగైన అణు జలాంతర్గామిని సిద్ధం చేయడంపై ప్రపంచ దేశాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. పైగా ఇది 75శాతానికి పైగా దేశీయంగా తయారైనది కావడం విశేషం.



దేశీయంగా మూడోది.. మొత్తంగా నాలుగోది

భారత నౌకాదళం తొలుత రష్యా నుంచి అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ చక్రను లీజుకు తీసుకుంది. అది విశాఖపట్నం కేంద్రంగానే పనిచేస్తోంది. ఆ తర్వాత విశాఖలోని తూర్పు నౌకాదళాన్ని నేవీ సబ్‌మెరైన్ల కేంద్రంగా ప్రకటించి, ఇక్కడే అణు జలాంతర్గాముల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీనికి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వెహికల్ (ఏటీవీ) ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా నాలుగు అణు జలాంతర్గాములు నిర్మించాలని నిర్ణయించారు. తొలుత ఐఎన్ఎస్ అరిహంత్‌ను నిర్మించారు. ఇది 2009లో సముద్ర పరీక్షలకు వెళ్లి 2016 నుంచి నేవీకి సేవలందించడం ప్రారంభించింది. దానికి పరీక్షలు జరుగుతున్న సమయంలోనే ఐఎన్ఎస్ అరిఘాత్ నిర్మాణం ప్రారంభించారు. ఇది 2017 నుంచి సీ ట్రయల్స్‌కు వెళుతూ రెండు నెలల క్రితమే నేవీలో చేరింది. తాజాగా వారం రోజుల క్రితం ఎస్‌బీసీ నుంచి మూడో అణు జలాంతర్గామి ఎస్4స్టార్ సముద్ర జలాల్లోకి ప్రవేశించింది. దీనికి ఐఎన్ఎస్ అరిధమన్‌గా పేరు పెడతారని విశ్వసనీయ సమాచారం.

ఎస్-1 నుంచి ఎస్-4 వరకు

అణు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించే వీటిని స్ట్రాటజిక్ స్ట్రయిక్ న్యూక్లియర్ సబ్‌మెరైన్లు (ఎస్ఎస్‌బీఎన్)గా వ్యవహరిస్తున్నారు. రష్యా నుంచి లీజుకు తీసుకున్న ఐఎన్ఎస్ చక్రను ఎస్-1గా, అరిహంత్‌ను ఎస్-2గా, అరిఘాత్‌ను ఎస్-3గా, తాజాగా జలప్రవేశం చేసిన దానిని ఎస్-4స్టార్‌గా వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి ఎస్‌బీసీలో ఇప్పటివరకూ నిర్మితమైనవి మూడు మాత్రమే.

అరిహంత్ క్లాసులోనే భారీ తేడా

ఏటీవీ ప్రాజెక్ట్ కింద నిర్మిస్తున్న సబ్‌మెరైన్లను అరిహంత్ క్లాస్‌గా వ్యవహరిస్తున్నారు. అరిహంత్ సబ్‌మెరైన్ నుంచి కె-15 బాలిస్టిక్ మిస్సైళ్లను ప్రయోగించగలుగుతున్నారు. ఇవి 750 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని ఛేదిస్తాయి. అరిఘాత్ విషయానికి వస్తే 3,500 కి.మీ. దూరంలోని లక్ష్యాన్ని ఛేదించగలిగే కే-4 మిస్సైళ్లను ప్రయోగించేలా తీర్చిదిద్దారు. ఇది సముద్రం లోపల గంటకు 44కి.మీ. వేగంతో ప్రయాణిస్తుంది. ఈ రెండింటిలో నాలుగు మిస్సైల్ ట్యూబులు ఉన్నాయి. కాగా, వీటికి అప్‌గ్రేడ్ వెర్షన్‌గా రూపొందించిన ఎస్-4స్టార్‌లో ఎనిమిది మిస్సైల్ ట్యూబులు ఉంటాయి. దీని నుంచి మిస్సైళ్లను నిట్టనిలువుగా కూడా ప్రయోగించే అవకాశం ఉంది. ఇవి కూడా 3,500 కి.మీ. దూరంలోని లక్ష్యాలను అలవోకగా ఛేదిస్తాయి. ఈ అణు జలాంతర్గాములు సముద్రంలో ఎంత దూరమైనా ప్రయాణించగలవు. వీటికి పరిమితి లేదు. వాటికి అవసరమైన ఇంధనం, సమయానుసారం నిర్వహణ, లోపల ఉండే సిబ్బందికి అవసరమైన ఆహారం, ఆరోగ్య సహకారం అందించగలిగితే సముద్రంలో ఎంత దూరమైనా ప్రయాణిస్తాయి. అరిహంత్, అరిఘాత్ రెండూ ప్రస్తుతం భారత జలాల సరిహద్దు పరిరక్షణకు పహారా కాస్తున్నాయి.

ప్రధాని చేతుల మీదుగా రాష్ట్ర విజన్ ప్రణాళిక!

» నవంబరు మొదటివారంలో ముహూర్తం

అమరావతి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విజన్ ప్రణాళికను ప్రధాని మోదీ ఆవిష్కరించనున్నారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో 'వికసిత్ ఆంధ్రప్రదేశ్-2047'కు రూపకల్పన జరుగుతోంది. ఎన్డీయే సర్కారు జాతీయ స్థాయిలో 'వికసిత్ భారత్' పేరుతో ప్రణాళిక తయారుచేస్తుండగా టీడీపీ కూటమి ప్రభుత్వం రాష్ట్ర స్థాయి ప్రణాళిక తయారీకి సంకల్పించింది. గతంలో చంద్రబాబు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండగా విజన్-2020 ప్రణాళిక తయారు చేయించిన సంగతి తెలిసిందే. ఆయన హయాంలోనే ఇప్పుడు నవ్యాంధ్ర అభివృద్ధికి రెండో ప్రణాళిక రూపొందుతోంది. దీని ఆవిష్కరణకు రావాలని ప్రధానిని ఇప్పటికే చంద్రబాబు కోరారు. అందుకు ఆయన అంగీకరించారు. నవంబరు మొదటివారంలో ప్రధాని చేతుల మీదుగా దీని ఆవిష్కరణ జరిగే అవకాశముందని అంటున్నారు. నిర్దిష్టంగా తేదీ ఖరారు కావలసి ఉంది. మొదటివారంలో ఆవిష్కరణ ఉంటుందన్న యోచనతో అధికార వర్గాలు ప్రణాళికకు తుది రూపు ఇవ్వడానికి వేగంగా పనిచేస్తున్నాయి. ఇందులో రాష్ట్ర స్థాయి మొదలుకొని మండల స్థాయి వరకూ విడివిడిగా ప్లాన్లు ఉంటాయి.

పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జిల గడువు ఆర్నెల్లు పెంపు

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు అధికారిక పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించింది. ఇందులో భాగంగా 70 పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జిల పదవీకాలాన్ని పొడిగించి, 7 పీఏసీఎస్‌లకు కొత్త పర్సన్ ఇన్‌చార్జిలను నియమించింది. ఏపీ స్టేట్ కోఆపరేటివ్ యూనియన్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీని ఆరు నెలలు పొడిగించింది. విజయవాడ దుర్గా అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్‌కు ముగ్గురు అధికారిక సభ్యులతో పర్సన్ ఇన్‌చార్జి కమిటీని ఆరు నెలల కాలపరిమితితో నియమిస్తూ మంగళవారం వేర్వేరు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఎన్నికల వ్యయం అత్యంత ఆందోళనకరం

» రాజకీయాల్లో పెరిగిన ఖర్చుతో ప్రజాస్వామ్యం బలహీనం
» పదవీ విరమణ చేశానే తప్ప పెదవి విరమణ చేయలేదు
» ప్రజలు మళ్లీ సిద్ధాంతపర రాజకీయాలను ప్రోత్సహించాలి
» మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పిలుపు


మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

గుంటూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): 'ఎన్నికల్లో పెరుగుతున్న వ్యయం అత్యంత ఆందోళన కలిగిస్తోంది. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.30, 40 కోట్లు ఖర్చు చేయడమంటే మామూలు విషయం కాదు. మంచివారు, ప్రజలకు సేవ చేస్తారనేవారు కూడా ఆ స్థాయిలో ఖర్చుపెట్టాల్సి రావడమే విషాదంగా ఉంది. సిద్ధాంతపర రాజకీయాలు కొరవడటమే అందుకు కారణం. సిద్ధాంతపర రాజకీయాలు, విలువలతో కూడిన రాజకీయాల వైపు సమాజాన్ని నడపడమే మన ముందున్న కర్తవ్యం' అంటూ మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు అన్నారు. మంగళవారం ఆయన గుంటూరులో మీడియాతో మాట్లాడారు. 'ప్రస్తుతం అవకాశవాదం, కులం, ప్రాంతీయ విద్వేషాలపై రాజకీయాలు చేస్తున్నారు. వీటన్నింటినీ మించి ఆందోళన కలిగించే విషయం ఎన్నికల ఖర్చు. నేను 1978, 83లో ఎమ్మెల్యేగా ఉన్నా. ప్రజలు ఇచ్చిన విరాళం రూ.64 వేలతో ఎన్నికలకు వెళ్లా. అప్పట్లో జనానికి డబ్బులిచ్చే పరిస్థితి లేదు. వారే డబ్బులిచ్చి ఎన్నికల్లో నిలబెట్టేవాళ్లు. ఆనాటి రాజకీయాలు అలా ఉండేవి. ప్రస్తుత రాజకీయాల్లో పెరిగిన ఖర్చు కారణంగా ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది. ప్రజలు మళ్లీ సిద్ధాంతపర రాజకీయాలను ప్రోత్సహించాలి' అని వెంకయ్య కోరారు. తాను పదవీ విరమణ చేశానే తప్ప పెదవి విరమణ చేయలేదని, ఇన్నేళ్ల అనుభవంతో రాజకీయాల్లో మార్పు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. మీడియా సంస్థలు కూడా బాధ్యతగా పనిచేయాలని, విశ్వసనీయతకు నిలిచేలా సమాచారాన్ని కన్ఫర్మ్ చేసుకోవాలని సూచించారు. నమ్మకమైన సమాచారం ఆయుధాన్ని మించిందని చెప్పారు. 'రాజకీయ నాయకులే స్వయంగా టీవీ చానళ్లు పెట్టుకున్నారు. స్వార్థపరులు కూడా ఆ జాబితాలో చేరారు. సోషల్ మీడియాతో చైతన్యం వచ్చింది. అంతకుమించిన ప్రమాదాన్ని తెచ్చింది' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి మీడియా సంస్థ సత్యానికి దగ్గరగా, సంచలనాలకు దూరంగా ఉండాలని కోరారు. యువత రాజకీయాల్లోకి వస్తే అవినీతి, దోపిడీ వంటివాటికి ఆస్కారం తగ్గుతుందని, వ్యవస్థ మార్పు చెందుతుందని వెంకయ్య నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు.



రాష్ట్రపతి నుంచి పురస్కారం అందుకుంటున్న విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, కేంద్ర మంత్రి సీఆర్‌పాటిల్ నుంచి అవార్డు అందుకుంటున్న హంపాపురం సర్పంచ్ లక్ష్మీదేవి

రాష్ట్రానికి ఐదు జాతీయ జల పురస్కారాలు

న్యూఢిల్లీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ప్రకటించిన ఐదో జాతీయ జల పురస్కారాల్లో ఐదింటిని ఆంధ్రప్రదేశ్ కైవసం చేసుకుంది. ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరై అవార్డులు అందజేశారు. జాతీయ జల పురస్కారాలకు సంబంధించి సౌత్‌జోన్‌లో ఉత్తమ జిల్లా కేటగిరిలో ఎంపికైన విశాఖపట్నం తరఫున అవార్డును ఆ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, ఈఎన్‌సీ టీవీఎస్‌ఏ రత్న కుమార్ రాష్ట్రపతి నుంచి అందుకున్నారు. ఉత్తమ గ్రామపంచాయతీ కేటగిరిలో మూడో స్థానంలో నిలిచిన అనంతపురం జిల్లాలోని హంపాపురం తరఫున ఆ గ్రామ సర్పంచ్ గురువా లక్ష్మీదేవి, నీటిని పొదుపు చేసిన ఉత్తమ విద్యాసంస్థల కేటగిరిలో రెండో స్థానంలో కేఎల్‌యూ ఎడ్యుకేషన్ ఫౌండేషన్, మూడో స్థానంలో విశాఖపట్నంలోని తిరుమలనగర్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్, తిరుపతి ఐఐటీ(స్పెషల్ మెన్షన్) తరఫున ఆయా సంస్థల ప్రతినిధులు కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.


రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జమ్ము కశ్మీర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

వికసిత్ భారత్‌లో యువత పాత్ర కీలకం

» జమ్ము కశ్మీర్ విద్యార్థులతో గవర్నర్
» అసెంబ్లీని సందర్శించిన బృందం
» ఏపీ ప్రజలు మంచోళ్లని కితాబు

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అతిపెద్ద ఉన్నత విద్యావ్యవస్థగా పేరొందిన దేశ ఉన్నత విద్యావ్యవస్థలో ఉన్న అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ సూచించారు. కశ్మీరీ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమంలో భాగంగా జమ్మూ కశ్మీర్‌లోని ఆరు జిల్లాలకు చెందిన 150 మంది విద్యార్థులు ఈ నెల 20 నుంచి 25 వరకూ ఏపీలో పర్యటిస్తున్నారు. మంగళవారం రాజ్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ వారితో సుదీర్ఘంగా సంభాషించారు. వికసిత్ భారత్-2047 లక్ష్యాలను చేరుకోవడంలో యువత కీలక పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు. యువత రేపటి నాయకులు మాత్రమే కాదని, నేటి మార్పును సృష్టించేవారని అన్నారు. అంతకుముందు విద్యార్థులు తమ రాష్ట్ర పర్యటన అనుభవాలను గవర్నర్‌తో పంచుకున్నారు. కాగా, జమ్మూ కశ్మీర్ యువ బృందం మంగళవారం అమరావతిలోని అసెంబ్లీని సందర్శించింది. ఇక్కడి వాతావరణం బాగుందని, తమకు చక్కటి సదుపాయాలు కల్పించారని బృందం సభ్యులు చెప్పారు. ఏపీ ప్రజలు మంచివారని కితాబిచ్చారు. ఇక్కడి ప్రజల ఆహార అలవాట్లు, జీవన విధానం గురించి తెలుసుకున్నామని ఫజల్ అనే యువకుడు తెలిపారు. తమకు తెలుగు రాకపోయినా ఇక్కడి ప్రజలు తాము మాట్లేడేది అర్థం చేసుకోవడానికి ఇక్కడివారు ప్రయత్నించారని, రాష్ట్రానికి వచ్చిన తమను బాగా చూసుకున్నారని కొనియాడారు.

పాఠశాలలకు కాంపోజిట్ గ్రాంట్లు రూ.51.9 కోట్లు విడుదల చేస్తూ సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విద్యా సంవత్సరంలో రూ.103.8 కోట్లు ఇవ్వాల్సి ఉండగా, అందులో సగం ఇప్పుడు విడుదల చేశారు. అలాగే మండల రీసోర్స్ కేంద్రాలకు మరో రూ.8.82 కోట్లు విడుదల చేశారు.


వార్షికోత్సవ వేడుకల్లో శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ సీఎండీ గల్లా రామచంద్రరావు, సంస్థ డైరెక్టర్లు

నిర్మాణ రంగంలో నూతన ఒరవడి

» ఇది శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ ఆశయం: గల్లా రామచంద్రరావు
» గుంటూరులో కోలాహలంగా సంస్థ 9వ వార్షికోత్సవం

గుంటూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నిర్మాణ రంగంలో కొత్తదనం సృష్టించాలన్న సదాశయంతోనే 2015 సంవత్సరంలో శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ప్రారంభించామని ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) గల్లా రామచంద్రరావు తెలిపారు. శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ 9వ వార్షికోత్సవం గుంటూరులోని సిద్ధార్థ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం కోలాహలంగా జరిగింది. 9 వేల మందికి పైగా కుటుంబాల సొంతింటి కల నెరవేర్చి, కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో 30కి పైగా అత్యద్భుతమైన ప్రాజక్టులను అభివృద్ధి చేశామని ఈ సందర్భంగా రామచంద్రరావు తెలిపారు. స్థిరాస్థి రంగంలో శ్రీ భ్రమర తనదైన ముద్రతో, ఎనిమిదేళ్ల సుస్థిర ప్రస్థానాన్ని పూర్తి చేసుకుందన్నారు. నేటి సమాజానికి విలాసవంతమైన జీవనశైలిని అందించటంతో పాటు భారతరత్న డాక్టర్ అబ్దుల్‌కలాం కల'పుర'ను స్ఫూర్తిగా తీసుకొని గ్రామీణ ప్రాంతాల్లోనూ ఆధునిక సౌకర్యాలు, వసతులతో కూడిన ప్రాజెక్టులు చేపట్టామని వెల్లడించారు. శ్రీ భ్రమర దిగ్విజయ ప్రస్థానంలో సహకారం, ప్రోత్సాహం అందించిన కస్టమర్లకు మార్కెటింగ్ మిత్రులకు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ వేడుకల్లో సంస్థ డైరెక్టర్లు మారం చంద్రశేఖర్, ఎంఎస్ రాజు, ఎంపీకే లక్ష్మీపతిరాజు, శైలారెడ్డి కోట, యడ్లపల్లి మురళీకృష్ణ, రావెల గోపాలకృష్ణతో పాటు కాకర్ల సతీష్, కమ్మ రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమికుడి దాడిలో గాయపడ్డ యువతి మృతి

» నిందితుడిని అరెస్టు చేశామని డీఎస్పీ వెల్లడి

తెనాలి అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తెనాలిలో మూడ్రోజుల క్రితం ప్రేమించిన వ్యక్తి దాడిలో గాయపడిన యువతి మృతిచెందింది. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మరణించిందని వైద్యులు ప్రకటించారు. నిందితుడిని మంగళవారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఐతానగర్‌కు చెందిన సహన కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామానికి చెందిన రాగి నవీన్ అనే వ్యక్తితో ప్రేమలో ఉంది. ఆరేళ్లుగా వీరిద్దరి మధ్య సాన్నిహిత్యం ఉంది. ఈ క్రమంలో యువతి గర్భం దాల్చడంతో.. ఏం చేద్దామని నవీన్‌ను ఆమె ప్రశ్నించింది. రౌడీషీటర్ కూడా అయిన నవీన్.. ఈ నెల 19న ఆమెను కారులో కఠెవరం గ్రామ శివారుకు తీసుకువెళ్లాడు. అక్కడ వీరిద్దరి మధ్య గొడవ జరిగింది. నవీన్ ఆ యువతి తలను కారు డోరుకు గట్టిగా కొట్టడంతో తలకు బలమైన గాయమైంది. బ్రెయిన్ డెడ్ అయిన సహనను అతనే తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లి బాధితురాలిని తల్లికి సమాచారం ఇచ్చాడు. మెరుగైన వైద్యం కోసం బాధితురాలిని ఆమె తల్లి మంగళగిరి ఎయిమ్స్‌కు, చివరకు గుంటూరు జీజీహెచ్‌కు తీసుకెళ్లింది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు గుంటూరు, బద్వేలుకు జగన్

వైసీపీ అధినేత వైఎస్ జగన్ బుధవారం గుంటూరు జీజీహెచ్ వెళ్లనున్నారు. యువతి మృతదేహానికి పోస్టుమార్టం నేపథ్యంలో బాధిత కుటుంబసభ్యులను ఆయన పరామర్శిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఆ తర్వాత వైఎస్సార్ జిల్లా బద్వేలు చేరుకుని అక్కడ ప్రేమోన్మాది ఘాతుకానికి మృతిచెందిన బాలిక కుటుంబాన్ని పరామర్శిస్తారు.

అమిత్‌షాకు పవన్ జన్మదిన శుభాకాంక్షలు

అమరావతి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దేశ అంతర్గత భద్రతా వ్యవస్థను పటిష్టపరచడంలో అమిత్‌షా ప్రభావవంతమైన పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రాల్లో సంభవించే ప్రకృతి విపత్తుల సమయంలోనూ సత్వరం స్పందిస్తున్నారన్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం కూటమి తరఫున అందించిన సూచనలు, విజ్ఞప్తులను సానుకూలంగా పరిశీలిస్తున్నారని పేర్కొన్నారు. దేశమే ముందు అనే విశాల భావన కలిగిన అమిత్‌షాకు సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పవన్ తెలిపారు.

వంగవీటి రాధాకు మంత్రి లోకేశ్ పరామర్శ


వంగవీటి కుటుంబంతో మంత్రి లోకేశ్

తాడేపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అస్వస్థతకు గురై కోలుకుంటున్న మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణను రాష్ట్ర విద్య, ఐటి శాఖామంత్రి నారా లోకేశ్ మంగళవారం పరామర్శించారు. ఢిల్లీ పర్యటన ముగించుకుని విజయవాడ చేరుకున్న లోకేశ్.. తాడేపల్లి మండలం ప్రాతూరులోని వంగవీటి రాధా ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రాధా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కించాలి

» ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాల సంఘం

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో విడుదల చేయకపోవడంతో అప్పులు చేసి కాలేజీలు నడుపుతున్నామని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాల సంఘం తెలిపింది. బకాయిలు భారీగా పేరుకుపోవడంతో చివరికి అప్పులు కూడా దొరకని పరిస్థితి ఏర్పడిందని పేర్కొంది. ఆర్థిక కష్టాల నుంచి తమను గట్టెక్కించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మంగళవారం విజయవాడలో సంఘం ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కాలేజీల పరిస్థితిని అర్థంచేసుకుని వెంటనే బకాయిలు విడుదల చేయాలని కోరారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సయోధ్య దిశగా...!

ప్రధాని నరేంద్రమోదీ బ్రిక్స్ సదస్సుకు బయలుదేరడానికి ఒక రోజుముందు భారత్–చైనా సరిహద్దుల్లో ఉద్రిక్తతలను తగ్గించే దిశగా ఓ అడుగుపడింది. వాస్తవాధీనరేఖ వద్ద బలగాల ఉపసంహరణకు సంబంధించి ఇరుదేశాలూ ఓ ఒప్పందానికి వచ్చాయని, ఎల్ఏసీ వద్ద మళ్ళీ గస్తీ ఆరంభమవుతుందని భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ప్రకటించారు. అనేక వారాలుగా రెండుదేశాల మధ్యా జరుగుతున్న చర్చలు ఫలించి ఈ బలగాల ఉపసంహరణ నిర్ణయం జరిగిందని, నాలుగేళ్ళుగా రగులుతున్న సరిహద్దు సమస్య పరిష్కారానికి మార్గం సుగమం అయిందని అన్నారాయన. దౌత్య, సైనికమార్గాల్లో రెండుదేశాల మధ్యా చర్చోపచర్చలు జరిగాయని, ఒప్పందం నిజమేనని చైనా మంగళవారం ధ్రువీకరించింది. బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో చైనా అధ్యక్షుడితో భారత ప్రధాని భేటీకి ఈ పరిణామం వీలు కల్పిస్తుందని విశ్లేషకుల అభిప్రాయం.

సరిహద్దుల్లో తిరిగి ప్రశాంతత నెలకొంటుందంటే కచ్చితంగా స్వాగతించవలసిందే. 2020 గల్వాన్ లోయ ఘర్షణ రెండుదేశాల మధ్య వైషమ్యాలను పెంచింది. ఘర్షణలో కర్నల్ సంతోష్‌బాబు సహా 20 మంది భారత సైనికులు మరణించారు. తుపాకులు, పేలుడు పదార్థాలు ఉపయోగించకూడదని 1996 నాటి ఒప్పందం చెబుతున్నందున, ఇరుదేశాల సైనికులు కర్రలతోనూ, రాళ్ళతోనూ తీవ్రంగా దాడిచేసుకున్నారు. చైనా భారీగా సైనికులను కోల్పోయినప్పటికీ కొన్ని నెలలపాటు ఆ వివరాల జోలికి పోలేదు. చాలాకాలం తరువాత ఐదుగురు చనిపోయినట్టు అంగీకరించినా ఆ సంఖ్య నిజం కాదన్న అనుమానాలున్నాయి. 2021లో ఉత్తర సిక్కింలో, మరుసటి ఏడాది తవాంగ్ సెక్టార్ సరిహద్దుల్లో ఇరుదేశాల సైనికుల మధ్యా ఘర్షణలు జరిగాయి. రెండుదేశాలు అధీనరేఖ వెంబడి భారీ స్థాయిలో బలగాలను మోహరించడంతో ఉద్రిక్తతలు పెరిగాయి. భారత్–చైనా మధ్య దాదాపు మూడున్నరవేల కిలోమీటర్ల అత్యంత కఠినమైన, వివాదాస్పద సరిహద్దు ఉంది. వైషమ్యాలు హెచ్చుతున్న కొద్దీ ఉభయదేశాలు సరిహద్దు వెంబడి రోడ్లు, వంతెనలు నిర్మిస్తూ పోతున్నాయి. చైనా ఏకంగా కొత్త గ్రామాలనే స్థిరపరుస్తోంది.

ఈ నేపథ్యంలో, ఈ కీలకమైన ఒప్పందంతో 2020 పూర్వస్థితికి వెళ్ళాం, బలగాల ఉపసంహరణ కూడా దాదాపుగా ముగిసింది, ఇదొక అద్భుతమైన పరిణామం అని విదేశాంగమంత్రి ఒక చానెల్ చర్చల్లో ఉత్సాహంగా వ్యాఖ్యానించినప్పటికీ, ఒప్పందంలో ఉన్నదేమిటో తెలిస్తే కానీ, అది అద్భుతమో కాదో చెప్పలేమని విపక్షాలు అంటున్నాయి. గల్వాన్ ఘటన జరిగినప్పటి నుంచి విపక్షాలు నరేంద్ర మోదీ ప్రభుత్వంమీద విమర్శలతోపాటు, అనుమానాలు వెలిబుచ్చడం కూడా జరుగుతోంది. చైనా మన భూభాగంలోకి అంగుళం కూడా రాలేదంటూ మోదీ ప్రభుత్వం దబాయిస్తున్న విషయం తెలిసిందే. భారత భూభాగంలోకి ఏ ఒక్కరూ చొరబడలేదు, ఒక్క పోస్టును కూడా చెరబట్టలేదు అని ప్రధాని స్వయంగా చేసిన ప్రకటనతో మనకు జరిగిన అన్యాయం వెనక్కుపోయి, మన వాదన వీగిపోయిందని కాంగ్రెస్ మండిపడుతోంది. చైనా ఎన్ని వీరంగాలు వేసినా, సరిహద్దు వెంబడి అనేక చొరబాట్లకు పాల్పడినా, కొద్దికొద్దిగా మన భూభాగాన్ని మింగివేసినా భారత ప్రభుత్వం దేశప్రజలకు నిజాలు తెలియనివ్వలేదని, చట్టసభల్లో చర్చకు మోకాలడ్డుతూ విపక్షాల నోరుమూయించే ప్రయత్నం చేసిందని దాని విమర్శ.

చైనా చొరబాట్లు, దుందుడుకు వైఖరి కారణంగా ఇప్పటికే మనకు జరిగిన నష్టాన్ని ఈ ఒప్పందం ఏ మేరకు పూడుస్తుందో, దురాక్రమించుకున్న ప్రాంతాల నుంచి అది ఎంతమేరకు వైదొలుగుతున్నదో చూడాలి. అన్ని పాయింట్ల నుంచి చైనా వెనక్కు తగ్గి, గతంలో మనం గస్తీ తిరిగినవన్నీ తిరిగి దక్కడం ముఖ్యం. ఉత్తర లద్దాఖ్‌లోని డెప్సాంగ్, దక్షిణంలోని డెమ్‌చోక్ వంటి ప్రాంతాల్లో పెట్రోలింగ్ హక్కులు వస్తే సైనికపరంగా మనకు ఎంతో ఉపయోగం. కొత్త ఒప్పందంలో భాగంగా కీలకమైన ప్రాంతాల్లో పెట్రోలింగ్ వివరాలను రెండుదేశాలు ఎప్పటికప్పుడు ఇచ్చిపుచ్చుకుంటాయట. త్వరలోనే మరిన్ని వివరాలు తెలియవచ్చునేమో కానీ, ఈ ఒప్పందం కుదిరినంతమాత్రాన రెండుదేశాల మధ్యా సయోధ్య ఏర్పడినట్టు, సత్సంబంధాలు నెలకొన్నట్టూ కాదు. రెండుదేశాల మధ్యా అవిశ్వాసం ఉన్నంతకాలం ఉభయపక్షాలకూ ఏకాభిప్రాయం లేని వేలకిలోమీటర్ల సరిహద్దులో అవసరమైనప్పుడల్లా అగ్గిరాజేయగలిగే అవకాశం ఎప్పుడూ ఉంటుంది.

ఆరు నూతన పాలసీలు ఆకర్షణీయం, ఆదర్శం!

స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యంగా ఆరు కొత్త పాలసీలను రూపొందించింది కూటమి ప్రభుత్వం. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆరు కీలక రంగాలకు ఒకేసారి తీసుకొచ్చిన ఈ పాలసీలు ఆకర్షణీయం, ఆదర్శంగా నిలవనున్నాయి. రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి తెచ్చిన నూతన పాలసీల ఫలితంగా పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ స్వర్గధామంగా నిలవనుంది. ప్రభుత్వం తెచ్చిన నూతన పాలసీలు పారిశ్రామిక వికాసంపై విశ్వాసం కలిగిస్తున్నాయి. పారిశ్రామికవేత్తలు, వ్యాపార దిగ్గజాలు తరలివచ్చేలా, విదేశీ కంపెనీలు సైతం పెట్టుబడులు పెట్టడానికి ఆకర్షణీయంగా ఉన్నాయి.

పట్టుదలతో ప్రపంచ నలుమూలల నుంచి పెట్టుబడులు సాధించి సంపద సృష్టించే దిశలో ఉన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు. రానున్న ఐదేళ్లలో 30 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పెట్టుకున్నది ప్రభుత్వం. అందుకు అనుగుణంగానే పారిశ్రామిక పాలసీలను రూపొందించింది. పారిశ్రామికవేత్తలకు ఫ్రెండ్లీ గవర్నమెంట్‌గా నిలవాలని నిర్ణయించింది. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను ఆకర్షించి రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఆవిష్కరణలకు దోహదపడేలా నూతన పాలసీలను రూపొందించారు. వీటితో రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడిదారులు బారులు తీరే అవకాశం ఉంది. నూతన పారిశ్రామిక పాలసీలు అమల్లోకి వచ్చాక రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన వారికి అదనపు ప్రోత్సాహకాలు అందించనున్నారు. ఎంత పెట్టుబడి పెట్టారనేది ముఖ్యం కాదు. ఎన్ని ఉద్యోగాలు, ఎంత ఉపాధి కల్పించారనేదే ప్రాధాన్యంగా జాబ్ ఫస్ట్ అనే నినాదంతో ఈ కీలక పాలసీలను రూపొందించారు.



రాయలసీమను అభివృద్ధి కేంద్రంగా మార్చాలని, స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా రాష్ట్రానికి గ్లోబల్ బ్రాండ్ ఇమేజ్ తీసుకురావాలని, ఉత్తరాంధ్ర ప్రాంతంలో పోర్టులు, టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టి, ఉపాధి కల్పనతోపాటు రాష్ట్ర సంపద పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో పారిశ్రామికాంధ్ర ఆవిష్కారానికి కృషి జరుగుతున్నది.

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఆరు పాలసీలు గేమ్ చేంజర్లుగా నిలవనున్నాయి. పారిశ్రామికవేత్తలకు మళ్లీ నమ్మకం కుదిరేందుకుగాను అమరావతే ఏకైక రాజధానిగా ఉంటుందని ప్రకటించారు. విశాఖ ఆర్థిక రాజధానిగా, కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చెయ్యనున్నారు. 'జాబ్ ముందు' నినాదంతో పారిశ్రామిక విధానాన్ని రాష్ట్రంలో అమలు చెయ్యడం యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనపై ప్రభుత్వ పట్టుదలకు, చిత్తశుద్ధికి అద్దం పడుతుంది. పెట్టుబడుల ఆకర్షణ, ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ఎలక్ట్రానిక్, ఇండస్ట్రియల్, క్లీన్ ఎనర్జీ, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ డెవలప్‌మెంట్, ఎంఎస్ఎంఈ పాలసీ, ప్లగ్ అండ్ ప్లే ఇండస్ట్రియల్ పాలసీలను రూపొందించారు. ఉద్యోగాల కల్పన ఆధారంగా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇవ్వడం, పారిశ్రామికవాడల్లోనూ, పరిశ్రమల ఏర్పాటులోనూ సామాజిక సమతుల్యతను పాటిస్తూ, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను భాగస్వాములను చెయ్యనున్నారు.

రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసి, రాష్ట్రమంతా గ్రీన్ ఎనర్జీ హబ్‌గా, నౌకాశ్రయాలను గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లుగా మార్చనున్నారు. వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్ నినాదంతో ముందుకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉద్యోగాలు చేయడమే కాదు, ఉద్యోగాలు కల్పించే స్థాయికి మన యువత ఎదగాలని, ఆరు నూతన పాలసీలు రాష్ట్ర ప్రగతిని మారుస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తీసుకొచ్చి, సంపద సృష్టించి తద్వారా పెరిగిన ఆదాయాన్ని పేదల కోసం ఖర్చు చెయ్యనున్నారు. అట్లాగే ఏపీని ప్రపంచానికే ఆక్వా కల్చర్ హబ్‌గా, రాయలసీమను ఫ్రూట్ బాస్కెట్ హబ్‌గా మార్చాలని, పెట్టుబడి లేని సహజ సిద్ధ వ్యవసాయాన్ని ప్రోత్సహించి ఆ ఉత్పత్తులకు బ్రాండింగ్ చేయించి... ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాలు, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో ప్రత్యేక ఎంప్లాయ్‌మెంట్ జోన్లు సృష్టించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

అంతే కాదు అమరావతి కేంద్రంగా రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేసి, దానికి అనుబంధంగా విశాఖ, రాజమహేంద్రవరం, విజయవాడ, తిరుపతి, అనంతపురాలలో జోనల్ ఇన్నోవేషన్ హబ్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వనున్నారు. రాయలసీమను అభివృద్ధి కేంద్రంగా మార్చాలని, స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా రాష్ట్రానికి గ్లోబల్ బ్రాండ్ ఇమేజ్ తీసుకురావాలని, ఉత్తరాంధ్ర ప్రాంతంలో పోర్టులు, టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టి, ఉపాధి కల్పనతోపాటు రాష్ట్ర సంపద పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో పారిశ్రామికాంధ్ర ఆవిష్కారానికి కృషి జరుగుతున్నది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో నవ్యాంధ్రను జాతీయ స్థాయిలో అగ్రభాగాన నిలపగా, ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో కూడా అగ్రభాగాన నిలపనున్నారు. సుదీర్ఘ తీరప్రాంతం, అపార ఖనిజ సంపద, నౌకాశ్రయాలు, సరసమైన ధరలకు సరిపడా భూమి, మానవ వనరులు, నీరు, విద్యుత్తు అందుబాటులో ఉండడం, పెట్టుబడి రాయితీలు, మనం కల్పించే సౌలభ్యాలు, ప్రోత్సాహకాలు, నాయకుడి చిత్తశుద్ధి, సమర్థత, క్యారెక్టర్ ఫలితంగా రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టడానికి పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ముందుకు రానున్నాయి.

ఆకర్షణీయమైన, ఆదర్శనీయమైన నూతన పారిశ్రామిక పాలసీలు ప్రకటించడం ద్వారా ముఖ్యమంత్రి రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి బాటలు వేశారు. విభజన సమయంలో రాష్ట్రంలో పెద్ద పరిశ్రమలు లేవు. కానీ గత తెలుగుదేశం ప్రభుత్వ కృషితోనే అనేక భారీ పరిశ్రమలు బారులు తీరాయి. అన్నీ కోల్పోయిన రాష్ట్రంలో పెద్దమొత్తంలో పెట్టుబడులు ఆకర్షించి లక్షల మందికి ఉపాధి కల్పించడం చంద్రబాబుకే సాధ్యమైంది. ఇప్పుడు కూడా పెట్టుబడులు సాధించి రాష్ట్రాభివృద్ధికి బాటలు వెయ్యబోతున్నారు. ఏది ఏమైనా కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అత్యంత కీలకమైన అడుగులు వెయ్యడం అభినందనీయం.

• నీరుకొండ ప్రసాద్

‘మహా’ యుద్ధంలో గెలుపు ఎవరిది?



హరియాణా ఎన్నికల ఫలితాల తర్వాత సర్వేలు నిర్వహించేవారు చాలా స్తబ్దంగా కనపడుతున్నారు. నవంబర్ 20న జరిగే మహారాష్ట్ర ఎన్నికల గురించి అడిగితే చాలా ఆచితూచి స్పందిస్తున్నారు. సర్వేలు నిర్వహించేవారు మాత్రమే కాదు, ఎగ్జిట్‌పోల్స్ నిర్వహించే వారికి కూడా ఏమీ అంతుబట్టడం లేదు. మహారాష్ట్రలో వారు యథా ప్రకారం ఎగ్జిట్‌పోల్స్ నిర్వహించే సాహసం చేస్తారా లేదా అన్నది చెప్పలేం. హరియాణాలో బీజేపీ హ్యాట్రిక్ సాధిస్తుందని ఒక్క సర్వే కానీ, ఎగ్జిట్‌పోల్స్ కానీ వెల్లడించలేదు. అదే విధంగా జమ్ముకశ్మీర్‌లో హంగ్ అసెంబ్లీ ఏర్పడుతుందని అంచనా వేసినవారు కూడా నేషనల్ కాన్ఫరెన్స్–కాంగ్రెస్ కూటమి మెజారిటీ సీట్లు సాధిస్తుందని ఊహించలేకపోయాయి. ఇప్పుడే కాదు, 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూడా ఎగ్జిట్‌పోల్స్ నిర్వహించిన 12 సంస్థలు ఎన్డీఏ 400 సీట్లు దాటుతుందని చెప్పి బోల్తా పడ్డాయి. అసలు మన దేశంలో ఎగ్జిట్‌పోల్స్, సర్వే సంస్థలు ఎందుకు విశ్వసనీయత కోల్పోతున్నాయి? గల్లీకొక్కటిగా పుట్టగొడుగుల్లా ఏర్పడిన సంస్థల గురించి పెద్దగా మాట్లాడనక్కర్లేదు కాని ఒకప్పుడు కచ్చితంగా అంచనా వేయగలవని గుర్తింపు తెచ్చుకున్న సంస్థలు కూడా ఎందుకు విఫలమవుతున్నాయి? వాటిలో వృత్తి నైపుణ్యం లోపించిందా? లేదా ఈ సంస్థలు కూడా సోషల్ మీడియా సంస్థల్లాగా గాలివాటంగా జనంలో వినపడుతున్నది బయటకు వదిలేస్తున్నాయా? అన్న అనుమానం వస్తోంది. యూట్యూబ్‌ల్లో సర్వేరాయుళ్లు, ఏదో ఒకటి మాట్లాడే విశ్లేషకులు ఆవిర్భవించాక వారిని కూడా మేనేజ్ చేసే నేతల పీఆర్ బృందాలు బయలుదేరాయి. ‘మీరు ఆయనను గొప్ప విశ్లేషకుడు అనుకుంటారు.. ఆయనకు గత ఎన్నికల్లో ఎంత చెల్లించామో తెలుసా?’ అని రాష్ట్రంలో ఒక నేతకు పనిచేసిన పీఆర్వో ఒకరు అడిగారు. అందువల్ల మనకు వచ్చే సమాచారం విశ్వసనీయతను గ్రహించడం చాలా కష్టం.

రాజకీయ నాయకులు తమ పార్టీని, అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రైవేట్ సంస్థల్ని నియమించుకుని విజయం కోసం ప్రయత్నించే ప్రక్రియ మన దేశ రాజకీయాల్లో ఆలస్యంగా ప్రవేశించింది. కాని సంస్థల్ని నిర్వహించే వ్యూహకర్తల విశ్వసనీయత కూడా క్రమక్రమంగా తగ్గడం ప్రారంభమైంది. గత ఎన్నికల్లో ఏపీలో వైసీపీ తాను అఖండ విజయం సాధిస్తానని భావించింది. తమ తరఫున వ్యూహరచన చేసిన సంస్థ ప్రతినిధులను వైసీపీ అధినేత ఫలితాలు రాకముందే సత్కరించారు. కాని వైసీపీ ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయింది. కర్ణాటక, తెలంగాణల్లో కాంగ్రెస్‌లో చక్రం తిప్పిన ఒక ప్రైవేట్ వ్యూహకర్తకు సలహాదారుగా కేబినెట్ హోదా కూడా కల్పించారు. నేతలు టిక్కెట్ల కోసం ఆయన చుట్టూ తిరిగారు. కాని రాజస్థాన్, మధ్యప్రదేశ్, హరియాణాలో ఆయన వ్యూహం ఫలించలేదు. సర్వేల ఆధారంగా టిక్కెట్లు పొందినవారు అనేకమంది పరాజయం పాలయ్యారు. ఇందుకు వ్యూహకర్తనే తప్పుపట్టలేం కాని ఇలా ఎందుకు జరుగుతోంది? నిజానికి ఏపీలో ఏ వ్యూహకర్తతో నిమిత్తం లేకుండా ప్రజలు తీర్పు చెప్పారు. తెలంగాణలో కూడా కేసీఆర్ చేసిన తప్పిదాల వల్ల బీఆర్ఎస్ ఓటమి పాలైందని స్పష్టంగా తేలింది కాని ఏ వ్యూహకర్తవల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని చెప్పలేం. ప్రజలు వ్యూహకర్తలతో నిమిత్తం లేకుండా ప్రభుత్వ పాలనపై, రాజకీయ పార్టీల తీరుతెన్నులపై ఆధారపడి తీర్పునిస్తారన్న విషయం అనేక సందర్భాల్లో వెల్లడైంది. ఎమర్జెన్సీ తర్వాత జనతా పార్టీ విజయానికి ఏ వ్యూహకర్తా కారణం కాలేదు. 2014లో నరేంద్రమోదీ నేతృత్వంలో బీజేపీ ప్రభంజనానికి కానీ, 2024లో బీజేపీ సీట్లు తగ్గడానికి కూడా పూర్తిగా వ్యూహకర్తలు కారణమని చెప్పలేము. కాకపోతే ఒక పార్టీకి ప్రజాభిప్రాయం అనుకూలంగా ఉంటే ఆ వాతావరణాన్ని సంఘటితం చేసేందుకు కొన్ని సంస్థలు తోడ్పడవచ్చు కాని ఈ సంస్థలే రాజకీయ పార్టీల తలరాతల్ని నిర్ణయించలేవు. అందువల్ల నేతలు ఎప్పుడూ ప్రజలతో నిత్యసంబంధాలు ఏర్పర్చుకుంటూ, వారి కోసం పనిచేస్తూ ఉండక తప్పదు.

మహారాష్ట్ర శాసనసభతో పాటు వివిధ రాష్ట్రాల్లో 48 అసెంబ్లీ సీట్లకు ఉపఎన్నికలు జరగనున్నాయి. మహారాష్ట్రలో పోటీ చేస్తున్న 156 సీట్లతో పాటు ఉపఎన్నికలు జరగనున్న సీట్లలో అత్యధిక సీట్లను, ఓట్ల శాతాన్ని దక్కించుకున్నప్పుడే దేశంలో బీజేపీ హవా తగ్గలేదని చెప్పడానికి ఆస్కారం ఉంటుంది. ఈ కారణంగా ఈ ఎన్నికలపై దేశ ప్రజల దృష్టి కేంద్రీకృతమైంది.



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల్లో మహారాష్ట్రలో ఏ కూటమి గెలుస్తుంది అన్న విషయంపై అనేకమంది రాజకీయ పరిశీలకుల్లోనే అయోమయం నెలకొన్నది. నాలుగు నెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 48 సీట్లలో కేవలం 9 సీట్లలోనే బీజేపీ విజయం సాధిస్తే ఏకనాథ్ షిండే నేతృత్వంలోని శివసేనకు 7, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి ఒక సీటు లభించాయి. మరో వైపు కాంగ్రెస్‌కు 12, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేనకు 9, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి 8 సీట్లు లభించాయి. ఉత్తరప్రదేశ్‌లో మాదిరి మహారాష్ట్రలో కూడా మోదీ ప్రభంజనం అంతగా పనిచేయలేదు. గత ఎన్నికలతో పోలిస్తే బీజేపీ ఈ ఎన్నికల్లో 12 సీట్లు కోల్పోయింది. దేశంలో రెండుసార్లు బీజేపీకి పూర్తి మెజారిటీ సాధించిన సందర్భాల్లో కూడా మోదీ మహారాష్ట్రలో సంకీర్ణ ప్రభుత్వం రాకుండా చేయలేకపోయారు. 1995 నుంచి దాదాపు మూడు దశాబ్దాలుగా ఈ రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వాలే కొనసాగుతున్నాయి. కేవలం ఒకే ఒక్కసారి బీజేపీ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగింది. రెండోసారి దొడ్డిదారిన సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించి ఐదు రోజుల్లోనే ఇంటి దారి పట్టింది. ఆ తర్వాత శివసేనను, ఎన్సీపీని చీల్చి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసినా అధికారం మాత్రం శివసేన చీలిక వర్గానికి చెందిన ఏకనాథ్ షిండేకు అప్పగించక తప్పలేదు. ముఖ్యమంత్రి పదవి నిర్వహించిన దేవేంద్రనాథ్ ఫడ్నవీస్ ఉప ముఖ్యమంత్రి పదవితో సంతృప్తిపడాల్సి వచ్చింది. ఇప్పుడైనా ఒకవేళ బీజేపీ అత్యధిక సీట్లు సాధించి గెలిచినా మహారాష్ట్రలో ప్రభుత్వం ఏర్పాటు చేయగలదా? లేదా ఏక్‌నాథ్ షిండేకే మళ్లీ ముఖ్యమంత్రి పదవి అప్పగించక తప్పదా?

లోక్‌సభ ఎన్నికల ఫలితాల తీరు తెన్నులను బట్టి చూస్తే షిండే ముఖ్యమంత్రిగా ఉన్న మహాయుతితో పోలిస్తే ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని మహా వికాస్ అగాధి బలంగా ఉన్నదని చెప్పవచ్చు. శివసేన, ఎన్సీపీని బీజేపీ చీల్చిన తీరు, ప్రతిపక్షాలపై ఈడీ, ఆదాయపు పన్ను కేసులు మోపిన తీరు పట్ల జనం తమ వ్యతిరేకతను లోక్‌సభ ఎన్నికల్లో ప్రదర్శించారు. అధిక ధరలు, నిరుద్యోగంతో పాటు వ్యవసాయ సంక్షోభం, మంచి నీటి కొరత, మరాఠా కోటా, ధారవి మురికివాడల అభివృద్ధి పథకం వంటి స్థానిక సమస్యలు అనేకం ఉన్నాయి.

కాని హరియాణాలో అనూహ్యంగా బీజేపీ గెలిచిన తర్వాత మహారాష్ట్ర గురించి ఇదమిత్థంగా చెప్పేందుకు అనేకమంది పరిశీలకులు వెనుకాడుతున్నారు. హరియాణాలో మాదిరి కాంగ్రెస్ విజయావకాశాలు చేజార్చుకోవడం, శివసేనతో సీట్ల ఒప్పందం తేలకపోవడం, ముఖ్యమంత్రి సీటు కోసం కాంగ్రెస్ నేతలు పోటీ పడడం మొదలైనవి కాంగ్రెస్‌కు ప్రతికూల అంశాలుగా ఉన్నాయి. ఉద్ధవ్ ఠాక్రే వర్గం స్థానిక కాంగ్రెస్ నేతలతో కాకుండా ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలతో చర్చలు జరుపుతోంది.

మరోవైపు ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించేందుకు మహాయుతి కూటమి వరాల వర్షం కురిపిస్తోంది. ఉచితాలను వ్యతిరేకిస్తూ మోదీ అనేక ఉపన్యాసాలు ఇచ్చినప్పటికీ దేశ వాణిజ్య రాజధాని అయిన మహారాష్ట్రలో అధికారం కైవసం చేసుకునేందుకు బీజేపీ రాజీపడక తప్పడం లేదు. ఎన్నికలు సమీపిస్తుండగానే తేలికపాటి మోటార్ వెహికల్స్‌కు టోల్ రాయితీతో పాటు దాదాపు 1500 నిర్ణయాల అమలు ప్రారంభించింది. అన్నిటి కన్నా ముఖ్యమైనది రూ. 46వేల కోట్ల లడ్కీ బహనా యోజన. ఈ పథకం క్రింద మహారాష్ట్రలోని 4.5 కోట్ల మంది మహిళల్లో 2.5 కోట్ల మందికి నెలకు రూ. 1500 చొప్పున చెల్లిస్తారు. ఇప్పటికే మహిళలకు రూ. 7500 చొప్పున అయిదు నెలల అడ్వాన్స్‌ను వారి ఖాతాల్లో జమ చేశారు. దీన్నే 'గేమ్ ఛేంజర్'గా పరిశీలకులు భావిస్తున్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలు వల్ల ఏక్‌నాథ్ షిండే సర్కార్‌పై ప్రజల్లో సానుకూలత ఏర్పడిందని తాజాగా లోక్‌నీతి-సిఎస్‌డిఎస్ -తదితర సంస్థలు నిర్వహించిన సర్వేలో తేలింది. అయితే ఎన్నికల్లో ఏ కూటమి గెలుస్తుందో మాత్రం ఈ సంస్థలు తేల్చలేదు.

హరియాణా ఎన్నికల ఫలితాల వల్ల కాంగ్రెస్ శిబిరంలో ఆత్మవిశ్వాసం తగ్గింది. లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో కాంగ్రెస్ అత్యధిక సీట్లు సాధించినప్పటికీ హరియాణాలో ముఖాముఖి పోటీలో బీజేపీకి వ్యతిరేకంగా పోటీ చేసిన సీట్లలో ఓడిపోవడం వల్ల మిత్రపక్షాల్లో ఆ పార్టీ విలువ తగ్గిపోయింది. అందువల్ల ఉద్ధవ్ ఠాక్రే శివసేనతో సీట్ల విషయంలో కాంగ్రెస్ ధైర్యంగా బేరసారాలు జరుపలేకపోతోంది. అయితే అదే సమయంలో హరియాణా ఎన్నికలు ఒకరకంగా కాంగ్రెస్‌కు, మిత్రపక్షాలకు గుణపాఠం నేర్పాయనే చెప్పవచ్చు. ఐకమత్యంతో పనిచేస్తేనే మోదీని ఢీకొనగలమని వారికి అర్థమయ్యే ఉంటుంది. మహారాష్ట్రలో కాంగ్రెస్ ఒంటరిగా కాక ఇతర పార్టీలతో కలిసి పనిచేయడం వల్ల హరియాణా ఎన్నికల ఫలితాలు పునరావృతమవుతాయని చెప్పలేం.

కేవలం 90 సీట్లున్న హరియాణాలో బీజేపీ గెలవడం ఆ పార్టీకి లోక్‌సభ ఎన్నికల తర్వాత నైతిక స్ఫూర్తిని ఇచ్చి ఉండవచ్చు కాని ఒక శాతం కంటే ఎక్కువ ఓట్లతో మాత్రమే అక్కడ బీజేపీ అధికారం చేజిక్కించుకుంది. అంతే కాదు, మహారాష్ట్రతో పాటు 48 అసెంబ్లీ సీట్లకు ఉపఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో యూపీలోని 9, రాజస్థాన్‌లోని 7 సీట్లు బీజేపీకి ప్రతిష్ఠాత్మకమైనవి. అందువల్ల మహారాష్ట్రలో పోటీ చేస్తున్న 156 సీట్లతో పాటు ఉపఎన్నికలు జరుగుతున్న సీట్లలో అత్యధిక సీట్లను, ఓట్ల శాతాన్ని దక్కించుకున్నప్పుడే దేశంలో బీజేపీ హవా తగ్గలేదని చెప్పడానికి ఆస్కారం ఉంటుంది. అందువల్ల ఈ ఎన్నికలపై దేశం దృష్టి కేంద్రీకృతమైంది. దేశమంతటా ప్రతి ఏడాదీ ఎన్నికల వాతావరణం ఏర్పడడం ఒకరకంగా మంచిదే. ముఖ్యంగా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి తన గ్రాఫ్ పడిపోతుందో లేదో ఎప్పటికప్పుడు తేల్చుకోవడానికి ఈ ఎన్నికలు దోహదపడతాయనడంలో సందేహం లేదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

కారుణ్య నియామకాలు ఏవి?

ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్స్ రెగ్యులర్ సిబ్బందికి కారుణ్య నియామకాలను ఇచ్చే విధంగా ఈ విధానాన్ని పాఠశాల విద్యాశాఖ అడాప్ట్ చేసుకోవాలని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. సుమారు 21 మంది మోడల్ స్కూల్స్ రెగ్యులర్ ఉపాధ్యాయులు అనారోగ్య కారణాలతోనూ, రహదారి ప్రమాదాల్లోనూ, కోవిడ్ సమయంలో రెగ్యులర్ సర్వీసులో ఉండగా చనిపోయారు. వాళ్ల కుటుంబాలలో ఒక వ్యక్తికి విద్యా శాఖలో, విద్యాశాఖ అనుబంధ కార్యాలయాల్లో లేదా జిల్లా యూనిట్‌గా కలెక్టరేట్ పరిధిలో లేదా గ్రామ, వార్డు సచివాలయంలో అర్హత గల కుటుంబాల్లో ఒక వ్యక్తికి ఉద్యోగం ఇవ్వాలని కుటుంబాలు అనేకసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసుకొని ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాయి. సర్వీస్‌లో ఉండగా ఆ కుటుంబానికి ఆధారమైన ఉద్యోగి చనిపోయినప్పుడు ఆ కుటుంబంలో ఒకరికి అర్హత గల కారుణ్య నియామకం ఇవ్వాలని ప్రార్థిస్తున్నాము. మరణించిన మోడల్ స్కూల్స్ రెగ్యులర్ ఉపాధ్యాయుల కుటుంబాలను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 164 మోడల్ స్కూల్స్‌లో రెగ్యులర్ విధానంలో 2650 మంది టీచింగ్ సిబ్బంది పని చేస్తున్నారు. ప్రస్తుతం ఈ మోడల్ స్కూల్స్ రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో విద్యాశాఖ కింద నడుస్తున్నాయి. విద్యా శాఖలో ఒక భాగమైన ఈ మోడల్ స్కూల్స్‌కు 'కారుణ్య నియామకాల పాలసీని' అడాప్ట్ చేసుకోవలసిన అవసరం ఉంది. 2013లో ఏర్పడిన ఈ మోడల్ స్కూల్ వ్యవస్థలో పనిచేస్తున్న ఉపాధ్యాయ కుటుంబాలకు 'కారుణ్య నియామకాల విధానం అమలు ద్వారా' ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భరోసా కల్పించాలని ప్రార్థిస్తున్నాము. మోడల్ స్కూల్స్ రెగ్యులర్ టీచింగ్ స్టాఫ్‌ను పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్‌లోకి విలీనం చేస్తూ 010 పద్దు ద్వారా జూలై 2024 నుండి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ట్రెజరీ ద్వారా జీతాలు చెల్లిస్తుంది. ఇటువంటి సందర్భంలో కారుణ్య నియామకాలను కూడా మోడల్ స్కూల్స్ రెగ్యులర్ ఉపాధ్యాయులకు సర్వీస్ నిబంధనలతో పాటు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి.

– బి.సురేష్
అధ్యక్షులు, మోడల్ స్కూల్స్ రెగ్యులర్ టీచర్స్ కమిటీ

అనర్హులకు ‘ఉపాధి హామీ’ వద్దు

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పల్లెలకు పండగ తేవాలన్నా, పంచాయతీలను నిజంగా బలోపేతం చెయ్యాలన్నా, రాష్ట్ర ప్రభుత్వ తక్షణం చేయాల్సింది- జాబ్ కార్డులు పొంది ఉన్న లక్షలమంది అనర్హులను తొలగించటం, దుర్వినియోగమవుతున్న కోట్ల నిధులు అసలైన గ్రామాభివృద్ధికి దోహదపడేలా చర్యలు చేపట్టటం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖామాత్యులు పవన్ కళ్యాణ్ గ్రామాలలో సామాజిక, ఆర్థిక మార్పు జరగాలని గ్రామ సభలకూ, ఉపాధి హామీ పథకానికీ ఇస్తున్న ప్రాధాన్యత హర్షణీయం. కాని, వారు నిజాయతీగా చేస్తున్న కృషి సత్ఫలితాలను ఇవ్వాలంటే, నిజంగా ఉపాధి – ఆర్థిక ఆలంబన అవసరమైన, అర్హత గలిగిన నిరుపేద కుటుంబాల వ్యక్తులకు మాత్రమే జాబ్ కార్డులకు దక్కే దిశగా అడుగులు వెయ్యాలి.

ప్రతీ గ్రామంలో అర్హత లేని వేలమంది ఈ పథకానికి రిజిస్టర్ అవ్వటంతో, నిజంగా సంవత్సరంలో వంద రోజుల ఉపాధి అవసరమైన పేదవారికి 35–40 రోజులు కూడా పని కల్పించ లేకపోతున్నారు. అంతేకాదు, గ్రామ పంచాయతీ స్థాయిలో, ప్రతీ ఏటా కొన్ని కోట్ల రూపాయల నిధులు ఖర్చవుతున్నప్పటికీ నాణ్యమైన పనులు చేపట్టలేకపోతున్నారు. వేలమంది అనర్హులతో ఉపాధి హామీ పనులను సమన్వయం చేయటం అధికారులకూ పెద్ద తలనొప్పిగా మారింది.

గ్రామీణ ప్రాంతాలలో పద్దెనిమిది సంవత్సరాలు పైబడిన, అత్యంత నిస్సహాయ ప్రజలకు, నైపుణ్యం లేని శ్రామిక పని చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చే ప్రతీ గ్రామీణ పేద కుటుంబానికి ఐదు కిలోమీటర్ల పరిధిలోనే, ఒక ఆర్థిక సంవత్సరంలో కనీసం వంద రోజుల పని కల్పించి, కనీస వేతనానికి హామీ ఇస్తూ ఈ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం 2005లో ప్రవేశపెట్టింది. దేశంలో 200 జిల్లాలలో 2006లో మొదట ఈ పథకాన్ని అమలు చేసినా, ఆంధ్రప్రదేశ్‌లో 2008 నుండి మాత్రమే అమలులోకి వచ్చింది.

అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ పథకం ద్వారా లబ్ధి పొందటానికి ఎలాంటి వారు దరఖాస్తు చేసుకుని జాబ్ కార్డులను పొందారు అనే విషయాలను పరిశీలిస్తే విస్తు గొలిపే నిజాలు వెలుగులోకి వచ్చాయి. సాపేక్షంగా అభివృద్ధి చెందిన ఒక గోదావరి జిల్లాలోని ఒక గ్రామ పంచాయతీని కేస్ స్టడీగా తీసుకోగా–2011 జనాభా లెక్కల ప్రకారం 8,925 పూర్తి జనాభాతో, 2,744 కుటుంబాలు నివసిస్తున్న ఈ గ్రామంలో, 2008–2011 సమయంలోనే 4,185 మంది, అంటే సుమారు 46.8శాతం గ్రామ జనాభా, ఉపాధి హామీ పథకానికి రిజిస్టర్ అయ్యారు. ఈ పథకం కేవలం 18ఏళ్ళు పై బడిన, శారీరక శ్రమ చేయగల వయోజనుల కోసమని ప్రకటించినప్పటికీ– 2008 నుంచి 2024 వరకు కూడా పిల్లలు, అలాగే వృద్ధాప్య పింఛన్లు పొందుతున్న వృద్ధులు సైతం ఉపాధికి జాబ్ కార్డ్ పొందారు. వ్యాపారస్తులు, పంచాయతీ సిబ్బంది, లక్షల ఆస్తులున్న గ్రామస్తులే కాదు, ఊరి బయట హైదరాబాద్ వంటి నగరాలలో ఐటీ ఉద్యోగాలు, ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నవారు కూడా ఎంతోమంది ఉపాధి హామీ పథకానికి కూలీలుగా రిజిస్టర్ అయ్యారు. వీరు ఎలాంటి పని చేయకుండానే ఇంట్లోనే ఉండి, లేదా కేవలం మస్టర్ వేయించుకోవటానికి కాలక్షేపానికి వచ్చి వెళ్ళేవారితో, లేదా వారి బదులు వారి పిల్లలను కూడా పనికి పంపి, హాజరు వేయించుకుంటూ లబ్ధి పొందుతున్నారు.

2023–24 ఆర్థిక సంవత్సరంలో ఈ ఒక్క గ్రామంలోనే 2,059 కుటుంబాల నుంచి 3,929 మంది గ్రామస్తులు ఉపాధి పనులలో వేతనంగా, సుమారు రూ.243 చొప్పున, కోటి డెబ్బై లక్షల రూపాయలకు పైగా పొందారు. కాని, ఇన్ని కుటుంబాలకు సగటున పని కల్పించింది 34 రోజులు మాత్రమే. 2023–24లో 100 రోజుల పని కలిపించగలిగింది కేవలం తొమ్మిది కుటుంబాలకు అయితే, 2022–23లో రెండు కుటుంబాలకు మాత్రమే. 2022–23లో 396 కొత్త పాత పనులను గుర్తిస్తే, 99 పనులను మాత్రమే పూర్తిగా చేయగలిగారు. కనీసం ఈ దశాబ్ద కాలంలో, ఇలా ప్రతీ ఏటా లక్షలు, కోట్లు వేతనాలకు ఖర్చు పెడుతూ 99శాతానికి పైగా చేసిన అభివృద్ధి పనులు ముఖ్యంగా ఏంటీ అంటే– గ్రామంలోని పంట బోదెలు, కాలువలు, చెరువుల సమీపంలో పూడికతీత, కలుపును తొలగించే పనులు మాత్రమే. కాని ఇందులో మెటీరియల్ నిమిత్తం ఉన్న నిధులను వినియోగించి రాజకీయ కార్యకర్తలు కాంట్రాక్టర్లుగా గ్రామంలో సిమెంట్ రహదారులు, మురుగునీటి కాలువలు, డంపింగ్ షెడ్, ప్రభుత్వ గృహాల కాలనీని చదును చేయటం వంటి పనులు ఈ పదేళ్ళల్లో చేపట్టారు. గత నాలుగేళ్ళల్లో ప్రతీ ఏటా 50 లక్షల నుంచి కోటి 30 లక్షల రూపాయలకు పైగా ఈ కాంట్రాక్ట్ పనుల నిమిత్తం ఖర్చు అయ్యాయి. ఉపాధి హామీ పథకానికి లబ్ధిదారుల ఎంపిక, క్షేత్రస్థాయి సిబ్బంది ఎంపిక మొదలుకొని గ్రామంలో పనులను గుర్తించి అమలు చేసే వరకు రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ గ్రామ పార్టీ కార్యకర్తలు వ్యక్తిగత లబ్ధి పొందటం కోసం అధికారులపై ఒత్తిడి పెంచి నిబంధనలను అతిక్రమించటంతో ఉపాధి హామీ పథకం నిర్దేశిత లక్ష్యాలను చేరలేకపోతుంది. ఈ పథకంతో పంచాయతీలు, ప్రజాస్వామ్యం బలోపేతం అవ్వటం కాదు, రాజకీయ కార్యకర్తలు బలోపేతం అయ్యారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ నిధులు, నిర్ణయాధికారం వారి గుప్పెట్లోకి చేరి ప్రజాస్వామ్య వ్యవస్థలను మరింత బలహీనపరచాయి.

ప్రతీ గ్రామంలో అర్హత లేని వేలమంది ఈ పథకానికి రిజిస్టర్ అవ్వటంతో, నిజంగా సంవత్సరంలో వంద రోజుల ఉపాధి అవసరమైన పేదవారికి 35–40 రోజులు కూడా పని కల్పించలేకపోతున్నారు. గ్రామ పంచాయతీ స్థాయిలో, ప్రతీ ఏటా కొన్ని కోట్ల రూపాయల నిధులు ఖర్చవుతున్నప్పటికీ నాణ్యమైన పనులు చేపట్టలేకపోతున్నారు. వేలమంది అనర్హులతో ఉపాధి హామీ పనులను సమన్వయం చేయటం అధికారులకూ పెద్ద తలనొప్పిగా మారింది.



మార్చి 2024లో ఉపాధి వేతనం రూ.300కు పెంచాక రిజిస్టర్ చేసుకునే అనర్హుల సంఖ్య మరింత ఎక్కువ పెరిగింది. అంతేకాదు– ఉపాధి హామీ పథకం ద్వారా ఒక కూరగాయల మార్కెట్, గ్రంథాలయం, ఆసుపత్రి, కంపోస్ట్ షెడ్, గ్రామ వనం వంటి స్థిరమైన ఆస్తులు నిర్మించాలన్నా పంచాయతీకి భూములూ ఉండాలి. గ్రామాలు పార్టీ కార్యకర్తల స్వామ్రాజ్యాలుగా మారిపోయాక ప్రభుత్వ భూములు, వనరులన్నీ అక్రమార్కుల సొంతం అయ్యాయి. స్థానిక ప్రభుత్వాలకు ఎన్నికైన ప్రజాప్రతినిధులు సైతం, అత్యంత కీలకమైన ప్రభుత్వ స్థలాలను అమ్మి లాభం పొందుతున్నారు. ఇది ఒక్క గ్రామ పంచాయతీ కథ కాదు, రాష్ట్రంలో, దేశంలో ఉపాధి హామీ పథకం ఏ విధంగా దుర్వినియోగం అవుతుందో తెలియచెప్పే- ప్రతీ గ్రామ కథ.

గ్రామసభల ద్వారా, పంచాయతీ వ్యవస్థ ద్వారా, గ్రామ స్థాయిలో ప్రజలే నేరుగా పాల్గొని గ్రామానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవాలనే దృక్పథంతో గౌరవనీయులు పవన్ కళ్యాణ్ గారు ప్రభుత్వం ఏర్పడగానే రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే వైపు తొలి అడుగులు వేసారు. శుభపరిణామం. ఆ అడుగులు విజయం వైపు చేరాలంటే, మొదట ఉపాధి హామీ వంటి సంక్షేమ పథకాలలో రాష్ట్రవ్యాప్తంగా ఎటువంటి అర్హత లేని లక్షలాదిమంది లబ్ధిదారులను పూర్తిగా తొలగించాలి. 18 సంవత్సరాలు దాటిన వయోజనులకు మాత్రమే అర్హత ఇవ్వటమే కాకుండా, జాబ్ కార్డ్ పొందటానికి, ముఖ్యంగా వృద్ధాప్య పింఛనులు పొందుతున్నవారికి ఈ పథకం వర్తించకుండా, వయోపరిమితి కూడా ఉండేలా నిబంధనలను రూపకల్పన చెయ్యాలి. క్షేత్రస్థాయిలో అనర్హులు లబ్ధిపొందుతున్నా, కాలక్షేపం చేసి ఎటువంటి పని చేయని వారైనా, గుర్తించి తొలగించటానికి, సామాన్య ప్రజలు సైతం, వాచ్ డాగ్‌గా ఉండి రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందించటానికి వీలుగా, ఒక వెబ్ పోర్టల్ లేదా వాట్సాప్ నంబర్‌ను అందుబాటులోకి తేవాలి. పంచాయతీ భూములలో విచ్చలవిడిగా పెరుగుతున్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఏపీ హైకోర్టు 2022లో ఇచ్చిన ఆదేశాలను వెనువెంటనే అమలుచెయ్యాలి.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయితీనీ వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లోకి తీసుకురావాలి. ఓటర్లు అందర్నీ సభ్యులుగా చేర్చాలి. రోజూవారీ గ్రామాభివృద్ధి పనులు, తీర్మానాలు, కార్యకలాపాలు, పంచాయతీ ఆదాయవ్యయాలు, ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక, పంచాయతీల పనితీరు, పూర్తి పారదర్శకతతో, ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేలా, అన్ని నిర్ణయాలను వెంటనే ప్రచురించేలా పబ్లిక్ వెబ్ పేజీ, సామాజిక మాధ్యమాల్లో పేజీలు ఏర్పాటు చేయాలి. అసెంబ్లీ, పార్లమెంట్ సమావేశాల మాదిరిగానే ప్రతీ గ్రామపంచాయతీ తమ బోర్డు సమావేశాలను, గ్రామసభలను ప్రత్యక్ష ప్రసారం చేయాలి. పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచుతుంది, అవినీతిని కట్టడి చేస్తుంది, ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తుంది. ప్రజాస్వామ్యంలో ప్రజలనే ప్రభువులను చేస్తుంది. పల్లెల్లో నిజమైన పండుగ తెస్తుంది.

■ డా. సౌందర్య మనోహరి వెలమాటి
గ్రామదీప్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు







చిరునవ్వులు చిందిస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ కేశినేని శివనాథ్




డ్రోనాకాశం

కృష్ణాతీరంలో డ్రోన్ షో–2024 సక్సెస్

- ఆకాశంలో అద్భుతాలు సృష్టించిన 5,500 డ్రోన్స్
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

ఫిదా అయిన వీక్షకులు



కృష్ణాతీరం డ్రోనాతీరమైంది. చీకటిని చీల్చుకుంటూ ఆకాశంలో నక్షత్రాల్లా ఒక్కసారిగా 5,500 డ్రోన్లు దూసుకొచ్చాయి. సప్తవర్ణ చిత్రాలను అత్యద్భుతంగా ఆవిష్కరించాయి. భారీ బోయింగ్ విమానం, డ్రోన్, రాజధాని అమరావతిని స్ఫురించేలా ధ్యానబుద్ధుడు, గ్లోబ్ తదితర చిత్రాలు కనులవిందు చేశాయి. జాతీయ జెండా, ఐసీఏవో లోగో ఆకట్టుకున్నాయి. కృష్ణా తీరాన పున్నమి ఘాట్‌లో మంగళవారం రాత్రి కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌తో నిర్వహించిన డ్రోన్ షో నగరవాసులను విశేషంగా అలరించింది. తర్వాత లేజర్ షో, బాణాసంచా ఫైరింగ్‌తో కృష్ణా తీరంలో దీపావళి ముందుగానే వచ్చినట్లనిపించింది. 6



మిణుగురు పురుగుల వలే ఆకాశంలోకి ఎగురుతున్న డ్రోన్లు

ఇసుక తవ్వకాలకు వరద బ్రేక్ వేసింది. ఇసుక తవ్వేందుకు అధికారులు 15 రీచ్‌లను గుర్తిస్తే అందులో 11 రీచ్‌ల్లో వరద నీరు నిలిచిపోయింది. మరో నాలుగు రీచ్‌ల్లో అప్రోచ్ రోడ్లు నీట మునిగాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఇసుక తవ్వకాలకు మరో వారం రోజులు సమయం పట్టే అవకాశం ఉంది. నాగార్జున సాగర్ నుంచి పులిచింతలకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. పులిచింతల నుంచి ప్రకాశం బ్యారేజ్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో కృష్ణానదిలో అడుగుపెట్టడానికి అవకాశం లేకుండా పోయింది.



ఇసుకకు వరద బ్రేక్

రీచ్‌ల్లో నిలిచిపోయిన తవ్వకాలు

- తవ్వేందుకు 15 రీచ్‌ల గుర్తింపు
- 11 రీచ్‌ల్లో నిలిచిన వరద నీరు
- మరో నాలుగు రీచ్‌ల్లో మునిగిన అప్రోచ్ రోడ్లు
- తవ్వకాలకు మరో వారం రోజులు పట్టే అవకాశం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్ జిల్లాలో రెండు స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వలు ఉన్నాయి. మొగలూరు స్టాక్ పాయింట్‌లో 25వేల టన్నులు, అనుమంచిపల్లి స్టాక్ పాయింట్‌లో మరో 25 వేల టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి. జిల్లా మొత్తం మీద 50 వేల టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. ప్రభుత్వం ఉచిత ఇసుక విధానంలో కొన్ని మార్పులు చేసింది. రోజుకు 3వేల టన్నుల ఇసుకను తీసుకెళ్లేలా భూగర్భ గనుల శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుకను తీసుకెళ్తుండడంతో నిల్వలు తగ్గుముఖం పడుతున్నాయి. దీనితో అధికారులు కొద్దిరోజుల క్రితం కార్మికులతో ఇసుకను తవ్వించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి టెండర్లను ఆహ్వానించారు. ఈ విధంగా ఇసుకను తవ్వడానికి జిల్లాలో 15 రీచ్‌లను అధికారులు గుర్తించారు. ఈ టెండర్లను అధికారులు ఖరారు చేశారు. వాస్తవానికి ఈ నెల 16 నుంచి రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలు ప్రారంభం కావాల్సి ఉంది. ఈ పనులకు ఎగువ నుంచి వస్తున్న వరద అడ్డంకి మారింది. ఎగువ రాష్ట్రాల్లో వర్షాలు విస్తారంగా కురవడంతో తుంగభద్ర, శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. సెప్టెంబరు ఒకటో తేదీన కృష్ణా నదికి భారీగా వరద వచ్చింది. ఇది క్రమంగా తగ్గుముఖం పట్టింది. ఈనెల పదో తేదీ నుంచి ప్రకాశం బ్యారేజ్‌కు మళ్లీ వస్తున్న వరద క్రమంగా పెరుగుతోంది. ఈ నెల ఏడో తేదీన 30వేల క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో తాజాగా లక్ష క్యూసెక్కులకు చేరింది. ఎగువ ప్రాజెక్టుల నుంచే కాకుండా, వాగుల నుంచి వస్తున్న నీరు నదిలో కలుస్తోంది. ఫలితంగా నది ఎగువ, దిగువ ప్రాంతాల్లో నిండుగా ప్రవహిస్తోంది. ప్రాజెక్టులు, వాగుల నుంచే కాకుండా పులిచింతలో జలవిద్యుత్ కేంద్రం నుంచి నీరు ప్రకాశం బ్యారేజ్‌కు వస్తోంది. ఈ మూడు కారణాలతో రీచ్‌ల నిండా నీరు చేరింది. 15 రీచ్‌ల్లో 11 రీచ్‌లు పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. మరో నాలుగు రీచ్‌లకు ఉన్న అప్రోచ్ రోడ్లను వరద నీరు ముంచెత్తింది. ఫలితంగా రీచ్‌ల్లోకి వెళ్లే మార్గం మూసుకుపోయింది. దీనితో భూగర్భ గనుల శాఖ అధికారులు ఇసుక తవ్వకాలను నిలుపుదల చేశారు. మరో వారం రోజుల్లో నదికి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గుముఖం పడుతుందని అంచనా వేస్తున్నారు. ఇన్‌ఫ్లో తగ్గిన తర్వాతే తవ్వకాలు ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు.

"విజయవాడ నగరాన్ని వణికించిన బుడమేరు ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రయత్నాలు చేస్తున్నాం. ఇందులో భాగంగా బుడమేరు ఆక్రమణపై దృష్టి పెట్టాం. మరో పక్షం రోజుల్లో బుడమేరు యాక్షన్ ప్లాన్ అమలు చేయనున్నాం. 'హైడ్రా' తరహా దూకుడు మాత్రం ఇక్కడ ఉండదు. మానవీయ కోణంలోనే ఆక్రమణలు తొలగిస్తాం. ప్రధానంగా పెద్ద పెద్ద ఆక్రమణదారులపైనే తమ చర్యలు ఉంటాయి" అని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) స్పష్టం చేశారు. నగరవాసులను వేధిస్తున్న ట్రాఫిక్ సమస్యకు ఫ్లై ఓవర్లు, బైపాస్ రోడ్డుల నిర్మాణంతో చెక్ పెట్టనున్నట్లు తెలిపారు. రానున్న రెండేళ్లలో విజయవాడ పార్లమెంటు రూపురేఖలను మార్చే దిశగా కృషి చేస్తున్నానని వివరించారు. ఇంకా పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ఆయన 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. - (విజయవాడ - ఆంధ్రజ్యోతి)



బుడమేరుకు శాశ్వత పరిష్కారం

15 రోజుల్లో బుడమేరు యాక్షన్ ప్లాన్ అమలు

ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం

- పేద, మధ్యతరగతిపై 'హైడ్రా' తరహా దూకుడు ఉండదు
- మానవీయకోణంలో ఆక్రమణల తొలగింపు
- 'బడా' ఆక్రమణలపైనే దృష్టి
- ఫ్లైఓవర్లు, బైపాస్‌లతోనే ట్రాఫిక్ సమస్యకు చెక్

'ఆంధ్రజ్యోతి'తో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)

ఆక్రమణల వివరాలు సేకరించాం

బుడమేరు ఆక్రమణల తొలగింపుపై పక్షం రోజుల్లో యాక్షన్ ప్లాన్‌కు దిగుతాం. ఇప్పటికే ఆక్రమణలకు సంబంధించిన అన్ని వివరాలు సేకరించడం పూర్తయింది. అయితే తెలంగాణలో హైడ్రా తరహాలో దూకుడు ప్రదర్శించబోం. ఏ విషయంలోనైనా మానవీయ కోణంలో వ్యవహరించండన్న మా అధినేత చంద్రబాబు సూచనల మేరకు చిన్న చిన్న ఆక్రమణదారుల విషయంలో వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా మిగతా 8లో..

స్నేహితుడే ప్రాణం తీశాడు! | సీఆర్డీఏ భూముల్లో పాగా!

8లో




నృత్యాభినయం


కనువిందు చేసిన క్రాకర్స్


అబ్బురపరిచే విన్యాసాలు


వెలుగు జిలుగుల విద్యుత్ కాంతులు


డ్రోనాకాశం..

డ్రోన్ శకానికి బెజవాడ వేదిక అయింది. కృష్ణాతీరం ప్రపంచపటంలో నిలిచింది. దేశాన్ని డ్రోన్ హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి డ్రోన్ సమ్మిట్ క్రియాశీలక అడుగు వేయగా.. డ్రోన్ షో-2024తో దీనిని పతాక స్థాయికి తీసుకు వెళ్లింది. 5,500 డ్రోన్లు నింగిలో సప్తవర్ణ చిత్రాలను ఆవిష్కృతం చేయగా కృష్ణా తీరం పులకించిపోయింది.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

సరిగ్గా రాత్రి 8.30 గంటలకు డ్రోన్‌షోకు కౌంట్‌డౌన్ మొదలైంది. భూమి మీద నుంచి ఆకాశంలోకి నక్షత్రాలు ఎగురుతున్నట్టుగా డ్రోన్లు వీక్షకుల వెనుకగా లేచాయి. మిణుగురులుగా థీమ్ చిత్రాలను ఆవిష్కరించటం ప్రారంభించింది. డ్రోన్ షో అంతా ఏవియేషన్ థీమ్ మీదనే ప్రధానంగా సాగింది. రైట్ బ్రదర్స్ పరిశోధనలతో నాటి రెక్కల విమానం నేడు అభివృద్ధి చెందిన విమానయాన రంగం కళ్లకు కట్టినట్టు చూపించాయి. రైట్ బ్రదర్స్ రూపొందించిన తొలి తరం విమానంతో కూడిన తొలి ఏవియేషన్ తపాలా బిళ్లను ప్రదర్శించాయి. తర్వాత విమానయాన రంగం విప్లవాత్మక మార్పులతో ఏ విధంగా ముందుకు సాగింది.. ఆధునిక సౌకర్యవంతమైన విమాన ప్రయాణాలకు నిదర్శనంగా అతి పెద్ద బోయింగ్ విమానాన్ని ప్రదర్శించింది. బుద్ధుడి ఛాయాచిత్రాన్ని ఆవిష్కరించాయి. గ్రీన్ ఏవియేషన్ రంగంలో భారతదేశం రానున్న రోజుల్లో ఏ విధంగా విప్లవాత్మకమార్పులు చూపిస్తుందన్నది తెలియచెప్పటానికి గ్లోబల్ ఏవియేషన్ ప్లానెట్ ఛాయాచిత్రాన్ని ఆవిష్కరించింది. నేడు డ్రోన్లు ఏ విధంగా వ్యవసాయరంగంలో ఉపయోగపడుతున్నాయో ఈ థీమ్‌లో కళ్లకు కట్టినట్టు చూపింది. ఇంటర్నేషనల్ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్ అతిపెద్ద లోగోను డ్రోన్లు ఆవిష్కరించాయి. చివరగా భారతదేశ ఖ్యాతి తెలియజెప్పేలా అతిపెద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆకాశంలో 5,500 డ్రోన్లు కంప్యూటర్ ప్రోగ్రామింగ్ ఆధారంగా నిర్వహించిన డ్రోన్ షో ఆకట్టుకుంది.



ఐదు గిన్నిస్ రికార్డులు


అశేష జనవాహిని సమక్షంలో నిర్వహించిన డ్రోన్ షో ఐదు గిన్నిస్ బుక్ రికార్డులను నెలకొల్పింది. లార్జెస్ట్ ప్లానెట్‌ను ఆవిష్కృతం చేసినందుకు మొదటి రికార్డును నెలకొల్పింది. కృష్ణా తీరంలో అతిపెద్ద ల్యాండ్ మార్క్‌గా రెండోది, భారీ బోయింగ్ విమానాన్ని సృష్టించినందుకు మూడవ గిన్నిస్ రికార్డు, భారీ జాతీయ జెండా ప్రదర్శనతో నాలుగవ, ఇంటర్నేషనల్ సివిల్ ఏవియేషన్ ప్రదర్శలో అతిపెద్ద లోగోకు ఐదో అవార్డు దక్కింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో రికార్డు పత్రాలను సంస్థ నిర్వాహకులు అందజేశారు.

అబ్బురపరిచిన లేజర్ బీమ్ షో

కార్యక్రమానికి మరో హైలెట్‌గా లేజర్ బీమ్ షో నిలిచింది. పున్నమి ఘాట్‌లోని రెండు ప్రధాన వేదికల దగ్గర లేజర్ బీమ్ షో ఏర్పాటు చేశారు. లేజర్ కాంతులు ప్రాంగణంతో పాటు కృష్ణాతీరం యావత్తూ వెలుగులు జిమ్మాయి. కార్యక్రమ ముగింపుగా బాణసంచా వెలుగులతో ముందుగానే దీపావళి వచ్చింది.

కిటకిటలాడిన పున్నమిఘాట్

ఐదేళ్ల తర్వాత కృష్ణాతీరంలో మెగా ఈవెంట్‌కు అశేషంగా ప్రజలు తరలివచ్చారు. లక్షమందికి పైగానే తరలివచ్చినట్టు అంచనా. డ్రోన్ షో-2024లో నిర్వహించిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



కనకదుర్గ ఫ్లై ఓవర్‌పై వాహనాల బారులు

గంజాయి పట్టివేత

రైల్వేస్టేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ మహిళ నుంచి 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు జీఆర్పీ సీఐ జేవీ రమణ, ఆర్పీఎఫ్ సీఐ ఫతే ఆలీబేగ్‌లు తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, రైల్వే డీఎస్పీ రత్నరాజు ఆదేశాల మేరకు స్టేషన్లలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విజయవాడ స్టేషన్‌లో తొమ్మిదో నెంబరు ప్లాట్‌ఫారంపై తనిఖీలు చేస్తుండగా కర్ణాటక రాష్ట్రం హుబ్లీ జిల్లాకు చెందిన రెహనా (41) అనుమానాస్పదంగా సంచరిస్తున్నదని, ఆమెను అదుపులోకి తీసుకుని ప్రశ్నించామన్నారు. ఆమె బ్యాగ్‌లో 4 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. నర్సీపట్నం ప్రాంతంలో గంజాయి తక్కువ ధరకు దొరుకుతున్నందున్న అక్కడ కొనుగోలు చేసి కర్ణాటక రాష్ట్రానికి తరలించి చిన్న పొట్లాలు చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్టు నిందితురాలు చెప్పినట్టు తెలిపారు. విశాఖపట్నం నుంచి టిక్కెట్ లేకుండా విజయవాడ చేరుకుందన్నారు. ఇక్కడి నుంచి మరో రైలు ఎక్కేందుకు వేచిఉన్న సమయంలో అరెస్టు చేసినట్టు తెలిపారు.

భూ రీ సర్వేలో తప్పులు పరిష్కరించండి

- గ్రామసభ బహిష్కరించిన రైతులు

మైలవరంరూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ ఉన్నతాధికారులు రాకుండా గ్రామసభ ఏమిటని దాసుళ్లపాలెం రైతులు గ్రామసభను బహిష్కరించారు. మంగళవారం గ్రామంలోని పాఠశాలలో రెవెన్యూ అధికారులు గ్రామసభను నిర్వహించారు. గత ప్రభుత్వంలో జరిగిన భూ రీ సర్వేలో తప్పులను పరిష్కరించకుండా అధికారులు గ్రామసభ పెట్టడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమస్యలు ఏమైనా ఉంటే అర్జీలు సమర్పించాలని రైతులను అధికారులు కోరారు. అర్జీలు సమర్పించేది లేదని రైతులు ఆందోళనకు దిగారు. స్కూల్ బయట నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో వందమంది రైతులుంటే 99మందికి రెవెన్యూ సమస్యలు ఉన్నాయని వాపోయారు. సర్వేయర్ల తప్పుల వల్ల బ్యాంకుల్లో రుణాలు తీసుకోవడం కుదరడం లేదని, ఈక్రాప్ కూడా నమోదవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రీసర్వేతో అనేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు చెబుతున్నారు. గ్రామసభకు ఉన్నతాధికారులు రాకపోతే తమ సమస్యలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. గ్రామసభకు ఉన్నతాధికారులు వచ్చిన రోజునే సమస్యలపై అర్జీలు సమర్పిస్తామన్నారు. రైతులు సమస్యలను అర్జీల రూపంలో సమర్పిస్తే ఫీల్డ్‌లో పర్యటించి తప్పులు సరిదిద్దుతామని అధికారులు పేర్కొన్నారు.

విజయవాడ-ఖమ్మం

గ్రీన్ హైవేకు లైన్ క్లియర్

- 243 ఎకరాల భూ సేకరణ పూర్తి
- మరో 30 ఎకరాలకు నోటిఫికేషన్
- నెలాఖరు నాటికి సేకరణ పూర్తి
- 140 ఎకరాల వరకు రైతులకు పరిహారం
- డిసెంబరులో ఎన్‌హెచ్‌కు భూములు స్వాధీనం
- జనవరిలో పనులు ప్రారంభించనున్న మేఘ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)



విజయవాడ-ఖమ్మం గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు భూసేకరణను ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం పూర్తి చేసింది. విజయవాడ-నాగపూర్ ఎకనమిక్ కారిడార్‌లో భాగంగా తెలుగు రాష్ట్రాలను కలిపే ప్రాజెక్టులో భాగంగా ఖమ్మం - దేవరపల్లి మధ్య ఇప్పటికే పనులు జరుగుతున్నాయి. ఖమ్మం నుంచి విజయవాడ వరకు 30 కిలోమీటర్ల నిడివిలో పనులు చేపట్టాల్సి ఉంది. దీనికి సంబంధించి భూసేకరణను జిల్లా యంత్రాంగం కొలిక్కి తెచ్చింది.

ఎన్టీఆర్ జిల్లాలో గంపలగూడెం, జీకొండూరు, విజయవాడ రూరల్ మండలాల పరిధిలో 30 కిలోమీటర్ల పరిధిలో మొత్తం 274 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 243 ఎకరాలను సేకరించింది. 31 ఎకరాల భూములను ఇంకా సేకరించాల్సి ఉంది. ఈ భూములకు సంబంధించి జిల్లా యంత్రాంగం తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. మరికొద్ది రోజుల్లో ఈ భూములను కూడా సేకరించనున్నారు. ఇప్పటి వరకు 140 ఎకరాలకు రైతులకు పరిహారాన్ని అందించటం పూర్తయింది.

హైవే పనులకు టెండర్లు పూర్తి

ఖమ్మం- విజయవాడ నాలుగు వరసల గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు సంబంధించి ఇప్పటికే టెండర్లు పూర్తికాగా మేఘా సంస్థ దక్కించుకుంది. భూములను అప్పగించగానే సంస్థ పనులను చేపట్టనుంది. కేవలం 30 ఎకరాలు మాత్రమే సేకరించాల్సి ఉంది. నెల రోజుల్లో భూములను ఎన్‌హెచ్‌కు స్వాధీనం చేస్తారు. మరోవైపు ఎన్‌హెచ్ కూడా రైతులకు పరిహారం సొమ్మును జమ చేస్తోంది. డిసెంబరులో ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో భూములను స్వాధీనం చేస్తే.. జనవరిలో మేఘా సంస్థ పనులను ప్రారంభించనుంది. మహారాష్ట్ర-ఆంధ్రప్రదేశ్‌ల మధ్య వారధిలా నాగర్‌పూర్-విజయవాడ ఎకనమిక్ కారిడార్ దోహదపడనుంది.

డిస్టలరీల్లో సీఐడీ తనిఖీలు!

- పలు రికార్డులు స్వాధీనం

కంచికచర్ల/కంకిపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా జిల్లాలో పలు డిస్టలరీల్లో మంగళవారం ఉదయం నుంచి సీఐడీ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. గత వైసీపీ ప్రభుత్వంలో మద్యం బాట్లింగ్‌కు సంబంధించి పలు ఆరోపణలు రావడంతో వాటిపై నిగ్గు తేల్చేందుకు కూటమి ప్రభుత్వం డిస్టలరీల్లో జరిగిన అవకతవకలపై విచారణకు ఆదేశించింది. దీనిలో భాగంగా గండేపల్లి సెంథిల్ బయోటెక్ కార్మాగారంలో మద్యం బాట్లింగ్ యూనిట్‌లో సీఐడీ అధికారులు సోదాలు జరిపారు. సీఐడీ అధికారులు ఉదయమే కార్మాగారానికి చేరుకుని బాట్లింగ్ యూనిట్ రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. సోదాల అంశాన్ని చాలా గోప్యంగా ఉంచారు. కార్మాగారంలోకి మీడియాతో పాటుగా ఇతరులెవ్వరినీ సెక్యూరిటీ సిబ్బంది అనుమతించటం లేదు. సాయంత్రం వరకు తనిఖీలు కొనసాగాయి.

కంకిపాడు మండలంలోని దావులూరు, గొడవర్రు



గ్రామాల్లోని డిస్టలరీస్‌లో సీఐడీ అదనపు ఎస్పీ కైలే పాల్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. గొడవర్రు గ్రామంలోని బీవీఎస్ డిస్టలరీస్, దావులూరులోని బీఆర్కే స్పిరిట్స్‌లో మధ్యాహ్నం నుంచి తనిఖీలు నిర్వహించారు. గత వైసీపీ పాలనలో డిస్టలరీస్‌లో సరుకు తయారీ, కొనుగోళ్లు, అమ్మకాల రికార్డులను పరిశీలించారు.

టీడీపీ కౌన్సిలర్ భర్తపై హత్యాయత్నం!




స్టేషన్ ఎదుట బైఠాయించిన టీడీపీ నేతలు, ఎస్సై వెంకటేశ్వరరావుకు వివరిస్తున్న రఘు

జగ్గయ్యపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : బీజేవైఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి, జగ్గయ్య పేట పురపాలకసంఘం మునిసిపల్ కౌన్సిలర్ నోముల స్వప్న భర్త నోముల రఘుపై మంగళవారం సాయంత్రం విజయవాడ ఎస్జీఎస్ కళాశాల సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. రఘు స్కూటర్‌పై నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ సభ్యుడు శ్రీరాం చినబాబును కలిసేందుకు వస్తుండగా, ఎస్జీఎస్ కళాశాల సమీపంలో ఎదురుగా ఇర్టిగో వాహనం అడ్డుపెట్టి నలుగురు వ్యక్తులు మంకీ క్యాప్‌లు ధరించి కత్తులతో దాడికి యత్నించారు. స్కూటర్‌ను వాళ్లపైకి నెట్టి రఘు తప్పించుకున్నాడు.

ఉదయభానుతో ప్రాణహాని : రఘు

జిల్లా జనసేన అధ్యక్షుడు, మాజీ విప్ సామినేని ఉదయభాను వల్ల తనకు ప్రాణహాని ఉందని, నోముల రఘు ఆరోపించారు. 20వ వార్డులో తన భార్య టీడీపీ తరపున పోటీ చేసినప్పటి నుంచి తనపై కక్షగట్టారని, ఉదయభాను అక్రమ మైనింగ్, ఇసుక, మట్టి రవాణా, గో వధకు మద్దతిచ్చి వేదాద్రి గోశాల నుంచి గోవులను బలవంతంగా తీసుకెళ్లినప్పుడు తాను వ్యతిరేకించానని చెప్పారు. ఇటీవల లైమ్‌స్టోన్ మైన్స్ నుంచి ఉదయభానుకు చెందిన లారీలు ఓవర్ లోడ్ స్టీల్ ప్లాంట్ బ్రిడ్జి మీదగా రవాణా చేస్తుంటే అధికారులకు ఫిర్యాదు చేసి జరిమానాలు వేయించినట్టు చెప్పారు. ఫోన్‌లో ఆయన అనుచరులు బెదిరించినా పోరాటం ఆపలేదని, తన అడ్డు తొలగించుకోవాలనే కత్తులతో దాడికి పాల్పడ్డారని చెప్పారు. జగ్గయ్యపేట ఎస్సై వెంకటేశ్వరరావు రఘును వివరాలు అడిగి తెలుసుకున్నారు.

స్టేషన్ వద్ద టీడీపీ నేతల బైఠాయింపు

నోముల రఘుపై హత్యాయత్నం ఘటనపై ఫిర్యాదు చేసేందుకు జగ్గయ్యపేట స్టేషన్‌కు వచ్చిన సందర్భంలో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. రఘుకు మద్దతుగా అనంతరం టీడీపీ నేతలు వేదులాపురి సైదా, బోస్ యాదవ్, కౌన్సిలర్లు బుజ్జిబాబు, గొట్టి నాగరాజు, కంచేటి గీతారాణి తదితరులు వచ్చారు. రఘుకు సత్వర న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని బైఠాయించి నినాదాలు చేశారు. ఎస్సై జోక్యం చేసుకుని ఉన్నతాధికారులతో మాట్లాడి కేసు నమోదు చేస్తామని, నిందితులను తప్పకుండా పట్టుకుని చట్ట ప్రకారం శిక్షిస్తామని హామీ ఇచ్చారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	138, 147, 158
చికెన్ విత్ స్కిన్	266
చికెన్ స్కిన్‌లెస్	276

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 540

సచివాలయ సిబ్బందిని పంచాయతీకి అనుసంధానం చేయాలి

● ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోలి వసంతకుమార్

విజయవాడ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న పంచాయతీల్లో ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి, అందులో ఉన్న సిబ్బందిని పంచాయతీకి అనుసంధానం చేయాలని ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోలి వసంతకుమార్ విజ్ఞప్తి చేశారు. విజయవాడలో జిల్లా కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనాకు వినతిపత్రం అందజేశారు. పంచాయతీల్లో పరిధికి మించి సచివాలయాలు ఏర్పాటు చేశారన్నారు. అందులో ఉన్న సిబ్బందికి ఎవరి ఆదేశాలను పాటించాలో తెలియడం లేదన్నారు. ఈ సిబ్బందిని పంచాయతీలకు అనుసంధానం చేయాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పంచకర్ల సురేష్ పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతతో సైబర్ నేరాలకు చెక్

అవగాహన సదస్సులో ఏసీపీ దామోదర్

గుణదల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని సైబర్ నేరాలకు చెక్ పెట్టాలని, సమష్టి కృషితోనే ఇది సాధ్యపడుతుందని సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్ అన్నారు. పటమట పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు రకాల బ్యాంకర్లతో సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్ మంగళవారం సైబర్ నేరాలకు చెక్ పెట్టడం ఎలా అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకౌంట్లో నుంచి నగదు విత్‌డ్రా అయినట్లుగా మెసేజ్ వస్తే తక్షణమే 1930 నెంబరుకు కాల్ చేస్తే క్షణాల్లో నేషనల్ సైబర్ క్రైమ్‌లో నమోదు కావడం జరుగుతుందని తెలిపారు. వెంటనే ఏ అకౌంట్ నుంచి నగదు విత్‌డ్రా అయి మరో బ్యాంక్‌కు జమ అయ్యిందో సదరు బ్యాంక్ అకౌంట్ నిలిపివేస్తారని, అలా చేయడం వల్ల నేరస్తులు నగదును డ్రా చేసుకోకుండా నిలువరించి సమస్యను పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. బ్యాంకర్లు, పోలీసులు, పౌరులు సమష్టిగా పనిచేస్తేనే సైబర్ నేరగాళ్లకు చెక్‌పెట్టడం సాధ్యపడుతుందన్నారు. అపరిచితులు ఫోన్ చేసి తాము బ్యాంక్ నుంచి కాల్ చేస్తున్నామని, ఇన్‌కం ట్యాక్స్ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామని, సీబీఐ అని ఇలా ఎదుటివారిని నమ్మించేలా కాల్ చేస్తారని, పలు రకాల సమాచారం సేకరిస్తారని, జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. నకిలీ పత్రాలతో రుణాలు పొందేవారు కూడా తయారయ్యారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పటమట సీఐ పవన్ కిషోర్, గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్, పటమట, గుణదల సీఐలు పవన్ కిషోర్, వాసిరెడ్డి శ్రీనివాస్

వైసీపీ పాలనలో యూజీడీ అస్తవ్యస్తం

ఎమ్మెల్యే గద్దె ధ్వజం

పటమట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ చేతకాని పాలన వలన నియోజకవర్గంలో యూజీడీ సైడు కాల్వలు స్థంబించి ప్రజలు అవస్థలు పడుతున్నారని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ధ్వజమెత్తారు. 10వ డివిజన్ న్యూ పోస్టల్ కాలనీలో గద్దె రామ్మోహన్ మంగళవారం పర్యటించారు. కాలనీలోని 2, 3వ రోడ్డులో సైడు కాల్వల సమస్యలను ఆయన పరిశీలించారు. తమ ప్రభుత్వం డ్రెయినేజీ మురుగునీటి కాల్వలను శుభ్రం చేయటానికి నిర్ణయించిందని, అందులో భాగంగానే మొదటి సారిగా ఈ డివిజన్‌లో పూడిక తీయించే పనులు చేపట్టామన్నారు. ఇక్కడ కాల్వల్లో ఉన్న రెండు విద్యుత్ స్తంభాలను తొలగించడానికి రూ.లక్షల వ్యయం అవుతుందని, ప్రభుత్వం నుంచి వస్తే సరి లేకపోతే ఈ సమస్యను స్థానిక కార్పొరేటర్‌తో కలిసి పరిష్కరిస్తానని గద్దె హామీ ఇచ్చారు. ప్రతి వారం ఒక డివిజన్‌లో పర్యటించి అక్కడ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దేవినేని అపర్ణ, ముమ్మనేని ప్రసాద్, పోతంశెట్టి నాగేశ్వరరావు, ఈఈ సామ్రాజ్యం, విద్యుత్ ఏఈ ఏడుకొండలు, దండమూడి చంద్రశేఖర్‌రావు, తుమ్మల వెంకట్రావు, వి.రామారావు, ఈ.రామారావు, సుధాకర్‌లు పాల్గొన్నారు.



స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

అక్రమ నిర్మాణాన్ని ఆపమన్నందుకు సీఐ బెదిరిస్తున్నారు

పటమట వాసి మిరియాల రేణుక

పటమట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ గఫార్‌తో తన భర్తకు ప్రాణహాని ఉందని పటమట శివశంకర్ నగర్‌వాసి మిరియాల రేణుక ఆరోపించారు. అక్రమ నిర్మాణాన్ని ఆపమని కోరితే తన మనుషులతో గఫార్ బెదిరిస్తున్నారని ఆమె తెలిపారు. పటమట శివశంకర్ నగర్‌లో డోర్ నెంబర్ 73-6-11లో ఉంటున్నానని, తన పక్కన అనుమతులు లేకుండా ఆయన కడుతున్న భవనానికి సెట్‌బ్యాక్స్ లేకుండా నిర్మాణం సాగిస్తున్నాడని తెలిపారు. అక్రమ నిర్మాణాన్ని ఆపాలని కోర్టు నుంచి ఇంజెక్షన్ ఆర్డర్ తెచ్చినా, కోర్టు ఉత్తర్వులు లెక్కచేయకుండా నిర్మాణాన్ని కొనసాగిస్తున్నాడని ఆమె ఆరోపించారు. తాను మధ్యతరగతి కుటుంబీకురాలిని అని, తనకు ఉన్న ఆ చిన్న ఇంట్లోకి ఎవరూ అద్దెకు రావడం లేదని, తన జీవనాధారం పోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు తనకు తగు విధంగా న్యాయం చేయాలని ఆమె కోరారు.

కృష్ణలంక సబ్‌వే వద్ద ట్రాఫిక్ రద్దీ

● ఉదయం, సాయంత్రం నిలిచిపోతున్న వాహనాలు ● కానరాని ట్రాఫిక్ కానిస్టేబుల్

(కృష్ణలంక, ఆంధ్రజ్యోతి)
కృష్ణలంక రామాలయం వద్ద సబ్‌వే కింద వాహనాలు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ రద్దీతో స్తంభిస్తోంది ఉదయం పూట ఆఫీసులకు, స్కూళ్లకు వెళ్లే ఆటోలు, స్కూల్ బస్సులు, సాధారణ ప్రజల వాహనాలు, ఆటోలతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. దీనికి తోడు జాతీయ రహదారిపై ట్రాఫిక్ రద్దీగా వుంటే భారీ వాహనాలు, సిటీ, ఆర్టీసీ బస్సులు కూడా కృష్ణలంక సర్వీసు రోడ్డుమీదుగా వెళ్తుండటంతో నిత్యం ట్రాఫిక్ రద్దీగా మారింది. ఇక్కడ ట్రాఫిక్‌ను నిరోధించేందుకు ట్రాఫిక్ కానిస్టేబుల్ ఎవరూ ఉండరు. వాహనాలు రద్దీ ఎక్కువై ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయిన సందర్భాల్లో బందరు రోడ్డులోని రంగా విగ్రహం వద్ద విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్, సివిల్ పోలీసులు వచ్చి అప్పుడప్పుడు సబ్‌వే వద్ద ట్రాఫిక్ జామ్‌ను క్రమబద్ధీకరిస్తూ వుంటారు. జాతీయ రహదారి కింద సబ్‌వేకు రెండు వైపులా ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.





కృష్ణలంక సబ్‌వే వద్ద వాహనాల రద్దీ



థాంక్యూ సీఎం సార్ అంటూ నినాదాలు చేస్తున్న బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు

థాంక్యూ సీఎం సార్

● రూ.750 కోట్ల బకాయిల విడుదలపై హర్షం

●చంద్రబాబుకు బిల్డర్స్ అసోసియేషన్ కృతజ్ఞతలు

లబ్బీపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే తమకు రావాల్సిన దాదాపు రూ.3 వేల కోట్ల బకాయిల్లో రూ.750 కోట్లు నిధులు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్నమని బిల్డర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డి.పంకజ్‌రెడ్డి తెలిపారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బందర్‌రోడ్డు వ్యాస్ కాంప్లెక్స్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో థాంక్యూ సీఎం సార్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పంకజ్‌రెడ్డి మాట్లాడుతూ రూ. 750 కోట్ల బకాయిలు విడుదల చేసి కాంట్రాక్టర్లకు ఊరట నిచ్చారన్నారు. మిగిలిన బకాయిలను కూడా రాబోయే మార్చి నాటికి విడుదల చేయాలని, చిన్న కాంట్రాక్టర బకాయిలు రూ.200 కోట్లు తక్షణ విడుదల చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ సలహా కమిటీ సభ్యుడు సిహెచ్ రామకోటయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బకాయిలు మంజూరు చేసి చేతల మనిషిగా నిరూపించుకున్నారన్నారు. మిగిలిన బకాయిలు కూడా మంజూరు చేసి కాంట్రాక్టర్లను అదుకోవాలన్నారు. రోడ్ల అభివృద్ధికి ఒక ప్రణాళికను సీఎంకు అందించామని, దానిని అమలు చేస్తే రాష్ట్రంలోని 45 వేల కిలోమీటర్ల రోడ్లను అద్ధంలా తీర్చిదిద్దవచ్చన్నారు. అసోసియేషన్ సభ్యులు థ్యాంక్యూ సీఎం సార్ ప్లకార్డులను ప్రదర్శించి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. అసోసియేషన్ చైర్మన్ ఎ.నాగమల్లేశ్వరరావు, మాజీ చైర్మన్ బి.రాఘవరావు, వైస్ చైర్మన్లు కె.వెంకట నాగిరెడ్డి, ఎన్.నాగేశ్వరరావు, ఎ.కాశివిశ్వేరరావు, టి.భాస్కరరావు, ట్రెజరర్ పి.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రత్యామ్నాయ ప్రణాళికతో వ్యవసాయాభివృద్ధి

● కేరళ మంత్రి ఎంబీ రాజేష్

గవర్నర్‌పేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పరిమిత అధికారాలు, కేంద్ర ప్రభుత్వ సహాయ నిరాకరణ నేపథ్యంలో ప్రత్యామ్నాయ ప్రజాప్రణాళికతో వ్యవసాయ రంగం రక్షణకు, రైతుల సంక్షేమానికి ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం పనిచేస్తోందని కేరళ స్వపరిపాలన, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి ఎంబీ రాజేష్ పేర్కొన్నారు. ఎంబీవీకేలో మంగళవారం జరిగిన జాతీయ సదస్సులో వ్యవసాయ రంగ సమస్యలు-కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంశంపై కేరళ మంత్రి రాజేష్ ప్రసంగించారు. సదస్సుకు ఏపీ రైతు సంఘం సీనియర్ నాయకులు వై. కేశవరావు అధ్యక్షత వహించారు. రాజేష్ మాట్లాడుతూ కేరళలో స్థానిక సంస్థలను స్థానిక ప్రభుత్వాలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. వీటికి కేటాయించిన నిధుల్లో 30 శాతం వ్యవసాయ, దాని అనుబంధ రంగాల రక్షణకు ఖర్చు చేస్తున్నామన్నారు..



జాతీయ సదస్సులో ప్రసంగిస్తున్న కేరళ రాష్ట్ర మంత్రి ఎంబీ రాజేష్

రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ ఖర్చులు పెరుగుతున్నాయని, పంటలకు ధరలు ఉండటం లేదన్నారు. ముప్పేట దాడిలో రైతు సతమతమౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచంలో అన్ని దేశాలు 12 శాతం నుంచి 50 శాతం వరకు రైతుకు ప్రోత్సాహం ఇస్తుంటే, మన దేశంలో అతి తక్కువ శాతం ప్రోత్సాహం దక్కుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు మద్దతు ధరలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ రంగ నిపుణుడు కె. అశోక్‌రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆరు స్తంభాల మీద నిలబడి వ్యవసాయ రంగాన్ని నాశనం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అఖిల భారత కిసాన్ సభ నాయకుడు పి.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రైతు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య కనీస మద్దతు ధర సాధించడం కోసం నవంబరు 26న దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపారు. సదస్సులో ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి. కృష్ణయ్య, కె. ప్రభాకరరెడ్డి, వివిధ వ్యవసాయ సంఘాల నేతలు మర్రాపు సూర్యనారాయణ, వై.రాధాకృష్ణ, ఎం. హరిబాబు, వి. వెంకటేశ్వర్లు, సిహెచ్ నరసింగరావు, ఎస్ ఝాన్సీ, అక్కినేని భవానీప్రసాద్, కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఆర్డీఏ భూముల్లో పాగా!

●25 ఎకరాలు ఆక్రమించిన వైసీపీ నేత

తుళ్లూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : టీడీపీ అధినేత చంద్రబాబు గత వైసీపీ ప్రభుత్వంలో రాజధాని అమరావతి పరిస్థితిని సమీక్షించడానికి బస్సులో బయలుదేరారు. సీడ్ యాక్సిస్ రోడ్డులోకి బస్సు ప్రవేశించగానే వైసీపీ అల్లరి మూకలు దానిపై రాళ్లు రువ్వారు, చెప్పులు విసిరారు. పోలీసులు నిలువరించడంతో పాటు, కొద్దిదూరంలో ఉన్న టీడీపీ శ్రేణులు పరుగున రావడంతో వైసీపీ గ్యాంగ్ జారుకుంది. ఆ ఘటనలో గుంటూరు జిల్లా తుళ్లూరు మండల పరిధిలోని శాఖమూరు గ్రామానికి చెందిన బూత్ కమిటీ ప్రెసిడెంట్ జొన్నకూటి ప్రశాంత్ పాల్గొన్నారు. రాజధానికి రైతులిచ్చిన సీఆర్డీఏ భూములను, పక్కనే ఉన్న రైతుల పొలాలను 25 ఎకరాల వరకు ఆయన ఆక్రమించారు. ఆ భూముల్లో ఐదేళ్ల నుంచి సాగు చేస్తూ భారీగా లబ్ధి పొందుతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా ఆ భూముల్లో మినుము పైరు వేశారు. దీనిపై ఫిర్యాదు చేసినా సీఆర్డీఏ అధికారుల్లో చలనం లేదని రాజధాని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ సాగుపై గతంలోనూ తావిచ్చిన ఫిర్యాదులను సీఆర్డీఏ అధికారులు బుట్టదాఖలు చేశారని చెబుతున్నారు. వైసీపీతో అంటకాగిన కొంతమంది సీఆర్‌డీఏ అధికారుల అండతోనే ఆక్రమించిన భూముల్లో ఆ నాయకుడు యథేచ్ఛగా పంట సాగు చేస్తున్నాడనే ఆరోపణలున్నాయి.

అమరావతి రైలుమార్గానికి భూసేకరణ

గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి నూతన రైలు మార్గం వేయడానికి భూమి సేకరించేందుకు తొలి అడుగు పడింది. ఈ బ్రాడ్‌గేజ్ రైలుమార్గం (ఎర్రుపాలెం-నంబూరు) కోసం గుంటూరు జిల్లాలో దాదాపుగా 200 ఎకరాల వరకు భూమి సేకరించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఆ మేరకు ఎలైన్‌మెంట్‌ను రెవెన్యూ శాఖకు ఇవ్వగా.. సర్వే నంబర్లవారీగా సేకరించదలచిన భూమి విస్తీర్ణాన్ని పేర్కొంటూ ఆ శాఖ ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిపై అభ్యంతరాలు, సూచనలు స్వీకరించి భూసేకరణకు ముందుకెళ్తామని రెవెన్యూ వర్గాలు తెలిపాయి.

సాధ్యమైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేసి రైల్వే శాఖ కోరిన స్థలాన్ని స్వాధీనపరుస్తామని పేర్కొన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ఢిల్లీ వెళ్లినప్పుడు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టుల గురించి చర్చించారు. వాటిలో ప్రధానమైన అమరావతి రైలు మార్గాన్ని ముందుగా చేపట్టాలని ఆ శాఖ నిర్ణయించింది.

మొత్తం 56.53 కిలోమీటర్ల పొడవున తొలుత సింగిల్ లేన్ నిర్మించనుంది. ఇందుకోసం గుంటూరు జిల్లా పెదకాకాని మండలం కొప్పురావూరు, పెదకాకాని.. తాడికొండ మండలంలోని కంతేరు, మోతడక, తాడికొండ.. తుళ్లూరు మండలంలోని వడ్డమాను, పెదపరిమి గ్రామాల్లో భూసేకరణకు చర్యలు చేపట్టింది. ఈ ఏడు గ్రామాలూ రాజధాని వెలుపల ఉన్నవే. మరికొన్ని గ్రామాలు కూడా ఎలైన్‌మెంట్‌లో ఉండగా అవి రాజధానిలో భాగం కావడం, ఆ భూమి సీఆర్‌డీఏ స్వాధీనంలో ఉన్న దృష్ట్యా ఎప్పుడు అవసరమైతే అప్పుడు ఆ భూమి తీసుకునే వెసులుబాటు ఉంది.

వరద బాధితుల ఖాతాలకు రూ.235.72 కోట్లు జమ

పెండింగ్ దరఖాస్తులు రేపటిలోగా పరిష్కరిస్తాం : ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా

వన్‌టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా వరద ముంపు బాధితుల్లో 1,44,672 మంది ఖాతాలకు రూ.235.72 కోట్లు జమ చేసినట్లు ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇంకా 2,478 మంది వరద ముంపు బాధితుల దరఖాస్తులు పరిశీలించి నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బాధితులు ఎవరూ ఆందోళన చెందనవసరం లేదన్నారు. బ్యాంక్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాని 476 మంది ఖాతాలకు ఆధార్‌ను అనుసంధానం చేసి జమ చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న 2,478 దరఖాస్తులను ఈనెల 24వ తేదీలోగా పరిష్కరించి బాధితులకు నష్టపరిహారం చెల్లించటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. నష్టపోయిన ప్రతి బాధితునికి పరిహారం చెల్లించేలా ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పారదర్శక చర్యలు తీసుకుని ప్రతి ఒక్క బాధిత కుటుంబానికి పరిహారం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్నేహితుడే ప్రాణం తీశాడు!

అజిత్‌సింగ్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వారిద్దరు చిన్ననాటి స్నేహితులు. ఒకే పాఠశాల, కళాశాలల్లో చదువుకున్నారు. చదువు అయిపోయి పెళ్లిళ్లు చేసుకుని ఐదు పదులు వయస్సు దాటినా స్నేహ బంధాన్ని అలానే నిలబెట్టుకున్నారు. వేరు వేరు ఊర్లల్లో స్థిరపడినా అప్పుడప్పుడు కలుసుకుని మంచి చెడులు మాట్లాడుకునే వారు. అలాంటి స్నేహితుల మధ్య మద్యం చిచ్చుపెట్టింది. ఇద్దరి మధ్య ఎలాంటి మనస్పర్థలు లేకపోయినా ఒకరిని ఇంకొరు చంపుకునేంత వరకు తీసుకెళ్లింది. సోమవారం అర్ధరాత్రి నగరంలోని లోటస్ ల్యాండ్ మార్క్‌లో జరిగిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన సాగి వెంకట నరసింహరాజు (54) బాల్యంలో విజయవాడలో చదువుకున్నాడు. అనంతరం హైదరాబాద్‌లో సెటిల్ అయిన నరసింహరాజు తనతో పాటు చదువుకున్న ఎండీ రఫీ (54)తో స్నేహాన్ని కొనసాగిస్తున్నాడు. విజయవాడ ఎప్పుడు వచ్చినా మిత్రులు కలుసుకుంటారు. సోమవారం నగరానికి వచ్చిన నరసింహరాజు రఫీని కలిశాడు. లోటస్ ల్యాండ్‌లో ఉన్న తన ఫ్లాట్‌లో ఉన్నానని చెప్పడంతో రఫీ మద్యం తీసుకుని ఫ్లాట్‌కు వెళ్లాడు. అర్ధరాత్రి వరకు మద్యం తాగారు. మాటల మధ్యలో రఫీ తనకు కొంత డబ్బు కావాలని అడిగాడు. డబ్బు అప్పుగా ఇవ్వడానికి నరసింహరాజు అంగీకరించి కొంత గడువు పెట్టాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటా మాట పెరిగి రఫీ పక్కనే ఉన్న కత్తెరతో నరసింహరాజుపై దాడికి ప్రయత్నించాడు. దీంతో నరసింహరాజు నడుముకు ఉన్న టవల్‌ను రఫీ మెడకు బలంగా బిగించి పట్టుకున్నాడు. టవల్‌ను అలాగే పట్టుకుని ఉండటంతో రఫీ అక్కడికక్కడే మృతి చెందాడు. నరసింహరాజు జరిగిన విషయాన్ని అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫోన్‌లో తెలియజేసి లొంగిపోయాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


మృతుడు రఫీ


అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా

అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ టోర్నీ ప్రారంభం

విజయవాడ స్పోర్ట్స్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : భారతీయ నవీన్ క్రీడా ఉత్సవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీతారామపురం ఐకాన్ పబ్లిక్ స్కూల్ వేదికగా తొలి అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ టోర్నీ మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, విశిష్ట అతిథిగా ఏపీ గ్రాండ్‌మాస్టర్ పి.లలిత్‌బాబు బోర్డుపై చెస్ ఆడి టోర్నీని లాం ఛనంగా ప్రారంభించారు. ఐకాన్ స్కూల్ డైరెక్టర్లు వై పార్థసారధి, కె రాజేంద్ర, చైర్మన్ గుడిపాటి కిషోర్‌లు మాట్లాడుతూ అం తర్జాతీయం గా చెస్ ప్రాముఖ్యత ఈ టోర్నీ చాటి చెబుతుందన్నారు. పోటీల ఏర్పాట్లను కన్వీనర్ షేక్ ఖాసీమ్,డైరెక్టర్ విత్తనాల కుమా ర్, బీఎస్‌కేయూ ప్రెసిడెంట్ భీమారావు, సీహెచ్‌ఎస్ కోచ్ మురళీధర్‌లు పర్యవేక్షిస్తున్నారు.

సాగునీటి రంగంపై నేడు సీఎం సమీక్ష

అమరావతి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సాగునీటి రంగంపై ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం సమీక్షించనున్నారు. పోలవరం, వెలిగొండ, హంద్రీనీవా, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి తదితర పథకాలపై ముఖ్యమంత్రి సమీక్షిస్తారు. పోలవరం డయాఫ్రమ్‌వాల్, ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ పనులు చేపట్టాల్సిన బావర్ డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ పనులకు గడువు కోరుతోంది. ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ పనులు పూర్తి చేసేందుకు నాలుగేళ్లు పడుతుందని చెబుతోంది. ఈ నేపథ్యంలో ఈ పనుల పైనా సీఎం చంద్రబాబు సమీక్షించనున్నారు.

టీడీపీ గ్రీవెన్స్‌లో వైసీపీ బాధితుల ఫిర్యాదులు

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ప్రభుత్వం హయాంలో నేను నారా లోకేశ్‌తో ఫొటో దిగాను. ఆ కక్షతో నేను పట్టు చీరలు అమ్మిన డబ్బులు ఇవ్వకుండా కేతిరెడ్డి అనుచరులు వేధించారు. అక్రమ కేసులు పెట్టారు... జగన్ పాలనలో టిడ్కో ఇళ్ల గురించి ప్రశ్నించినందుకు నా ఇంటిని లూటీ చేశారు...' అంటూ వైసీపీ బాధితులు బావురుమన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి సవిత, ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, శివప్రసాద్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ధర్మవరానికి చెందిన రంగం ఆంజనేయులు అనే బాధితుడు.. 'నా వద్ద పట్టు చీరలు కొనుగోలు చేసిన వారి నుంచి డబ్బులు ఇప్పించాలి. నావద్ద చీరలు తీసుకున్న కందికుంట గాయత్రీ నుంచి రూ.78 లక్షలు రావాల్సి ఉండగా, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మనుషులతో బెదిరిస్తున్నారు' అంటూ వాపోయారు. టిడ్కో ఇళ్లపై ప్రశ్నించినందుకు భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నా ఆఫీస్, ఇంటికి దొంగల్ని పంపి, లూటీ చేయించారు' అని షేక్ అలీ ఉషేన్ అనే విలేకరి ఫిర్యాదు చేశారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తుంటే అప్పటి మంత్రి విడదల రజనీ 30 మందిపై తప్పుడు కేసులు పెట్టించారని విద్యార్థులు టీడీపీ నేతల దృష్టికి తెచ్చారు. వైసీపీ నేతలు తమ భూ ముల్ని కొట్టేయడానికి ప్రయత్నిస్తున్నారని కొండవీడు దళితులు ఫిర్యాదు చేశారు. 2019 ఎన్నికల్లో వైసీపీకి వ్యతిరేకంగా పని చేశామన్న కక్షతో తన నర్సరీలో కలుపు మందు చల్లి, రూ. 20 లక్షలు నష్టం చేసిన వారిపై చర్య లు తీసుకోవాలని ఏలూరు జిల్లా దామరచర్లకు చెందిన వెల్లంకి సురేశ్ కోరారు.. 'నా భూమిని ఆక్రమించారు. నకిలీ పత్రాలతో రిజిస్టర్ చేయించుకున్నార నంద్యాల జిల్లా సదురు వాసి అబ్దుల్ ఖాదర్ కోరారు. పెళ్లికి ఒప్పుకోలేదని పగబట్టిన మహిళ తన కుమారుడిని ఉరేసి చంపిందని, 84 రోజులైనా పోస్టుమార్టం నివేదిక ఇవ్వలేదని అయ్యంకి వాసి సుందరమ్మ వాపోయింది.


20 సూత్రాల పథకం చైర్మన్ లంకా దినకర్‌ను సత్కరిస్తున్న షేక్ బాజీ తదితరులు

రాష్ట్ర 20 సూత్రాల పథకం చైర్మన్

లంకా దినకర్‌కు ఘన సత్కారం

వన్‌టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర 20 సూత్రాల పథకం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన లంకా దినకర్‌ను రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ బాజీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. షేక్ బాజీ మాట్లాడుతూ బడ్జెట్‌పై పూర్తి అవగాహన ఉన్న దినకర్‌కు ఈ పదవి ఇవ్వ టం అన్ని విధాల సముచితమన్నారు. దినకర్ మాట్లాడుతూ, పేదవారికి ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేవిధంగా చూడటమే తన లక్ష్యమన్నారు. తనకు పదవి ఇచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర కార్యనిర్వహణాధికారి మధుకర్‌జీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిలకు కృతజ్ఞతలు తెలిపారు అడ్డూరి శ్రీరామ్, వంశీకృష్ణ, బాల కోటేశ్వరరావు, శ్రీధర్, పట్నాయక్, బుల్లిబ్బాయ్, సాయి పాల్గొన్నారు.

ట్రావెల్స్ డ్రైవర్లను వెంటనే అరెస్టు చేయాలి


వన్‌టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ డ్రైవర్ ఎస్.కె.నజీర్ పై కుర్చేడు వద్ద ప్రైవేటు ట్రావెల్స్ డ్రైవర్లంతా దాడి చేయడాన్ని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జి.వి.నరసయ్య మంగళవారం ఖండించారు. ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన ట్రావెల్స్ బస్సు డ్రైవర్లను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

టాటా మోటార్స్ ట్రక్ ఉత్సవ్ రేపు

వన్‌టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఈనెల 24న దేశ్ కా ట్రక్ ఉత్సవ్ నిర్వహించనున్నట్లు టాటా మోటార్స్ సంస్థ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. టాటా మోటార్స్ తాజా శ్రేణి ట్రక్కులు వ్యాల్యూయాడెడ్ సర్వీసుతో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు యాజమాన్యం తెలిపింది. కస్టమర్ల వ్యాపారాలను భవిష్యత్తుకు అనుగుణంగా తీర్చిదిద్దటంతో పాటు అత్యాధునిక ఉత్పత్తులను అందచేయటానికి ఈ వేదిక ఉపకరిస్తుందని సంస్థ కమర్షియల్ వెహికల్స్ వైస్ ప్రెసిడెంట్, బిజినెస్ హెడ్ రాజేష్ కౌల్ పేర్కొన్నారు.

సీఎం సహాయనిధికి రూ.25 లక్షల విరాళం

పటమట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : తూర్పునియోజకవర్గంలో పలు కాలనీల ప్రజలు, వివిధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.25 లక్షల విరాళాన్ని అందజేశారు. విరాళం చెక్కులను ఉండవల్లిలోని మానవ వనరుల మంత్రి నారా లోకేశ్‌కు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మంగళవారం అందజేశారు. గద్దె తనయుడు గద్దె క్రాంతికుమార్ కూడా ఉన్నారు.


చెక్కులను మంత్రి లోకేశ్‌కు అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

తుఫాను కారణంగా పలు రైళ్ల రద్దు

రైల్వేస్టేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : దానా తుఫాను కారణంగా ఈస్ట్ కోస్టు రైల్వే డివిజన్ పరిధిలో 23, 24 తేదీల్లో పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఈనెల 23వ తేదీన కామాఖ్య - ఎస్ఎంబీటీ బెంగళూరు, సిల్చార్ - సికింద్రాబాద్, డిబ్రూగర్ - కన్యాకుమారి, సికింద్రాబాద్ - భువనేశ్వర్, చెన్నై సెంట్రల్ - హౌరా, పుదుచ్చేరి - హౌరా, చెన్నై - షాలిమార్, పుదుచ్చేరి - భువనేశ్వర్, కెఎస్ఆర్ బెంగళూరు - భువనేశ్వర్, సీఎస్‌టీ ముంబయి - భువనేశ్వర్, ఎస్ఎంబిటి బెంగళూరు - గౌహతి, హైదరాబాద్ - హౌరా, కన్యాకుమారి - డిబ్రూగర్, సికింద్రాబాద్ - హౌరా, ఎస్ఎంబిటి బెంగళూరు - హౌరా, సికింద్రాబాద్ - మాల్దా టౌన్, యశ్వంతపూర్ - హౌరా, తిరున్వేలి - షాలిమార్ రైళ్లను రద్దు చేశారు. ఈనెల 24వ తేదీన పూరీ - తిరుపతి, హౌరా - సికింద్రాబాద్, ఖర్గపూర్ - విల్లుపురం, హౌరా - భువనేశ్వర్, షాలిమార్ - చెన్నై సెంటర్, సత్రాగచ్చి - మంగళూరు సెంటర్, హౌరా - తిరుచురాపల్లి, హౌరా - ఎస్ఎంబిటి బెం గళూరు, షాలిమార్ - వాస్కోడగామ, హౌరా - చెన్నై సెంట్రల్, పాట్నా - ఎర్నాకులం, సత్రాగచ్చి - చెన్నై సెంట్రల్ రైళ్లను రద్దు చేశారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

వన్‌టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త నినాదంతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలను అభివృద్ధి చేయాలని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఎంఎస్ఎంఈ అధికారులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. విజయవాడ పార్లమెంట్ టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో 2024-25 సంవత్సరానికి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రూపొందించిన జాబ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. జగ్గయ్యపేట, తిరువూరు, నందిగామ, మైలవరం, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎంఎస్ఎంఈలపై సమీక్ష నిర్వహించారు. ప్రతి నియోజకవర్గంలో కూడా ఎంఎస్ఎంఈ పథకాలపై, యూనిట్ స్థాపన, ఉత్పత్తుల మార్కెటింగ్, బ్యాంకు రుణం, రుణాలు చెల్లింపు అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. వచ్చే నెలలోనే ఈ అవగాహనా సదస్సును ఏర్పాటు చేయాలన్నారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పట్టాభిరామ్, కేవైఐసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గ్రీఫ్, ఎన్టీఆర్ జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్.శ్రీనివాస్, ఎంఎస్ఎంఈ అధికారి కిరణ్, ఇండస్ట్రీయల్ సెంటర్ జనరల్ మేనేజర్ సాంబయ్య, ఎన్టీఆర్ జిల్లా ఎల్‌డీఎం ప్రియాంక, జిల్లా ఉపాధి కల్పనాధికారి విక్టర్ బాబు, ఎన్టీఆర్ జిల్లా ఏపీఎస్ఎండీసీ, పీఏడీఎస్‌పీవో దుర్గాప్రసాద్, డీపీవో ఎ.మోహన్‌బాబు, పాల్గొన్నారు.


జాబ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే తాతయ్య, పట్టాభి

జాతీయ డ్రోన్ సమ్మిట్ సీఎం చంద్రబాబుకే సాధ్యం

దేశంలో ఢిల్లీ తరువాత ఏపీలోనే జాతీయ డ్రోన్ సమ్మిట్ నిర్వహించటం సీఎం చంద్రబాబుకే సాధ్యమని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. భవానీపురం బబ్బూరి గ్రౌండ్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం, డ్రోన్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్వహించిన డ్రోన్ సమ్మిట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడుతో కలిసి శివనాథ్ పాల్గొన్నారు.

ఎస్.ఆర్.శంకరన్ జీవితం స్ఫూర్తిదాయకం

● చేనేత, జౌళి శాఖా ముఖ్యకార్యదర్శి సునీత

గవర్నర్‌పేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : బడుగుల సంక్షేమానికి నిర్విరామంగా పని చేసిన మాజీ ఐఏఎస్ అధికారి ఎస్.ఆర్.శంకరన్ నిరాడంబర జీవితం స్ఫూర్తిదాయకమని చేనేత, జౌళిశాఖ ముఖ్యకార్యదర్శి సునీత అన్నారు. ఎస్.ఆర్.శంకరన్ మె మోరియల్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం లెనిన్‌సెంటర్‌లోని ఐక్యతాభవన్‌లో శంకరన్ జయంతి నిర్వహించారు. శంకరన్ విగ్రహానికి నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ మాట్లాడుతూ అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం శంకరన్ కృషి చేశారన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ నిజాయితీకి మారుపేరు శంకరన్ అన్నారు. కమిటీ కన్వీనర్ జెల్లి విల్సన్ మాట్లాడుతూ శంకరన్ జయంతి, వర్ధంతిని ప్రభుత్వమే అధికారికంగా చేపట్టాలన్నారు. వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి బి. రాజశేఖర్, ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ జయశంకర్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, సిహెచ్ కోటేశ్వరరావు, ఆవుల శేఖర్‌తదితరులు పాల్గొన్నారు.

బుడమేరుకు శాశ్వత పరిష్కారం

(5వ పేజీ తరువాయి)

ముందుకెళతాం. పెద్ద ఆక్రమణదారుల విషయంలో ఎలాంటి వెనుకడుగు ఉండదు. నగరంలోని ప్రధాన డ్రెయిన్ల ఆక్రమణల తొలగింపుపై కూడా దృష్టి సారించనున్నాం. ముఖ్యంగా రైల్వే స్థలాల ఆక్రమణ ఎక్కువగా ఉంది. ఈ కారణంగా వీఎంసీ, రైల్వే అధికారులతో ఓ కమిటీ ఏర్పాటు చేశాం. వారి సూచనలతో ఆక్రమణల తొలగింపుపై ముందుకెళ్తాం. అలాగే స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పనులను గతంలో టీడీపీ హయాంలో ప్రారంభిస్తే వైసీపీ హయాం లో అడ్డుకుని ఆపివేశారు. తిరిగి ఆ పనులను ప్రారంభిస్తాం. ఆ పనులు పూర్తయితే నగరంలో వరద నీటి సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

బెజవాడ ట్రాఫిక్ సమస్యపై దృష్టి

విజయవాడ ట్రాఫిక్ సమస్యకు ఫ్లైవోవర్లు, బైపాస్ రోడ్డుల నిర్మాణంతోనే పరిష్కారం లభిస్తుంది. మహానాడు జంక్షన్ నుంచి నిడమనూరు రైల్వే బ్రిడ్జి వరకు 6.5 కిలోమీటర్ల మేర నిర్మించే ఫ్లైవోవర్ డీపీఆర్ సిద్ధం చేశాం. దీనికి రామవరప్పాడు వద్ద ఇన్ అండ్ ఔట్ ఎగ్జిట్ ఇస్తున్నారు. ఫ్లైవోవర్ డిజైన్లు కూడా రెడీ అయ్యాయి. టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి 2025 ఫిబ్రవరి నుంచి పనులు ప్రారంభిస్తాం. రెండేళ్లలో ఫ్లైవోవర్‌ను పూర్తి చేస్తాం. విజయవాడ తూర్పు బైపాస్ రోడ్డుకు కూడా డీపీఆర్ పూర్తయింది. అలైన్‌మెంట్ డిజైన్ కూడా ఫైనల్ చేశాం. టెండర్లు పూర్తి చేసి 2025 మార్చికి పనులు ప్రారంభిస్తాం. రాజధాని అమరావతి తొలి దశ పనులు పూర్తయ్యే నాటికి తూర్పు బైపాస్ కూడా పూర్తి చేసి అందుబాటులోకి తెస్తాం. మొత్తం మీద రెండేళ్లలో అటు ఫ్లైవోవర్ ఇటు తూర్పు బైపాస్ రెండూ పూర్తవుతాయి. ఇప్పటికే పశ్చిమ బైపాస్ పూర్తయ్యింది. మరో నాలుగు నెలల్లో అందుబాటులోకి వస్తుంది. బెంజి సర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా బందరు రోడ్డు విస్తరణ పనులు కూడా త్వరలోనే ప్రారంభిస్తాం. ఇవన్నీ పూర్తయితే విజయవాడ ట్రాఫిక్ సమస్యలకు పూర్తి స్థాయి పరిష్కారం లభిస్తుంది.

యువతకు ఉపాధి కల్పన దిశగా అడుగులు

రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పించే దిశగా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా ఆయన అడుగులు వేస్తున్నారు. ఎంఎస్ఎంఈ(మైక్రో, మీడియం, స్మాల్ ఎంటర్‌ప్రైజెస్)పాలసీపై దృష్టి పెట్టాం. ఇంటికి ఒక ఎంటర్‌ప్రెన్యూర్‌ను, నియోజకవర్గానికి ఓ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేయాలన్నది చంద్రబాబు లక్ష్యం. అందులో భాగంగా విజయవాడ పార్లమెంటు పరిధిలో ఏడు ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈలపై యువతకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 29 నుంచి అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. విజయవాడ నగరంలో పేద, మధ్యతరగతి యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా పనిచేస్తాను. ప్రతియేటా నా పార్లమెంటు పరిధిలో 10వేల మంది యువతకు ఉపాధి కల్పించాలన్నది నా లక్ష్యం.

కిడ్నీ ప్రభావిత ప్రాంతాలకు కృష్ణాజలాలు

తిరువూరు నియోజకవర్గంలో కిడ్నీ బాధితుల సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తున్నాం. ప్రస్తుతం వాటర్ ట్యాంకర్ల ద్వారా వారికి తాగునీటిని అందిస్తున్నాం. జల్ జీవన్ మిషన్ ద్వారా కృష్ణా జలాలను కిడ్నీ ప్రభావిత ప్రాంతాలకు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. త్వరలోనే సురక్షితమైన తాగునీరు అందిస్తాం.

వేదాద్రి, చింతలపూడి ప్రాజెక్టుల పూర్తికి కృషి

విజయవాడ పార్లమెంటు పరిధిలోని తిరువూరు, మైలవరం, జగ్గయ్యపేట నియోజకవర్గాలతోపాటు నూజివీడు నియోజకవర్గ ప్రజల సాగునీటి సమస్యల పరిష్కారానికి వేదాద్రి, చింతలపూడి ప్రాజెక్టులను పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నాను. చింతలపూడి ప్రాజెక్టు పనులను 2025 మార్చి నాటికి ప్రారంభిస్తాం. దీనిపై సీఎం చంద్రబాబు కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. వేదాద్రి పనులు కూడా త్వరలో ప్రారంభమవుతాయి.

120 రోజుల పాలన ఎంతో సంతృప్తినిచ్చింది

రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 120 రోజులు దాటుతోంది. ఈ నాలుగు నెలల పాలన ఎన్నో సంతృప్తికరంగా ఉంది. విజయవాడ నగరాన్ని బుడమేరు వరదలు ముంచెత్తిన సమయంలో 12 రోజులపాటు సీఎం చంద్రబాబు బాధితులకు అండగా ఉండి సహాయ చర్యలను పర్యవేక్షించిన తీరు మాలాంటి వారికి స్ఫూర్తిదాయకం. వరద బాధితులకు ఏం కావాలో వారి కన్నా ఎక్కువగా ఆలోచన చేసి వాటన్నింటినీ సమకూర్చిన ఘనత చంద్రబాబుదే. ఇళ్లను ఫైరింజన్లతో శుభ్రం చేయించడం వంటివన్నీ 74 ఏళ్ల యువకుడు చేసిన వినూత్న ఆలోచన. అలాంటి నాయకత్వంలో పనిచేయడం మా అదృష్టం. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. అందులో భాగంగా పింఛను రూ.4వేలుకు పెంచి బకాయిలతో సహా రూ.7వేలు తొలి నెలలో అందజేశాం. ఒకటో తేదీన రూ.7 వేలు అందుకున్న పింఛన్‌దారుల మొహాల్లో ఆనందం ఎంతో సంతృప్తినిచ్చింది. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేశాం.. ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు పడేలా చూస్తున్నాం. అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించాం. వాటిని గత టీడీపీ ప్రభుత్వంలో ప్రారంభించినా వాటి విలువను పేదలకు తెలిసేలా చేసిన ఘనత మాత్రం వైసీపీ వారిదే. వారు అధికారంలోకి రాగానే వాటిని మూసివేయబట్టే మేం పునఃప్రారంభించగానే పేదలు, మధ్యతరగతి నుంచి అన్న క్యాంటీన్లకు అనూహ్య స్పందన లభించింది. దీపావళి నుంచి మూడు సిలిండర్లు అందించనున్నాం. భవన నిర్మాణ రంగానికి ఊతమిచ్చేలా రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా ఇసుక అందజేస్తున్నాం. ఇవన్నీ 120 రోజుల్లో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు. ఇదే స్ఫూర్తితో మున్ముందు మరిన్ని ప్రజోపయోగ కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్తాం.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
బుధవారం • 23 అక్టోబరు 2024
cinema@andhrajyothy.com

రావణుడిగా నటిస్తున్నా



కేజీఎఫ్ స్టార్ యశ్ హిందీ 'రామాయణ్'లో రావణుడి పాత్రను పోషిస్తున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఇందులో రాముడి పాత్రను రణబీర్ కపూర్, సీత పాత్రను సాయిపల్లవి చేస్తున్నారని తెలిపారు. నితిశ్ తివారీ భారీ స్థాయిలో రూపొందిస్తున్న 'రామాయణ్' నిర్మాణంలో తను కూడా ఉన్నాననీ, అంతర్జాతీయ స్థాయిలో ఈ సినిమాను తీయాలనుకుంటున్నట్లు యశ్ వెల్లడించారు. 'ద హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా' మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'రామాయణ్' చిత్రానికి సంబంధించిన అనేక విషయాలు వెల్లడించారు. 'లాస్ ఏంజెల్స్‌లో టాక్సిక్ చిత్రం వీఫెక్స్ వర్క్ కోసం ఉన్నప్పుడు డీఎన్ఈజీ విఫెక్స్ కంపెనీ అధినేత నమిత్ మల్హోత్రా నన్ను కలిసి 'రామాయణ్' చిత్రం గురించి చెప్పారు. కొన్ని సంవత్సరాలుగా ఆ ప్రాజెక్ట్ మీద వర్క్ చేస్తున్నట్లు తెలిపారు. అప్పుడే రావణుడి పాత్ర చేయమని నన్ను అడిగారు. ఆ పాత్రను పాత్రగానే తీస్తే నేను తప్పకుండా నటిస్తానని చెప్పా. ఆ తర్వాత నితీశ్ తివారీని కలిశా. ఆయనతో మాట్లాడిన తర్వాత నేను కూడా నిర్మాణంలో భాగస్వామినయ్యా. రణబీర్‌ను రాముడిగా అనుకున్నారు. సీతగా సాయిపల్లవిని తీసుకోవాలని అనుకున్నట్లు చెప్పగానే మంచి సెలెక్షన్ అని చెప్పా' అన్నారు.

యూనివర్సల్ అప్పీల్ ఉన్న కథ



కన్నడ నటుడు, 'ఉగ్రమ్' ఫేమ్ శ్రీమురళీ నటించిన చిత్రం 'బఘీరా'. డాక్టర్ సూరి దర్శకత్వంలో విజయ్ కిరగందూర్ నిర్మించారు. ప్రశాంత్ నీల్ అందించిన కథతో తెరకెక్కిందీ చిత్రం. ఈ నెల 31న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా శ్రీమురళి మీడియాతో ముచ్చటించారు. "ఇందులో నాది లార్జర్ దేన్ లైఫ్ క్యారెక్టర్. ఈ సినిమాలో లుక్ కోసం మూడేళ్లు కష్టపడ్డాను. ప్రశాంత్ నీల్ ఇచ్చిన కథకు దర్శకుడు సూరి 100 శాతం న్యాయం చేశారు. ఆయన దర్శకత్వ ప్రతిభ సినిమాను మరో లెవెల్‌కు తీసుకెళ్ళింది. ఇది యూనివర్సల్ అప్పీల్ ఉన్న కథ. ఈ సినిమా యాక్షన్ ప్రియులకు ఫుల్ మీల్స్‌లా ఉండనుంది. ఇందులో ప్రకాశ్‌రాజ్ ఓ కీలక పాత్ర పోషించారు. ఆయనతో పనిచేయడం మర్చిపోలేని అనుభూతి. హీరోయిన్ రుక్మిణీ వసంత్ తన నటనతో కట్టిపడేస్తారు. సంగీతం, విజువల్స్ ఈ సినిమాకు ప్రధానాకర్షణ. సినిమా అందర్నీ ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.



ఆర్ఆర్ఆర్... అంతకుమించి

మహేశ్‌బాబు హీరోగా ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో ఓ యాక్షన్ అడ్వెంచర్ మూవీ తెరకెక్కనున్న విషయం తెలిసిందే. దీని వర్కింగ్ టైటిల్ ఎస్ఎస్ఎంబీ29. శ్రీ దుర్గా ఆర్ట్స్ బేనర్‌పై డాక్టర్ కె.ఎల్. నారాయణ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులపైనే మేకర్స్ దృష్టి సారిస్తున్నారు. ఈ నేపథ్యంలో దర్శకుడు రాజమౌళి ఓ ఆసక్తికర విషయాన్ని తెలియజేశారు. ఇటీవల అంతర్జాతీయ జర్నలిస్టులతో ఆయన మాట్లాడారు. 'ఆర్ఆర్ఆర్' సినిమాలోని ఇంటర్వెల్ సీక్వెన్స్‌లో ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లతోపాటు జంతువులు పాల్గొన్న యాక్షన్ సన్నివేశం సినిమాకు హైలెట్‌గా నిలిచింది. అంతర్జాతీయంగా రాజమౌళికి ఇది మంచి పేరు తెచ్చిపెట్టింది. ఇప్పుడు మహేశ్‌బాబుతో తీయబోయే సినిమాలో కూడా జంతువుల సీక్వెన్సులు ఉంటాయని రాజమౌళి తెలిపారు. ఈ మూవీ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయం తీసుకోనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన విషయాలను అధ్యయనం చేసేందుకు పలు తరగతులకు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ మూవీని రెండు భాగాలుగా తీసుకొచ్చే ఆలోచనలో ఉన్నట్లు కూడా చెప్పారు. కాగా, ఈ మూవీ షూట్ జనవరి నుంచి ప్రారంభం కానుంది.

మసాలా చిత్రాల్లో నటించను

తమిళ చిత్రం 'తిరుచిత్రంబలం'కి గాను ఉత్తమ నటిగా నేషనల్ అవార్డు అందుకొని ఫుల్ జోష్‌లో ఉన్నారు నిత్యామీనన్. ప్రస్తుతం 'కాదలిక్క నేరమిల్లై', 'డియర్ ఎక్సెస్', ధనుశ్‌తో 'డీడీ4' (వర్కింగ్ టైటిల్) చిత్రాల్లో నటిస్తున్నారు. రీసెంట్‌గా మీడియాతో ముచ్చటించిన ఆమె కొన్ని ఆసక్తికర విషయాలు వెల్లడించారు. "ఉత్తమ నటిగా జాతీయ అవార్డును అందుకుంటానని కలలో కూడా ఊహించలేదు. నేను పోషించే ప్రతీ పాత్రకూ గుర్తింపు రావాలని కోరుకునే మనస్తత్వం కాదు నాది. నాకు సంతృప్తినిచ్చే పాత్రలనే ఎన్నుకోవడానికి ఇష్టపడతా. భారీ బడ్జెట్‌తో తీసే మసాలా చిత్రాల్లో ఎంత పెద్ద అవకాశం వచ్చినా నో చెప్పేస్తా. అలాంటి పాత్రలు పోషించడం నాకు ఇష్టం లేదు. పాత్ర మంచిదైతే అది చిన్న సినిమా అయినా వెంటనే అంగీకరిస్తాను. మంచి కథలు రాసి.. నాలోని నటికి సవాలు విసిరే పాత్రలను సృష్టించే దర్శకులతో పనిచేయాలని ఉంది. ఇన్నాళ్ల నా కెరీర్‌లో నేను ఇప్పటిదాకా చేసింది చాలా తక్కువ.. సాధించాల్సింది ఇంకా ఎంతో ఉంది. బాలీవుడ్‌లో ప్రతిభావంతులైన దర్శకులు ఎంతో మంది ఉన్నారు. నాకు దర్శకుడు విక్రమాదిత్య మోత్వానే చిత్రాలంటే చాలా ఇష్టం. ఆయన తెరకెక్కించిన 'లూటేరా' చిత్రం నా ఆల్‌టైమ్ ఫేవరెట్ ఫిల్మ్. ఆయన సినిమా తీసే విధానం అద్భుతంగా ఉంటుంది. ఆయనతో కలసి ఓ సినిమా చేయాలనుంది" అని చెప్పారు.



పోలీసులు నవ్వారు




'కార్తికేయ-2', 'టైగర్ నాగేశ్వరరావు' చిత్రాల్లో నటించి, మెప్పించిన బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్. ఇటీవల ఆయన ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడారు. ఓ సారి తన కారు చోరీకి గురికాగా ఫిర్యాదు చేస్తుంటే పోలీసులు నవ్వారని నాటి చేదు జ్ఞాపకాన్ని గుర్తు చేసుకున్నారు. 'నాకు డ్రైవ్ చేయడం నచ్చదు. కానీ, ఓ రోజు ముంబయిలో అమ్మవారి దేవాలయానికి నేనే కారు డ్రైవ్ చేస్తూ వెళ్లా. కారును పార్క్ చేసి ఆలయ ప్రాంగణంలోకి చేరుకున్నా. అక్కడి నుంచి చూస్తుంటే.. నా కారును ఓ వ్యక్తి తీసుకెళ్లడం కనిపించింది. వెంటనే కిందికి వచ్చి ఆటో ఎక్కి.. ఆ కారును ఫాలో అవ్వమని డ్రైవర్‌కు చెప్పా. మేం అతడిని పట్టుకోలేకపోయాం. ఫిర్యాదు చేద్దామని సమీప పోలీసుస్టేషన్‌కు వెళ్లా. నా వాహనం ఎలా పోయిందో పోలీసులకు వివరిస్తుంటే.. వారు పొట్ట చెక్కలయ్యేలా నవ్వారు' అని అనుపమ్ ఖేర్ నాటి సంఘటనను వివరించారు.

'రంగస్థలం' తర్వాత.. అంత బాగా తీసిన చిత్రమిదే



యువచంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల జంటగా నటించిన చిత్రం 'పొట్టేల్'. సాహిత్ మోత్ఖూరి దర్శకత్వంలో సురేశ్‌కుమార్ సడిగె నిర్మించారు. ఈ నెల 25న సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ "ఈ సినిమా చూశాను. దర్శకుడు సాహిత్ అద్భుతంగా తెరకెక్కించారు. 'రంగస్థలం' తర్వాత.. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో అంత బాగా తీసిన చిత్రమిదే" అని చెప్పారు. "ఈ సినిమా మీకు మునుపెన్నడూ చూడని అనుభూతిని ఇస్తుంది. ఈ సినిమా విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నాను" అని దర్శకుడు సాహిత్ మోత్ఖూరి అన్నారు. "ఈ సినిమాలో భాగమైనందుకు గర్వపడుతున్నా" అని హీరోయిన్ అనన్య నాగళ్ల తెలిపారు.

ఎనభై రెండేళ్ల వయసులోనూ.. అదే ఉత్సాహం!



హాలీవుడ్ నటుడు హారిసన్ ఫోర్డ్ పేరు వినగానే ఆయన నటించిన 'స్టార్ వార్స్', 'ఇండియానా జోన్స్' వంటి చిత్రాలు వెంటనే గుర్తుకు వస్తాయి. ఈ ఎనభై రెండేళ్ల నట శిఖరంకు ఇప్పటికీ నటన అంటే ఎంతో ఇష్టం. చిత్ర పరిశ్రమలోకి నూతన దర్శకులు వస్తున్నారు, కొత్త ఆలోచనలతో సినిమాలు తీస్తున్నారు. అటువంటి వాళ్లతో పని చేయడం నాకు ఎప్పుడూ ఆనందమే. ఓ హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో హారిసన్ మాట్లాడుతూ 'నాకు హాస్యం అంటే ఇష్టం. జోక్స్ వెయ్యడం, ఎంజాయ్ చేయడం చేస్తుంటాను. కామెడీతో కూడిన ఎమోషనల్ డ్రామా కథలను ఎక్కువగా ఇష్టపడతాను. వాటినే ఎన్నుకుంటాను' అని చెప్పారు. ఈ నెల 16న ప్రారంభమైన కామెడీ సిరీస్ 'ష్రింకింగ్' సీజన్ 2లో హారిసన్ ఫోర్డ్ నటిస్తున్నారు.

అరుదైన ఘనత

శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ నటిస్తున్న పొలిటికల్ థ్రిల్లర్ గేమ్‌చేంజర్ వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 10న విడుదలవుతోంది. మరోవైపు, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రామ్‌చరణ్ నటిస్తున్న 'ఆర్‌సీ 16' గురించి ఓ కీలక అప్‌డేట్ వినిపిస్తోంది. ఈ సినిమా షూటింగ్ వచ్చే నెలాఖరు నుంచి మైసూరులో ప్రారంభం అవుతుంది. మైసూరులో 15 రోజుల పాటు షూట్ జరుపుతారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో ఓ భారీ సెట్ వేసి షూటింగ్‌ను కొనసాగిస్తారు.



క్వీన్ ఎలిజబెత్ తర్వాత...

సింగపూర్‌లోని మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో రామ్‌చరణ్ మైనపు విగ్రహం ఆవిష్కరించనున్న సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది వేసవి నుంచి ఈ విగ్రహం సందర్శకులకు అందుబాటులోకి రానుంది. ఈ విగ్రహంలో రామ్‌చరణ్‌తో పాటు తన పెంపుడు కుక్క రైమీ కూడా కనువిందు చేయనుంది. క్వీన్ ఎలిజబెత్ తర్వాత పెంపుడు కుక్కతో మైనపు విగ్రహంలో కనిపించే రెండో వ్యక్తి రామ్‌చరణే అట. ఈ అరుదైన గౌరవం తమ అభిమాన హీరోకి దక్కడంతో, రామ్‌చరణ్ అభిమానులు ఆనందంలో తేలిపోతున్నారు.

రూ. పది కోట్ల కొత్త కారు...



రామ్‌చరణ్ గ్యారేజ్‌లో కొత్త కారు చేరింది. దాదాపు రూ. పది కోట్ల విలువైన రోల్స్ రాయిస్ స్పెక్ట్రి ఇంపోర్టెడ్ కారును ఆయన ఇటీవలే కొనుగోలు చేశారు. ఖైరతాబాద్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో మంగళవారం తన కారును రిజిస్ట్రేషన్ చేయించారు. రోల్స్ రాయిస్ నుంచి వెలువడిన మొదటి ఎలక్ట్రిక్ కారు ఇదే.

అన్యోన్యతను చూసి ఓర్వలేక..

చిన్న చిత్రాలు

శ్రీనివాస్ ఉలిశెట్టి, శాంతిప్రియ హీరో హీరోయిన్లుగా ఉదయ్ కుమార్ దర్శకత్వంలో లడ్డే బ్రదర్స్ నిర్మించిన చిత్రం 'ఎంత పని చేశావ్ చంటి'. ఈ నెల 25న విడుదల అవుతోంది. ఈ సందర్భంగా నరసాపురం వైఎన్ఎం కళాశాలలో ఆడియో ఫంక్షన్ నిర్వహించారు. 'భార్యా భర్తల అన్యోన్యతను చూసి ఓర్వలేక ఒక అమ్మాయి వాళ్ల జీవితంలోకి వస్తుంది. దాంతో కథంతా మారుతుంది. ఆ అమ్మాయి కూడా తన జీవితంలో ఓ మగాడి చేతిలో మోసపోతుంది. ఈ మగాడూ అలాంటి వాడే అనుకొని ఆ అమ్మాయి వాళ్ల జీవితంలోకి వచ్చి ఇబ్బంది పెడుతుంది. ఈ కథ ప్రేక్షకులకు బాగా నచ్చుతుంది' అని మేకర్స్ తెలిపారు.



ప్రజా సమస్యలపై పోరాటం



రాకేశ్ వర్రే టైటిల్ రోల్ పోషించిన చిత్రం 'జితేందర్ రెడ్డి'. ముదుగంటి క్రియేషన్స్‌పై ముదుగంటి రవీందర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. 'ఉయ్యాలా జంపాల', 'మజ్ను' సినిమాలు తీసిన విరించి వర్మ దర్శకత్వం వహించిన ఈ చిత్రం నవంబరు 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. 1980 కాలంలో జగిత్యాల చుట్టు పక్కల జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. కాలేజీ రోజుల నుంచే ప్రజా సమస్యల కోసం పోరాడుతూ నక్సలైట్లతో జితేందర్ రెడ్డి చేసిన పోరాటాన్ని ఈ సినిమాలో చూపించినట్లు చిత్రబృందం తెలిపింది. వైశాలి రాజ్, రియా సుమన్, ఛత్రపతి శేఖర్, సుబ్బరాజు, రవి ప్రకాశ్ ముఖ్య పాత్రలు పోషించారు.

ఒకేసారి రెండు సినిమాలు



'కాఫీ విత్ ఏ కిల్లర్', 'సోలో బాయ్' సినిమాల అప్డేట్స్ ఇచ్చారు ప్రముఖ నిర్మాత సెవెన్ హిల్స్ సతీష్. 'గతంలో నేను తీసిన 'బట్టల రామస్వామి' బయోపిక్, 'అందరి బంధువయా' మంచి పేరును తీసుకొచ్చాయి. కొవిడ్ టైమ్‌లో కూడా బట్టల రామస్వామిని ప్రజలు ఆదరించారు. అలాగే 'కాఫీ విత్ ఏ కిల్లర్', 'సోలో బాయ్' సినిమాలు రిలీజ్‌కి రెడీగా ఉన్నాయి అని మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. 'కంటెంట్ ఉంటే సినిమాని తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. నా గత సినిమాల మాదిరిగానే ఈ రెండు సినిమాలనూ డిఫరెంట్ జానర్‌లో చేశాము. 'సోలో బాయ్' సినిమా ద్వారా నవీన్ కుమార్ అనే కొత్త దర్శకుడిని పరిచయం చేస్తున్నాం.' అని సతీష్ తెలిపారు.

అదానీ చేతికి ఓరియెంట్ సిమెంట్

డీల్ విలువ రూ.8,100 కోట్లు.. ఒక్కో షేరుకు రూ.395.40 చొప్పున చెల్లింపు



న్యూఢిల్లీ: సిమెంట్ రంగంలో టేకోవర్ల పర్వం కొనసాగుతోంది. తాజాగా అదానీ గ్రూప్ కంపెనీ అంబుజా సిమెంట్.. సీకే బిర్లా గ్రూప్ కంపెనీ 'ఓరియంట్ సిమెంట్'ను కొనుగోలు చేసింది. ఇందుకోసం ముందుగా ప్రమోటర్లు సీకే బిర్లా, ఆయన కుటుంబ సభ్యుల చేతిలోని 46.8 శాతం ఈక్విటీ వాటాను ఒక్కో షేరుకు రూ.395.40 చొప్పున మొత్తం రూ.3,791 కోట్లకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. మరో 26 శాతం వాటా కోసం త్వరలో ఓపెన్ ఆఫర్ ప్రకటించనుంది. ఈ కొనుగోలు కోసం అంబుజా సిమెంట్ మొత్తంగా రూ.8,100 కోట్ల వరకు ఖర్చు చేయనుంది. ఇందుకు అవసరమైన నిధులను అదానీ గ్రూప్ పూర్తిగా అంతర్గత వనరుల ద్వారా సమీకరించనుంది.

85 లక్షల టన్నుల సామర్థ్యం: ఓరియెంట్ సిమెంట్ కంపెనీకి ప్రస్తుతం 85 లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో మూడు సిమెంట్ ప్లాంట్లు ఉన్నాయి. ఇందులో ఒక ప్లాంటు తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా దేవాపూర్ వద్ద, మరో ప్లాంటు కర్ణాటక, గుల్బర్గా సమీపంలోని చిత్తాపూర్ వద్ద ఉన్నాయి. ఇంకో ప్లాంటు ఉత్తర భారత్‌లోని రాజస్థాన్‌లో ఉంది. ఇవికాకుండా ఓరియెంట్ సిమెంట్ మరో 81 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న సిమెంట్ ప్లాంట్లను ఏర్పాటు చేసే యోచనలో ఉంది. కాగా ఓరియెంట్ సిమెంట్ టేకోవర్‌తో అంబుజా సిమెంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 9.74 కోట్ల టన్నులకు చేరనుంది. ఈ కొనుగోళ్లతో 2028 నాటికి సిమెంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని 14 కోట్ల టన్నులకు పెంచుకోవాలన్న లక్ష్యానికి దోహదం చేస్తాయని గ్రూప్ భావిస్తోంది.

ఈ ఏడాది రెండో కొనుగోలు: సిమెంట్ రంగంలో మార్కెట్ లీడర్, ఆదిత్య బిర్లా గ్రూప్ సిమెంట్ కంపెనీ అల్ట్రాటెక్‌తో పోటీపడాలన్నది అదానీ గ్రూప్ లక్ష్యం. ఇందులో భాగంగా గత ఏడాది డిసెంబరులో సంఘీ ఇండస్ట్రీస్‌ను రూ.5,185 కోట్లకు, ఈ ఏడాది జూన్‌లో హైదరాబాద్ కేంద్రంగా పని చేసే పెన్నా సిమెంట్‌ను రూ.10,422 కోట్లకు అదానీ గ్రూప్ కొనుగోలు చేసింది. ఇదే సమయంలో అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ దక్షిణ భారత మార్కెట్‌పై మంచి పట్టున్న ఇండియా సిమెంట్ కంపెనీని ఈ ఏడాది జూలైలో రూ.3,945 కోట్లకు కొనుగోలు చేసింది.

షేర్.. బేజార్!

స్టాక్ మార్కెట్ భారీ పతనం

- సెన్సెక్స్ 930 పాయింట్లు డౌన్
- 2 వారాల కనిష్ఠ స్థాయికి సూచీ
- 24,500 దిగువకు జారిన నిఫ్టీ
- రూ.9.19 లక్షల కోట్ల సంపద ఫట్

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు మంగళవారం భారీ పతనాన్ని చవిచూశాయి. సెన్సెక్స్ ఒక దశలో 1,000 పాయింట్లకు పైగా క్షీణించినప్పటికీ, చివరికి 930.55 పాయింట్ల (1.15 శాతం) నష్టంతో 80,220.72 వద్ద స్థిరపడింది. ఆగస్టు 14 తర్వాత సూచీకిదే కనిష్ఠ ముగింపు స్థాయి. నిఫ్టీ 309 పాయింట్లు (1.25 శాతం) కోల్పోయి 24,472.10 వద్ద ముగిసింది. నిరాశాజనక త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాల నేపథ్యంలో ఈక్విటీ మదుపరులు అన్ని రంగాల, విభాగాల షేర్లలో భారీగా అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. ఇందుకు తోడు, అమెరికాలో బాండ్ల రేట్లు పెరుగుతుండటం, చైనా వడ్డీ రేట్లు తగ్గించిన నేపథ్యంలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు మన ఈక్విటీల నుంచి మరిన్ని పెట్టుబడులను ఉపసంహరించడం మార్కెట్‌ను మరింత కుంగదీసింది.

అమ్మకాల హోరులో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.9.19 లక్షల కోట్లు తగ్గి రూ.444.45 లక్షల కోట్లకు (5.29 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో ఐసీఐసీఐ బ్యాంక్ మినహా అన్నీ నష్టపోయాయి.

హ్యూండయ్..ప్చ్

- తొలిరోజే 7.12 శాతం క్షీణించిన షేరు ధర



వాహన తయారీ సంస్థ హ్యూండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎంఐఎల్) లిస్టింగ్ ఇన్వెస్టర్లను నిరాశపరిచింది. మంగళవారం కంపెనీ తన షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.1960తో పోలిస్తే, బీఎస్ఈలో సంస్థ షేరు 1.47 శాతం తగ్గుదలతో రూ.1,931 వద్ద లిస్టయింది. ప్రారంభ ట్రేడింగ్‌లో కొద్దిగా తేరుకుని మళ్లీ 1,968.80 వద్దకు చేరిప్పటికీ, మళ్లీ భారీగా పతనమైంది. ఒక దశలో 7.80 శాతం క్షీణించి రూ.1,807.058 వద్దకు జారిన షేరు ధర.. తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి 7.12 శాతం నష్టంతో రూ.1,820.40 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలోనూ హ్యూండయ్ షేరు 7.16 శాతం నష్టంతో రూ.1,819.60 వద్ద క్లోజైంది. బీఎస్ఈలో 15.87 లక్షల షేర్లు ట్రేడవగా.. ఎన్ఎస్ఈలో 286.20 లక్షల షేర్లు చేతులు మారాయి. కంపెనీ ఐపీఓ భారత మార్కెట్ పట్ల తమ కమిట్‌మెంట్‌కు నిదర్శనమని షేర్ల లిస్టింగ్ కార్యక్రమంలో హ్యూండయ్ మోటార్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ యుయిసున్ చంగ్ అన్నారు.

ఐదో అత్యంత విలువైన వాహన సంస్థ: తొలిరోజు ట్రేడింగ్ నిలిచేసరికి, హ్యూండయ్ మోటార్ మార్కెట్ విలువ (క్యాపిటలైజేషన్) దాదాపు రూ.1.48 లక్షల కోట్లకు చేరుకుంది. దాంతో దేశంలోనే ఐదో అత్యంత విలువైన వాహన కంపెనీగా హ్యూండయ్ అవతరించింది.

అమ్మకానికి జీవీకే పవర్ ఆస్తులు

- ఆసక్తి వ్యక్తీకరణ బిడ్స్ కోరిన సీఓసీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (జీవీకేపీఐఎల్)పై దివాలా ప్రక్రియ వేగం పుంజుకుంది. కంపెనీ నుంచి రావాల్సిన రూ.18,000 కోట్ల బకాయిలు రాబట్టుకునేందుకు ఐసీఐసీఐ బ్యాంక్ నేతృత్వంలోని ఐదు బ్యాంకుల రుణదాతల కమిటీ (సీఓసీ) చర్యలు చేపట్టింది. ఇందుకోసం కంపెనీ ఆస్తుల కొనుగోలుకు ఆసక్తి ఉన్న సంస్థల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ) బిడ్స్‌ను ఆహ్వానించాయి. సీఓసీ ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. తమ బకాయిల వసూలు కోసం ఈ బ్యాంకులు ఇప్పటికే ఎన్‌సీఎల్‌టీ హైదరాబాద్ బెంచ్‌ని ఆశ్రయించిన సంగతి తెలిసిందే. రుణాలు, హామీల రూపంలో జీవీకే పవర్.. బ్యాంకులకు ఈ మొత్తం చెల్లించాల్సి ఉంది. ఈ రుణాలు, హామీలను జీవీకే గ్రూప్ విదేశాల్లోని ఈ బ్యాంకుల శాఖల నుంచి తీసుకుంది. దీంతో ఈ బ్యాంకులకు తమపై ఎన్‌సీఎల్‌టీకి వెళ్లే అధికారం లేదని జీవీకే పవర్ చేసిన వాదనను ఎన్‌సీఎల్‌టీ ఇప్పటికే తిరస్కరించింది.

ఒలెక్ట్రా లాభంలో 156% వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏకంగా 156 శాతం వృద్ధి చెంది రూ.47.65 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.18.58 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం రెవెన్యూ కూడా 70 శాతం వృద్ధితో రూ.523.67 కోట్లకు చేరుకుంది.

కొత్త లోగోతో బీఎస్ఎన్ఎల్‌కు కళ

7 కొత్త సర్వీసులు ప్రారంభం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) పూర్వ వైభవం పునరుద్ధరించుకునేందుకు కొత్త హంగులతో ప్రజల ముందుకు వస్తోంది. అందులో ఒకటి కొత్త లోగో విడుదల చేయడం కాగా మంగళవారం 7 కొత్త సేవలను ప్రారంభించింది. కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఈ సేవలను ప్రారంభించారు. వాటిలో స్పామ్ బ్లాకర్, సిమ్ కియోస్క్‌లు, దేశంలోనే ప్రప్రథమంగా డైరెక్ట్ టు డివైస్ సర్వీసు ఉన్నాయి. అలాగే సీడాక్ భాగస్వామ్యంతో పూర్తిగా దేశీయంగా తయారైన పరికరాలను ఉపయోగించి మైనింగ్ కార్యక్రమాల్లో ఉన్న వారు క్షణాల్లో సమాచారం అందుకునేందుకు వీలుగా 5జీ కనెక్టివిటీని కూడా కల్పించింది. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా విడుదల చేసిన 4జీ సర్వీసులను త్వరలో పూర్తిస్థాయి 4జీ సర్వీసులుగా విస్తరిస్తారు. ప్రస్తుతం మార్కెట్ వాటా విషయంలో ప్రైవేట్ టెలికాం ఆపరేటర్ల కన్నా బీఎస్ఎన్ఎల్ చాలా వెనుకబడి ఉంది.

ఢిల్లీ, ముంబై నగరాల్లో "నెట్‌వర్క్ యాజ్ ఏ సర్వీస్" పేరిట కొత్త ఫైనాన్సింగ్ మోడల్‌ను కూడా ప్రారంభించనుంది. దేశంలోనే తొలి డైరెక్ట్ టు డివైస్ కనెక్టివిటీ సొల్యూషన్ ఉపగ్రహ, కేబుల్ మొబైల్ నెట్‌వర్క్‌లు రెండింటినీ అనుసంధానం చేస్తుంది. అలాగే ఫైబర్ టు ద హోమ్ (ఎఫ్‌టీటీహెచ్) కస్టమర్లకు వైఫై రోమింగ్ సర్వీసును ప్రవేశపెట్టింది. దీని వల్ల వారికి ఎలాంటి అదనపు చార్జి లేకుండానే బీఎస్ఎన్ఎల్ హాట్‌స్పాట్ ప్రాంతాల్లో హై స్పీడ్ ఇంటర్నెట్ యాక్సెస్ లభిస్తుంది. కాగా, సమీప భవిష్యత్తులో టెలికాం సర్వీసుల టారిఫ్‌లు పెంచే ఆలోచన ఏదీ లేదని బీఎస్ఎన్ఎస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ రాబర్ట్ రవి అన్నారు.

ఎంఎఫ్‌లకు కొత్త రూల్స్

ముంబై: మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) సంస్థల్లో పారదర్శకత పెంచేందుకూ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కొత ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిబంధనలు జారీ చేసింది. ఈ నిబంధనలు నవంబరు 1 నుంచి అమల్లోకి వస్తాయి. ఈ నిబంధనల ప్రకారం ఇక ఏ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఏఎంసీ) కీలక ఉద్యోగి, ట్రస్టీ లేదా వారి సమీప బంధువులైనా, ఆయా ఏఎంసీలు నిర్వహించే మ్యూచువల్ ఫండ్స్ పథకాల యూనిట్లలో ఒక త్రైమాసికంలో రూ.15 లక్షలకు మించి లావాదేవీలు జరిపితే, రెండు రోజుల్లోగా ఆ విషయాన్ని కంప్లయన్స్ అధికారికి తెలపాలి. అలాగే ఇలా కొనుగోలు చేసిన యూనిట్లను లాభాల కోసం నెల రోజుల్లోపు అమ్మకూడదు. ఒకవేళ అమ్మితే ఎందుకు అమ్మాల్సి వచ్చిందో కూడా కంప్లయన్స్ అధికారికి తెలపాలి. కాగా, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ (ఏఈఎస్ఎల్)కు సెబీ నోటీసులు జారీ చేసింది. కొంత మంది ఇన్వెస్టర్లను తప్పుగా పబ్లిక్ షేర్‌హోల్డర్లుగా వర్గీకరించడపై సెబీ ఈ నోటీసులిచ్చింది.

వెండి.. బంగారమాయనే

- రూ.లక్ష దాటిన కేజీ సిల్వర్ రేటు
- తులం బంగారం @ రూ.81,000



న్యూఢిల్లీ: బులియన్ ధరలు మరింత ఎగబాకి సరికొత్త రికార్డు గరిష్ఠ స్థాయికి చేరాయి. ఢిల్లీ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర మంగళవారం మరో రూ.350 పెరిగి రూ.81,000కు చేరుకుంది. కిలో వెండి ఏకంగా రూ.1,500 పెరుగదలతో రూ.1.01 లక్షలు పలికింది. వెండి రేటు పెరగడం వరుసగా ఇది ఐదో రోజు. అంతేకాదు, ఢిల్లీ మార్కెట్లో వెండి రూ.లక్ష మైలురాయిని చేరడం ఇదే తొలిసారి. అంతర్జాతీయ మార్కెట్లోనూ వీటి ధరలు సరికొత్త జీవితకాల గరిష్ఠానికి పెరగడంతో పాటు పండగ సీజన్ నేపథ్యంలో ఆభరణ వర్తకులు, స్టాకిస్టులు బులియన్ కొనుగోళ్లు పెంచడం ఇందుకు కారణమని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒక దశలో 0.53 శాతం పెరుగుదలతో 2,753.30 డాలర్లు, సిల్వర్ 1.74 శాతం వృద్ధితో 34.675 డాలర్ల వద్ద ట్రేడయ్యాయి.

దేశమంతటా ఒకే రేటు: దేశవ్యాప్తంగా ఒకే బంగారం రేటును అమలు చేసేందుకు కృషిచేస్తున్నట్లు ఆల్ ఇండియా జెమ్ అండ్ జువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జీజేసీ) వెల్లడించింది. ప్రస్తుతం రేటు నగరాన్ని బట్టి మారుతుంటుంది. మనం బంగారాన్ని ఒకే రేటుకు దిగుమతి చేసుకుంటున్నప్పటికీ, విక్రయ ధర మాత్రం. నగరాన్ని బట్టి మారుతోంది. ఇకపై దేశమంతా ఒకే రేటును అమలు చేసేందుకు బులియన్ మార్కెట్ సభ్యులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు జీజేసీ కార్యదర్శి మితేశ్ ధోర్డ తెలిపారు.

రికార్డు ధరలతో పండగ గిరాకీకి గండి

బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయిలో పెరగడం పండగ సీజన్‌లో ఆభరణ విక్రయాలపై ప్రతికూల ప్రభావం చూపనున్నాయని జువెలర్లు వాపోతున్నారు. ఈ ధనత్రయోదశి, దీపావళికి ఆభరణాలకు గిరాకీ గణనీయంగా తగ్గవచ్చని వారంటున్నారు. ధరలు పెరిగిన కారణంగా ఈసారి సేల్స్ విలువ పరంగా 12-15 శాతం పెరిగే అవకాశమున్నప్పటికీ, విక్రయాల పరిమాణం 10-12 శాతం వరకు తగ్గవచ్చని సెన్‌కో గోల్డ్ ఎండీ, సువంకర్ సేన్ అంచనా వేశారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	79,700 ▲	73,050 ▲	1,10,000 ▲
ముంబై	78,251 ▲	71,678 ▲	98,372 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

23వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	540
వరంగల్	512	గోదావరి	530
చిత్తూరు	568	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	125	విజయవాడ	135
వరంగల్	125	గుంటూరు	133
కరీంనగర్	125	ఒంగోలు	133
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	122
కర్నూలు	125	నెల్లూరు	122
విశాఖపట్నం	120	అనంతపురం	122
గోదావరి	135		

స్పోర్ట్స్

హాకీ కుర్రాళ్ల హ్యాట్రిక్

భారత్‌కు వరుసగా మూడో గెలుపు

సుల్తాన్ జొహర్ కప్

జొహర్ బహ్రు (మలేసియా): సుల్తాన్ జొహర్ కప్ జూనియర్ టోర్నమెంట్‌లో భారత హాకీ కుర్రాళ్ల జోరు కొనసాగుతోంది. మూడుసార్లు చాంపియన్ భారత్ టోర్నీలో ఓటమన్నదే లేకుండా వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసింది. మంగళవారం ఇక్కడ జరిగిన పోరులో భారత్ 4-2 గోల్స్ తేడాతో ఆతిథ్య మలేసియాను చిత్తు చేసింది. టోర్నీలో ఇప్పటిదాకా మూడు మ్యాచ్‌లాడి మూడు విజయాలతో ఉన్న భారత్ ఓవరాల్‌గా 9 పాయింట్లతో టాప్‌లో కొనసాగుతోంది. న్యూజిలాండ్ 5 పాయింట్లతో రెండో స్థానంలో, ఆస్ట్రేలియా (4) మూడో స్థానంలో ఉన్నాయి. భారత్ తన తదుపరి మ్యాచ్‌ను బుధవారం ఆస్ట్రేలియాతో ఆడనుంది.

సాక్షి వ్యాఖ్యలు వ్యక్తిగతం

- వినేశ్ ఫొగట్



చండీగఢ్: ఆసియా క్రీడల సెలెక్షన్ నుంచి మినహాయింపు కోరి స్వార్థపూరితంగా వ్యవహరించినట్టు సాక్షి మాలిక్ చేసిన ఆరోపణలపై మాజీ రెజ్లర్ వినేశ్ ఫొగట్ స్పందించింది. 'అది ఆమె వ్యక్తిగత అభిప్రాయం. నేను చేసిందాంట్లో స్వార్థమెక్కడుంది? ఒకవేళ ఒలింపిక్స్‌లో పాల్గొని దేశానికి పతకం తేవాలనుకోవడం కూడా స్వార్థమే అయితే జీవితాంతం అలాగే బతికేస్తా. తోటి సోదరిల కోసం గళమెత్తడం కూడా స్వార్థమే అయితే అలాగే భరిస్తాను. ఏదేమైనా సాక్షిని ఇప్పటికీ స్నేహితురాలిగానే భావిస్తున్నా' అని తాజాగా ఎమ్మెల్యే కూడా అయిన వినేశ్ పేర్కొంది. భారత రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌కు వ్యతిరేకంగా గతేడాది సాక్షి, బజరంగ్, వినేశ్ తదితర రెజ్లర్లు నిరసన చేపట్టిన విషయం తెలిసిందే. అయితే సాక్షి తన బయోగ్రఫీ 'విట్‌నెస్'లో వినేశ్‌పై ఆరోపణలు గుప్పించింది.

పృథ్వీ షాపై వేటు

- ముంబై రంజీ టీమ్ నుంచి అవుట్



ముంబై: టాపార్డర్ బ్యాటర్ పృథ్వీ షాకు షాక్ తగిలింది. త్రిపురతో శనివారం నుంచి జరిగే రంజీ మ్యాచ్ కోసం ఎంపిక చేసిన ముంబై జట్టులో షాకు చోటు దక్కలేదు. క్రమశిక్షణారాహిత్యంతోపాటు అధిక బరువు కారణంగానే అతడిని సెలెక్టర్లు తప్పించినట్టు తెలుస్తోంది. గత రెండు మ్యాచ్‌ల్లో కూడా షా పేలవ ప్రదర్శన చేశాడు. నెట్ ప్రాక్టీస్ విషయంలో అతడు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాడని ఎంసీఏ అధికారి తెలిపాడు. షా ఫీల్డింగ్ చూస్తే అతడి ఫిట్‌నెస్ ఏపాటిదో అర్థమవుతుందన్నాడు.



భారత పతక వేటకు విఘాతం

2026 కామన్వెల్త్ గేమ్స్‌లో 10 క్రీడాంశాలే

హాకీ, క్రికెట్, బ్యాడ్మింటన్, రెజ్లింగ్, టీటీ అవుట్

వ్యయం తగ్గించేందుకే ఈ నిర్ణయం

లండన్: కామన్వెల్త్ క్రీడల్లో భారత్ పతకాల వేటకు గట్టిదెబ్బ తగిలింది. 2026 గ్లాస్గో (స్కాట్లాండ్)లో జరిగే క్రీడల నుంచి హాకీ, బ్యాడ్మింటన్, రెజ్లింగ్, క్రికెట్‌లను తొలగించారు. మంగళవారం విడుదల చేసిన రోస్టర్‌లో క్రీడా విభాగాల సంఖ్యను 19 నుంచి 10కి కుదించారు. తొలగించిన క్రీడల్లో భారత్ పతకాలు సాధించేవే ఎక్కువగా ఉండడంతో మన అథ్లెట్లు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. నిర్వహణ భారాన్ని తగ్గించుకోవడం కోసం క్రీడాంశాల సంఖ్యను కుదించినట్టు కామన్వెల్త్ గేమ్స్ సమాఖ్య (సీడబ్ల్యూఎఫ్) మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. 2022 బర్మింగ్‌హామ్ క్రీడల్లో 19 క్రీడాంశాలకు చోటు కల్పించారు. కానీ, గ్లాస్గోలో ఆ సంఖ్యను దాదాపుగా సగానికి తగ్గించారు. టేబుల్ టెన్నిస్, స్క్వాష్, ట్రయాథ్లాన్, బీచ్ వాలీబాల్, రగ్బీలను కూడా రోస్టర్ నుంచి తొలగించారు. మొత్తంగా రాకెట్ స్పోర్ట్స్‌ను ఈ క్రీడల్లో కనిపించకుండా చేశారు. గత క్రీడల్లోనే షూటింగ్‌కు చోటు కల్పించకపోవడంతో.. ఈ క్రీడాంశాన్ని కొత్తగా చేర్చే విషయంలో ముందుగానే ఆశలు వదులుకొన్నారు. 'అథ్లెటిక్స్ (ట్రాక్ అండ్ ఫీల్డ్), స్విమ్మింగ్, బాస్కెట్‌బాల్, ట్రాక్ సైక్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, లాన్ బౌల్స్, ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్, నెట్‌బాల్, బాక్సింగ్, జూడోలను నిర్వహించనున్నామ'ని సీడబ్ల్యూఎఫ్ తెలిపింది. నాలుగు వేదికల్లో నిర్వహించే ఈ పోటీల్లో 74 దేశాలకు చెందిన 3వేల మంది అథ్లెట్లు పాల్గొంటారని చెప్పింది. ఆటగాళ్లకు వసతి సౌకర్యాలను హోటళ్లలోనే కల్పించనున్నట్టు పేర్కొంది. పారా క్రీడలను కూడా నిర్వహించనున్నట్టు పేర్కొంది. 23వ కామన్వెల్త్ క్రీడలు 2026 జూలై 23 నుంచి ఆగస్టు 2 వరకు జరగనున్నాయి. బర్మింగ్‌హామ్ క్రీడల్లో భారత్ 22 స్వర్ణాలు సహా 61 పతకాలు సాధించింది. వాస్తవంగా 2026 క్రీడలు ఆస్ట్రేలియాలోని విక్టోరియా సిటీలో జరగాల్సి ఉండగా.. వ్యయ భారం కారణంగా ఆ నగరం తప్పుకొంది. దీంతో క్రీడల నిర్వహణ కోసం గ్లాస్గో ముందుకొచ్చింది. ఎక్కువ సమయం లేకపోవడంతో కొత్తగా స్టేడియాలు నిర్మించకుండా.. ఉన్న వాటితోనే ఈవెంట్‌ను పూర్తి చేసేలా ప్రణాళికలు రచించారు.

షాక్‌కు గురిచేసింది..

కామన్వెల్త్ క్రీడలనుంచి హాకీ, రెజ్లింగ్, క్రికెట్, టీటీలను తొలగించడం షాక్‌కు గురి చేసిందని పలువురు అథ్లెట్లు చెప్పారు. 'తీవ్రంగా నిరాశపడ్డా. కానీ మన చేతుల్లో ఏమీ లేదు' అని హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ అన్నాడు. ఇది చాలా దురదృష్టకరమని టీటీ వెటరన్ శరత్‌కమల్ చెప్పాడు. దీంతో భారత పతకాలు సంఖ్య భారీగా తగ్గే అవకాశం ఉందని అభిప్రాయపడ్డాడు. కాగా, స్క్వాష్ ప్లేయర్ దీపిక పల్లికల్ కూడా రాకెట్ క్రీడలను తొలగించడంపై ఆవేదన వ్యక్తం చేసింది. 'ఒక్క అడుగు ముందుకేస్తే.. రెండడుగులు వెనక్కి లాగుతున్నట్టుంది. స్క్వాష్ క్రీడకు ఈ నిర్ణయం ఎంతో నష్టదాయకమ'ని పల్లికల్ చెప్పింది.

పునరాలోచన చేయాలి




బ్యాడ్మింటన్‌ను తొలగించడం తీవ్ర ఆందోళనకు, నిరాశకు గురి చేసింది. బలమైన శక్తులుగా ఎదుగుతున్న భారత్ లాంటి దేశాలే లక్ష్యంగా ఇలాంటి నిర్ణయం తీసుకున్నారేమోనని అనిపిస్తోంది. సరైన కారణాలు లేకుండా క్రీడాంశాలను తప్పించడం క్రీడల వృద్ధికి శరాఘాతం. దీనిపై భారత్ గొంతు విప్పాలి. - కోచ్ పుల్లెల గోపీచంద్

కామన్వెల్త్‌కు క్రేజ్ లేదు

కామన్వెల్త్ క్రీడల క్రేజ్ తగ్గుతోంది. ఇన్ని క్రీడల్ని తొలగించడం అందుకు బలాన్ని చేకూరుస్తోంది. అసలు ఈ క్రీడలు నిర్వహించాల్సిన అవసరం లేదు. భారత్ కూడా తమ బృందాన్ని పంపకూడదని భావిస్తున్నా. -మాజీ కోచ్ విమల్ కుమార్

తండ్రి చేసిన పనితో.. జెమీమా సభ్యత్వం రద్దు!



ముంబై: భారత మహిళల జట్టు బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ సభ్యత్వాన్ని ముంబై ప్రసిద్ధ క్లబ్ ఖర్ జింఖానా రద్దు చేసింది. క్లబ్ పరిసరాలను ఆమె తండ్రి ఇవాన్ మతపరమైన కార్యక్రమాలకు ఉపయోగించుకోవడమే అందుకు కారణంగా తెలుస్తోంది. క్లబ్‌కు సంబంధించిన హాల్‌ను బుక్ చేసుకొని అందులో మతపరమైన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు మతమార్పిడులకు పాల్పడుతున్నట్టు కొందరు మేనేజ్‌మెంట్ దృష్టికి తెచ్చారు. క్లబ్ బైలాస్‌కు విరుద్ధంగా వ్యవహరించడంతో జెమీమాకు ఇచ్చిన మూడేళ్ల గౌరవ సభ్యత్వాన్ని రద్దు చేసినట్టు ఖర్ జింఖానా అధ్యక్షుడు వివేక్ తెలిపాడు.

పట్టుబిగించిన దక్షిణాఫ్రికా

ఢాకా: కైల్ వెర్రైనా (114) శతకంతో.. బంగ్లాదేశ్‌తో తొలి టెస్ట్‌లో దక్షిణాఫ్రికా పట్టు బిగించింది. ఆటకు రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 140/6తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన సౌతాఫ్రికా 308 పరుగులకు ఆలౌటైంది. తైజుల్ ఇస్లాం 5 వికెట్లు తీశాడు. బంగ్లా తొలి ఇన్నింగ్స్ స్కోరు 106 పరుగులకు దక్షిణాఫ్రికా 202 రన్స్ ఆధిక్యం సాధించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన బంగ్లా 101/3తో కష్టాల్లో పడింది.

రెండో టెస్టుకూ కేన్ దూరం



పుణె: న్యూజిలాండ్ వెటరన్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ రెండో టెస్టుకు కూడా అందుబాటులో ఉండడం లేదు. గజ్జల్లో గాయం కారణంగా బెంగళూరు టెస్టుకు దూరమైనా.. రెండో టెస్టువరకల్లా ఫిట్‌గా ఉంటాడని భావించారు. కానీ అతనింకా న్యూజిలాండ్‌లోనే ఉన్నాడు. కేన్ స్థానంలో జట్టులోకి వచ్చిన విల్ యంగ్ 33, 48 పరుగులతో ఆకట్టుకున్నాడు. కేన్ వంద శాతం ఫిట్‌గా లేడని, చివరి టెస్టుకైనా కోలుకోవాలని ఆశిస్తున్నామని కోచ్ గ్యారీ స్టీడ్ తెలిపాడు.

ఒక్క ఫోన్ చేయండి.. వచ్చేస్తా!

- భారత్‌తో సిరీస్ కోసం వార్నర్

మెల్‌బోర్న్: ఈ ఏడాది జనవరిలో అన్ని ఫార్మాట్లకు వీడ్కోలు పలికిన ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్‌కు తిరిగి ఎంట్రీ ఇవ్వాలని భావిస్తున్నట్టున్నాడు. ఎందుకంటే.. భారత్‌తో జరిగే టెస్టు సిరీస్‌కు తన సేవలు అవసరమనుకుంటే.. కచ్చితంగా అందుబాటులో ఉంటానని ప్రకటించాడు. 'జట్టు కోసం నేనెప్పుడూ సిద్ధంగానే ఉంటా. ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు. ఆసీస్ ఆటగాళ్లు ఫిబ్రవరిలో టెస్టు తర్వాత షెఫీల్డ్ షీల్డ్‌లో ఓ మ్యాచ్ మాత్రమే ఆడారు. ఒకవేళ భారత్‌తో సిరీస్‌కు నేను కావాలనుకుంటే తదుపరి షీల్డ్ గేమ్ ఆడి సిద్ధంగా ఉంటాను' అని వార్నర్ తెలిపాడు.

పంత్, గిల్ ఆడతారు

- రాహుల్‌పై నమ్మకముంది
- అసిస్టెంట్ కోచ్ టెన్‌డష్కాటే



పుణె: న్యూజిలాండ్ చేతిలో తొలి టెస్టు పరాభవం తర్వాత భారత జట్టు తుది కూర్పుపై సర్వత్రా చర్చ జరుగుతోంది. మెడ కండరాలు పట్టేయడంతో శుభ్‌మన్ గిల్ ఆ మ్యాచ్‌కు దూరమైన విషయం తెలిసిందే. అలాగే వికెట్ కీపర్ రిషభ్ పంత్ మోకాలికి బంతి బలంగా తాకడంతో మైదానం వీడాల్సి వచ్చింది. తిరిగి బ్యాటింగ్ చేసినా కీపింగ్‌కు దూరంగా ఉన్నాడు. ఈనేపథ్యంలో గురువారం నుంచి పుణెలో జరిగే రెండో టెస్టులో వీరిద్దరూ ఆడతారా? లేదా? అనే సందేహం వ్యక్తమవుతోంది. అయితే జట్టు అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డష్కాటే ఈ ఊహాగానాలకు తెరదించాడు. కివీస్‌తో రెండో టెస్టులో గిల్, పంత్ ఆడతారని తేల్చాడు. 'పంత్ బాగానే ఉన్నాడు. మోకాలు కదిలించడంలో కాస్త అసౌకర్యానికి గురైనా ప్రస్తుతం కోలుకున్నాడు. రెండో టెస్టు ఆడతాడనే భావిస్తున్నాం. ఇక గిల్ బెంగళూరు నెట్స్‌లో కూడా పాల్గొని బ్యాటింగ్ చేశాడు. కాస్త అసౌకర్యంగా కనిపిస్తున్నా మ్యాచ్ ఆడేందుకు సిద్ధంగానే ఉన్నాడు' అని టెన్‌డష్కాటే తెలిపాడు. మరోవైపు పంత్ విషయంలో ఎలాంటి రిస్కూ తీసుకోకూడదన్న భావనలో టీమ్ మేనేజ్‌మెంట్ ఉంది. రెండేళ్ల క్రితం కారు ప్రమాదంలో అతడి మోకాలికి తీవ్ర గాయమైంది. ఇప్పుడు అక్కడే బంతి తాకడంతో ముందు జాగ్రత్తగా విశ్రాంతినిస్తే బావుంటుందన్న ఆలోచనలో ఉన్నారు. ఒకవేళ ఆడించినా బ్యాటింగ్ మాత్రమే చేయించి కీపింగ్ బాధ్యతలు జురెల్‌కు అప్పగించే అవకాశముంది. మంగళవారం నెట్స్‌లో జురెల్ కీపింగ్ ప్రాక్టీస్ చేయడం కనిపించింది. మరోవైపు పంత్ స్పిన్ బౌలింగ్‌లో బ్యాటింగ్ సాధన కొనసాగించాడు.

డబ్ల్యూటీసీలో కనీసం 3 టెస్టులు

ఐసీసీ క్రికెట్ కమిటీ సూచన

దుబాయ్: టెస్టు, వన్డే ఫార్మాట్లను మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు ఐసీసీ నడుం బిగించింది. ఇటీవల దుబాయ్‌లో జరిగిన బోర్డు సమావేశంలో ఐసీసీ క్రికెట్ కమిటీ పలు సూచనలను ప్రతిపాదించింది. ఇందులో భాగంగా వచ్చే అంచె నుంచి వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో కనీసం మూడు టెస్టుల సిరీస్‌ను ఆడించాల్సి ఉంటుంది. కొన్ని దేశాలు రెండు టెస్టుల సిరీస్‌కే పరిమితమవుతున్నాయని ఐసీసీ భావిస్తోంది. అలాగే ఆతిథ్యమిచ్చే జట్లు మరిన్ని డే/నైట్ టెస్టులు నిర్వహించేలా చూడాలని కోరింది. ఇక, వన్డేల్లో తొలి 25 ఓవర్లలో రెండు కొత్త బంతులను, ఆ తర్వాత ఒక్క బంతిని మాత్రమే వాడాలని క్రికెట్ కమిటీ సూచించింది. దీంతో పేసర్లకు రివర్స్‌స్వింగ్‌తో పాటు స్పిన్నర్లకు కూడా ప్రయోజకరంగా ఉంటుందని భావిస్తోంది. అలాగే ఐసీసీ చైర్మన్ పదవి కూడా ఇకనుంచి మూడేళ్లపాటు ఉండనుంది.



నిరాశపర్చిన టైటాన్స్

- బెంగళూరు హ్యాట్రిక్ ఓటమి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రొ కబడ్డీ తాజా సీజన్‌లో తెలుగు టైటాన్స్ వరుసగా రెండో ఓటమిని చవిచూసింది. మంగళవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 52-22తో టైటాన్స్‌పై ఘన విజయం సాధించింది. జైపూర్ కెప్టెన్ అర్జున్ దేశ్వాల్ 19 రైడ్ పాయింట్లతో చెలరేగాడు. టైటాన్స్ జట్టు కెప్టెన్ పవన్ (7 పాయింట్లు) మినహా మిగిలిన ప్లేయర్లంతా ఘోరంగా విఫలమయ్యారు. టైటాన్స్ పేలవ డిఫెన్స్ కారణంగా ఈ మ్యాచ్‌లో ఏకంగా నాలుగుసార్లు ఆలౌటైంది. మరో మ్యాచ్‌లో యూపీ యోధాస్ 57-36తో బెంగళూరు బుల్స్‌పై నెగ్గింది. బుల్స్‌కు ఇది హ్యాట్రిక్ పరాజయం.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం
23 అక్టోబరు 2024

వినూత్నం

ఆర్కిడ్స్‌తో అందలానికి

కేరళకు చెందిన సబీరా మొహమ్మద్, కాలక్షేపం కోసం మొదలుపెట్టిన పూల మొక్కల పెంపకం, కేరళ రాష్ట్ర ప్రభుత్వం నుంచి 'ఉద్యాన వన శ్రేష్ఠ' పురస్కారాన్ని అందుకునే స్థాయికి ఎదిగింది. విదేశాల నుంచి ఆర్కిడ్స్‌ను దిగుమతి చేసుకుంటూ, నెలకు నాలుగు లక్షలు ఆర్జిస్తున్న సబీరా ఆసక్తికరమైన కథనమిది.

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ఏడేళ్ల పాటు జీవించి, స్వస్థలమైన కేరళలోని పాలక్కాడ్‌కు తిరిగొచ్చినప్పుడు సబీనాకు రోజులు గడవడం కష్టంగా మారింది. భర్త పనికీ, పిల్లలు బడికీ వెళ్లిపోయాక, ఖాళీ సమయాన్ని ఎలా గడపాలో ఆమెకు అర్థమయ్యేది కాదు. దాంతో తనకెంతో ఇష్టమైన గార్డెనింగ్‌తో కాలక్షేపం చేయాలని నిర్ణయించుకుంది సబీరా. అందుకోసం తన టెర్రస్‌నే తగిన ప్రదేశంగా ఎంచుకుంది. అలా 1998లో మల్లె, జాజి పూల మొక్కల పెంపకంతో మొదలైన సబీరా పూల మొక్కల పెంపకం ప్రయాణం ఎన్నో మలుపులు తిరిగింది. అప్పటి రోజులను గుర్తు చేసుకుంటూ... "నేను దేశం నలుమూలల నుంచీ పూల మొక్కలను సేకరించేదాన్ని. కొరియర్ ద్వారా కొన్ని మొక్కలనూ, స్వయంగా నర్సరీలను సందర్శించడం ద్వారా ఇంకొన్ని మొక్కలనూ సేకరించేదాన్ని. మొక్కలు దొరకని సందర్భాల్లో విత్తనాలనూ, మొక్కల నమూనాలనూ సేకరించి పెంచుతూ ఉండేదాన్ని. క్రమేపీ నా టెర్రస్ మొత్తం రకరకాల పూల మొక్కలతో నిండిపోయింది. ఆ



తర్వాత నా ఆసక్తి ఆర్కిడ్ ప్లాంటేషన్ మీదకు మళ్లింది." అంటూ పూల మొక్కల పట్ల తన ఆసక్తిని పంచుకుంది సబీరా.

ఉద్యాన శ్రేష్ఠ అవార్డు అందుకుని...

సబీరా, ఆర్కిడ్ ప్లాంటేషన్ కోసం పాలక్కాడ్‌లోని కృష్ణ భవన్ నుంచి శాంప్లింగ్స్‌ను సేకరించింది. ఆర్కిడ్ కల్టివేషన్ గురించి లోతుగా అధ్యయనం చేసి, లెక్కలేనన్ని కొత్త వంగడాలనూ సేకరించింది. అలా ఆర్కిడ్ ప్లాంటేషన్‌లో ప్రత్యేకమైన గుర్తింపు పొందినందుకు గాను, 2006లో కేరళ రాష్ట్ర ప్రభుత్వం 'ఉద్యాన శ్రేష్ఠ' పురస్కారంతో సత్కరించడం విశేషం. ఆ అవార్డుతో సబీరా పూల తోట ఎంతోమంది దృష్టిని ఆకర్షించింది. రాష్ట్రవ్యాప్త పూల ప్రియులందరూ ఆమె టెర్రస్‌ను సందర్శించడం మొదలుపెట్టారు. ఆమె భర్త మొహమ్మద్ మూసా కూడా భార్యను ప్రోత్సహిస్తూ ఆర్కిడ్స్ పెంపకంలో సహాయపడడం మొదలుపెట్టాడు. అలా సబీరా థాయిల్యాండ్ నుంచి కూడా కొత్త రకం ఆర్కిడ్స్‌ను దిగుమతి చేసుకోవడం



మొదలుపెట్టింది. ప్రస్తుతం ఆమె దగ్గర 1300 రకాల ఆర్కిడ్స్ ఉన్నాయి.

టెర్రస్ నుంచి నర్సరీ వరకూ...

టెర్రస్ మొత్తం మొక్కలతో నిండిపోవడంతో, సబీరా తన మొట్టమొదటి నర్సరీ కోసం ఎకరం స్థలాన్ని కొనుగోలు చేసింది. "నేను మొదట థాయిల్యాండ్ నుంచి, తర్వాత చైనా, తైవాన్, ఆగ్నేయాసియా దేశాల నుంచి ఆర్కిడ్ మొక్కలను దిగుమతి చేసుకోవడం మొదలుపెట్టాను" అంటూ ఆర్కిడ్ మొక్కల పట్ల తనకున్న ఆసక్తి గురించి వివరించింది. సబీరా ఆ ఒక్క నర్సరీతో ఆగిపోకుండా, పాలక్కాడ్ జిల్లాలోనే రెండో నర్సరీ మొదలుపెట్టి, దానికి పర్ల్ ఆర్కిడ్స్ అనే పేరు పెట్టింది. "ఆర్కిడ్స్‌ను పెంచడం కాస్త కష్టమైన పనే! అయినా టిష్యూ కల్చర్ ద్వారా నేను వాటిని సమర్థంగా పెంచగలిగాను.

మంచి బ్రీడర్ నుంచి టిష్యూ కల్చర్ సహాయంతో పెరిగిన ఆర్కిడ్స్‌ను కూడా కొనుగోలు చేశాను. వాణిజ్యపరమైన సాగుకు ఇలాంటి మొక్కలే ఉపయోగకరంగా ఉంటాయి" అని వివరిస్తున్న సబీరా నాణ్యమైన మొక్కల కోసం పేరున్న బ్రీడర్స్‌నే ఎంచుకుంటూ ఉంటుంది. అలాగే కస్టమర్లకు విక్రయించే ముందు, మొక్కల ఎదుగుదలను పరిశీలించడానికి వీలుగా 50 వేల మొక్కలు ఉంచే ఒక క్వారంటీన్ ఫెసిలిటీ కేంద్రాన్ని కూడా నెలకొల్పింది.

ఏడాదికి నాలుగు లక్షలు...

ఔషధాల తయారీ కోసం, అలంకరణ ప్రయోజనాల కోసం ఆర్కిడ్స్ వాడకం ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగింది. కాబట్టి సబీరా తన పెర్ల్ ఆర్కిడ్స్ నర్సరీ సహాయంతో ఒక్కొక సీడ్లింగ్‌ను రకాన్ని బట్టి, 80 నుంచి 100 రూపాయలకు విక్రయిస్తోంది. ఎదిగిన మొక్కలను 250 నుంచి 350 రూపాయలకు విక్రయిస్తోంది. మొక్కలను సేకరించే అభిరుచి కలిగినవాళ్లు, గార్డెనర్లు, రైతులు, హోల్‌సేల్ నర్సరీలు సబీరా నుంచి ఆర్కిడ్స్‌ను కొనుగోలు చేస్తూ ఉంటారు. ఆ మొక్కల పెంపకం గురించి వివరిస్తూ... "పాటింగ్ మిక్స్‌ను తెప్పించుకుని, హైడ్రోక్లోరిక్ యాసిడ్‌తో దాన్ని శుభ్రపరిచి, వారం రోజుల పాటు నీళ్లతో కడిగి, తర్వాత ఎండలో ఆరబెట్టి వాడుకుంటామనీ, ఆ ప్రక్రియ మొత్తానికీ 8 నుంచి 9 రోజుల సమయం పడుతుంది" అంటూ వివరిస్తోంది సబీరా. శుభ్రం చేయని మిక్స్‌ను కిలోకు 100 రూపాయల చొప్పున, శుభ్రం చేసిన మిక్స్‌ను కిలోకు 150 రూపాయల చొప్పున విక్రయిస్తూ అదనపు ఆదాయాన్ని కూడా ఆర్జిస్తోందామె. ఇలా మొక్కల ద్వారా నెలకు దాదాపు నాలుగు లక్షల ఆదాయాన్ని ఆర్జిస్తున్నట్టు కూడా వివరించింది.

అభిరుచి





ఈ మామ్.. డిజిటల్ స్టార్

బడికి వెళ్లే తన పిల్లలకు బలవర్ధకమైన ఆహారం ఇవ్వాలనుకున్నారు. అదీ వారు ఇష్టంగా తినేలా..! దాని కోసం రోజుకొక వెరైటీ చేసి స్కూల్ లంచ్ బాక్స్‌లో సర్దేవారు. అవి సూపర్‌హిట్ అయ్యాయి. తమకూ ఆ రెసిపీ చెప్పమని విద్యార్థుల తల్లితండ్రులు వరుస కట్టారు. అలా అనుకోకుండా మొదలై... ఇప్పుడు 'మాస్టర్ చెఫ్ మామ్'గా లక్షల మందికి చేరువ అయ్యారు. తాజాగా ప్రముఖ మ్యాగజైన్ 'ఫోర్బ్స్ ఇండియా టాప్-100 డిజిటల్ స్టార్స్' జాబితాలో చోటు దక్కించుకున్న ఫుడ్ బ్లాగర్, చెఫ్, రచయిత... ఉమా రఘురామన్ జర్నీ ఇది.

"అనుకున్నామని జరగవు అన్నీ. అనుకోలేదని ఆగవు కొన్ని. ఇన్నేళ్ల ప్రయాణంలో ఇదే నాకు బోధపడిన జీవితం. నేనూ అందరిలాంటి అమ్మాయినే. చిన్నప్పటి నుంచీ వంటలపై ఆసక్తి. చదువుతో పాటు ఇంట్లో అమ్మతో కలిసి గరిట తిప్పడం నేర్చుకున్నా. మా స్వస్థలం చెన్నై. అక్కడి 'అన్నా యూనివర్సిటీ'లో బీకాం చదివాను. 'అన్నామలై విశ్వవిద్యాలయం' నుంచి ఎంకాం పట్టా పొందాను. ఆ తరువాత ఐదేళ్లకు పైగా కిండర్ గార్డెన్ టీచర్‌గా పని చేశాను. అదే సమయంలో నాకు రఘురామన్‌తో పెళ్లయింది. దాంతో మా నివాసం ఢిల్లీకి మారింది. మాకు ఇద్దరు పిల్లలు. వాళ్ల కోసం 2014లో ఉద్యోగం మానేశాను.

అత్తగారి స్ఫూర్తితో...

ఢిల్లీకి రావడంతో నాకు ఉత్తరాది రుచులు ఎన్నో పరిచయమయ్యాయి. ముఖ్యంగా మావారు రఘురామన్‌కు నార్త్‌ఇండియన్ డిషెస్‌పై అవగాహన ఎక్కువ. ఆయన ఏవేవో వంటల పేర్లు చెబుతుంటే... ఆసక్తిగా వినేదాన్ని వాటి ప్రత్యేకతల గురించి తెలుసుకొనే ప్రయత్నం చేసేదాన్ని. వారాంతాల్లో కుటుంబ సభ్యులు అందరూ ఒక చోట చేరినప్పుడు కలిసి వంట చేయడం ఒక ఆనవాయితీగా మారింది. అక్కడ ఎవరికి నచ్చిన వెరైటీలు వారు వండి వార్చేవారు. ఇక పెళ్లయ్యాక మా అత్తగారి దగ్గర ఎన్నో వెరైటీలు నేర్చుకున్నా. విభిన్న రుచుల్లో రసం, సాంబార్, స్వీట్స్, శ్నాక్స్‌తో పాటు పండుగల్లో ప్రత్యేక వంటలు ఆమె అద్భుతంగా వండుతారు. అంతేకాదు... మట్టి కుండలు, సంప్రదాయికమైన గిన్నెల్లో వంట చేయడం వారివల్లే నాకు అలవాటు అయింది. మా అత్తమ్మ స్ఫూర్తితో నేనూ కొత్త కొత్త వంటలు ప్రయత్నించేదాన్ని. చిన్నప్పుడు కూడా ఇడ్లీలు, శాండ్‌విచ్‌ల వంటివి తయారు చేసేదాన్ని. గులాబ్‌జామ్, మోదకం తయారీలో అమ్మమ్మకు సాయపడేదాన్ని. చపాతీలు, పూరీలకు కలిపిన పిండితో ఆడుకోవడమంటే నాకు మహా సరదా. మా అమ్మయితే ఉడకబెట్టిన బేబీ పొటాటోస్ తొక్కు తీసే పని ఎప్పుడూ నాకే అప్పజెప్పేది. అది నాకు ఇష్టమైన కూరగాయ.

అలా మొదలైంది...

ఉద్యోగం మానేశాక ఇంట్లో కాస్త ఖాళీ సమయం లభించేది. పిల్లలు బడి వయసుకు వచ్చారు. ఇడ్లీలు, దోశలు చేసి వారి లంచ్ బాక్స్‌లో పెట్టేదాన్ని. కొన్నాళ్లకు పిల్లలు... 'అమ్మా... ఎప్పుడూ ఇవేనా' అనేవారు. మేం స్కూలుకు వెళ్లే రోజుల్లో డబ్బాలో పెరుగు అన్నంతో పాటు పచ్చడి వేసి ఇచ్చేవారు. అలాగే రసం, సాంబారు లేదా బంగాళదుంప కూర అన్నం తీసుకువెళ్లేవాళ్లం. ఎంతో ఇష్టంగా తినేవాళ్లం. కానీ ఇప్పుడు పిల్లలకు ఎప్పటికప్పుడు వెరైటీలు కావాలి. కాలం మారింది. మనమూ మారాలని అర్థం చేసుకున్నాను. నాకు తెలిసి 'రేపటి టిఫిన్ బాక్స్ కోసం ఏం వండాలి' అని రాత్రి నిద్రపోయే ముందు ప్రతి తల్లీ ఆలోచిస్తుంది. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని పిల్లలు ఇష్టపడేలా... సులువుగా తినేలా... పోషకాలు నిండిన వెరైటీలు వండిపెట్టాను. అవి మా పిల్లలకే కాదు, తోటివారికి కూడా బాగా నచ్చాయి. నా ప్రయత్నం ఫలించినందుకు ఎంతో సంతోషించాను. అదే సమయంలో నాలాంటి తల్లుల కోసం నా రెసిపీలన్నీ సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశాను. 'మాస్టర్ చెఫ్ మామ్' పేరిట ఒక బ్లాగ్ తెరిచి... రెండు దశాబ్దాలుగా మా అమ్మ, అత్త, స్నేహితుల వద్ద నేర్చుకున్న వివిధ రకాల వంటలు అందరికీ పరిచయం చేశాను.



> పిల్లలు ఇష్టపడేలా... సులువుగా తినేలా... పోషకాలు నిండిన వెరైటీలు వండిపెట్టాను. అవి మా పిల్లలకే కాదు, తోటివారికి కూడా బాగా నచ్చాయి. నా ప్రయత్నం ఫలించినందుకు ఎంతో సంతోషించాను. అదే సమయంలో నాలాంటి తల్లుల కోసం నా రెసిపీలన్నీ సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశాను.

వెయ్యికి పైగా రుచులు...

'మాస్టర్ చెఫ్ మామ్' ద్వారా ఇప్పటికి వెయ్యికి పైగా వంటల వీడియోలు అప్‌లోడ్ చేశాను. కుకింగ్, డెకరేటింగ్, షూటింగ్, ఎడిటింగ్... అన్నీ నేనే చూసుకొంటాను. అదికూడా మొబైల్ ఫోన్‌తో. ఒక్కో వీడియో రూపొందించి, అప్‌లోడ్ చేయడానికి పన్నెండు నుంచి పద్నాలుగు గంటల సమయం పడుతుంది. ఇది నా దినచర్యలో భాగం అయిపోయింది. ప్రధానంగా భారతీయ సంప్రదాయ వంటలను నేటితరానికి అందించేందుకు కృషి చేస్తున్నాను. అలాగే నవతరం తల్లులు తమ పిల్లలకు రుచితోపాటు బలవర్ధకమైన ఆహారం ఇచ్చేలా ప్రోత్సహిస్తున్నాను. ఇన్‌స్టాగ్రామ్‌లో పది లక్షలమంది నన్ను ఫాలో అవుతున్నారు. వారిలో సెలబ్రిటీలు కూడా ఉన్నారు. మా యూట్యూబ్ చానల్‌ను మూడున్నర లక్షల మంది సబ్‌స్క్రైబ్ చేశారు. అందులో మూడు లక్షల వ్యూస్ దాటిన వీడియోలు చాలానే ఉన్నాయి. అవకాడో కా మీఠా, దిల్ చెట్నీ, వాల్నట్ చాట్, పైనాపిల్ కేసరీ, పారుప్పు పాయసం, కలాకండ్, తోటకూర పప్పు, సాంబార్ పొడి... ఇలా ఎన్నో రకాల వంటలు క్రమంత తప్పకుండా సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేస్తున్నాను. కొన్ని చిట్కాలు కూడా అందిస్తున్నాను. ఒక్కో పోస్ట్‌కు వేలల్లో లైక్‌లు వస్తున్నాయి. దానికంటే నా వంటలు ప్రయత్నించి, బాగున్నాయంటూ కొందరు కామెంట్ చేస్తుంటారు. అవి నాకు ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని కలిగిస్తాయి.

'ఫోర్బ్స్' డిజిటల్ స్టార్...

పదేళ్లుగా ఫుడ్ బ్లాగింగ్‌లో ఉన్న నన్ను పలు అవార్డులు వరించాయి. ప్రముఖుల ప్రశంసలు ఎన్నో లభించాయి. 'నెట్‌ఫ్లిక్స్ ఆసియాస్ మై చెఫ్స్ టేబుల్ ఇన్‌స్టాగ్రామ్' పోటీలో విన్నర్‌గా నిలిచాను. లాస్‌ఏంజిల్స్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రముఖ చెఫ్ నాన్సీ సెల్వర్టన్‌ను కలవడం నా జీవితంలోనే ఓ మధురానుభూతి. వంటలకు సంబంధించి 'మై జీనియస్ లంచ్ బాక్స్' పేరుతో ఒక పుస్తకం కూడా రాశాను. 'పెంగ్విన్ రాండమ్ హౌస్' దాన్ని ప్రచురించింది. ఫ్లిప్‌కార్ట్, వావ్ మోమోస్, యూనిలివర్, మదర్ డైరీ అండ్ ఐటీసీ తదితర ప్రముఖ బ్రాండ్స్‌తో కలిసి పని చేశాను. తాజాగా ప్రముఖ మ్యాగజైన్ 'ఫోర్బ్స్ ఇండియా టాప్ 100 డిజిటల్ స్టార్స్' జాబితాలో చోటు దక్కింది. ఈ జాబితాలో నా పేరు చూసుకోవడం ఇది రెండోసారి. ఇద్దరు పిల్లల తల్లిగా... ఇంట్లో కూర్చొనే నేను ఇంత సాధించానంటే ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను. స్మార్ట్‌ఫోన్ల యుగంలో నాలాంటి గృహిణులకు ఎన్నో అవకాశాలు ఉన్నాయి. అదికూడా తక్కువ ఖర్చుతో. కాలంతో పరుగెత్తే ఉత్సాహం, మారుతున్న పరిస్థితులను అంచనా వేయగల సామర్థ్యం, సృజనాత్మకంగా ఆలోచించడం... ఇవి ఉంటే కంటెంట్ క్రియేటర్‌గా రాణించడం పెద్ద కష్టమేమీ కాదు. అందుకు నేనే ప్రత్యక్ష సాక్ష్యం."

ఇంట్లో అమ్మ దగ్గర నేర్చుకున్న పాకశాస్త్ర నైపుణ్యమే! ఎక్కడా చెఫ్‌గా పనిచేసిన అనుభవం కూడా లేదు. అయితేనేం... మాస్టర్ చెఫ్ ఇండియా పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచారు. ఇండియాలో మొదటి మాస్టర్ చెఫ్‌గా గుర్తింపు సాధించారు పంకజ్ భదౌరియా. స్కూల్ టీచర్ నుంచి మాస్టర్ చెఫ్‌గా ఆమె ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకం. ఆ విశేషాలు ఇవి...

అమ్మే నాకు గురువు

అమ్మ వంట చేస్తున్నప్పుడు కిచెన్‌లో నుంచి వచ్చే మసాలా ఘుమఘుమలు ఆమెను కుదురుగా కూర్చోనిచ్చేవి కాదు. ఆ సువాసనలే కుకింగ్‌పై ఇష్టాన్ని పెంచేలా చేశాయి. గంటల కొద్దీ అమ్మతో పాటు కిచెన్‌లో గడిపేవారు. రకరకాల వంటలు ఎలా చేయాలో నేర్చుకున్నారు. వంటలు రుచిగా రావడానికి కీలకమైన మసాలాల తయారీలో నైపుణ్యం సంపాదించారు. అదే ఆమెను ఇండియా ఫస్ట్ మాస్టర్ చెఫ్‌గా నిలబెట్టింది. ఆమె పేరు పంకజ్ భదౌరియా. లక్నోకు చెందిన పంకజ్ మొదట ఈ రంగం వైపు రాలేదు. పదహారేళ్ల పాటు టీచర్‌గా పనిచేశారు. హైస్కూల్ విద్యార్థులకు చదువు చెబుతున్న మనసులో ఏదో వెలితి. తన కలను సాకారం చేసుకోవడానికి ఏదైనా చేయాలని, అది ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు కాదని అనుకున్నారు. వెంటనే టీచర్ ఉద్యోగానికి రాజీనామా చేశారు.

మొదటి అడుగుతోనే విజయం

ఉద్యోగానికి రాజీనామా చేసిన తరువాత మాస్టర్ చెఫ్ ఇండియా పోటీల్లో పాల్గొనాలని నిర్ణయించుకున్నారు పంకజ్. ఆ నిర్ణయం ఆమె జీవితాన్ని పూర్తిగా మార్చివేసింది. ఆ పోటీ సాధారణమైనది కాదు. దేశవ్యాప్తంగా ఎంతో అనుభవం ఉన్న చెఫ్‌లు బరిలో ఉంటారు. అలాంటి కాంపిటీషన్‌లోకి ఎంట్రీ అయ్యాక ఆమె ఎన్నో సవాళ్లను, అడ్డంకులను ఎదుర్కొన్నారు. అయితే ఆమె కుటుంబ సభ్యులు, స్నేహితుల నుంచి అద్భుతమైన సహకారం లభించింది. పోటీల్లో వంటలను సరికొత్త పద్ధతుల్లో తయారుచేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించారు. సంప్రదాయ భారతీయ ఫ్లేవర్లకు ఆధునిక టెక్నిక్స్‌ను జోడించి న్యాయనిర్ణేతల దృష్టిలో పడ్డారు. అదే సమయంలో ప్రేక్షకుల మనసు గెలుచుకున్నారు. ఎప్పటికప్పుడు తన నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ పంకజ్ ముందుకెళ్లారు. కొన్ని వారాల పాటు సాగిన పోటీల్లో చివరకు పంకజ్ విజేతగా నిలిచారు. మాస్టర్ చెఫ్ ఇండియాగా టైటిల్



అందుకున్నారు. "మా పేరెంట్స్ ఇద్దరూ అద్భుతంగా వంట చేస్తారు. మా అమ్మ పెళ్లయిన తరువాతే నానమ్మ దగ్గర వంట నేర్చుకుందట. మా ఇంట్లో ఏదైనా ఫంక్షన్స్ జరిగితే రుచికరమైన కొత్త కొత్త వంటలు తయారుచేశారు. వాటిని రుచి చూసేందుకు స్నేహితులు, బంధువులు ఆసక్తిగా ఉండేవారు. అది నాకు స్ఫూర్తినిచ్చేది. అమ్మే నాకు గురువు" అంటారు పంకజ్.

అశేష అభిమాన గణం

ఆ విజయం తరువాత పంకజ్‌కు వెనుదిరిగి చూసుకునే అవకాశం రాలేదు. ఆ రంగంలో ఉన్నత స్థానానికి ఎదిగారు. టెలివిజన్ షోలు చేశారు. వంటలకు సంబంధించి పుస్తకాలు రాశారు. 'మాస్టర్ చెఫ్ ఇండియా కుక్‌బుక్', 'చికెన్ ఫ్రం మై కిచెన్' పుస్తకాలు బాగా ప్రాచుర్యం పొందాయి. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది అభిమానులను సంపాదించిపెట్టాయి. 'కేఫ్ బై డీఫాల్ట్' పేరుతో లక్నోలో రెస్టారెంట్‌ను ప్రారంభించారు. రుచికరమైన ఆహారం లభించే రెస్టారెంట్‌గా ఇది గుర్తింపు పొందింది. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ, న్యూయార్క్‌లోని వర్ల్డ్ ఫుడ్ ఫెస్టివల్, బీబీసీ సిరీస్ వంటి ప్లాట్‌ఫామ్స్ నుంచి అందిన ఆహ్వానం మేరకు వాటిలో పాల్గొన్నారు. ఈవెంట్లు, సెమినార్లు, టెడెక్స్ సెషన్లతో బిజీబిజీగా గడిపారు. ప్రపంచవ్యాప్తంగా అనేక ఫుడ్ వర్క్‌షాపుల్లో, సెమినార్లలో, ఫుడ్ ఫెస్టివల్స్‌లో పాల్గొన్నారు. "మా ఆయన సపోర్టు లేకుంటే ఈ విజయం సాధించేదాన్ని కాదు" అని అంటారు పంకజ్. సామాజిక కార్యక్రమాల్లోనూ పంకజ్ ఎప్పుడూ ముందు ఉంటారు. యునిసెఫ్‌తో, స్థానిక స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేశారు. ఎన్‌జీఓలతో కలిసి ఫండ్ రైజింగ్ వర్క్‌షాపుల్లో పాల్గొన్నారు. రాష్ట్రపతి కోవింద్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. చెఫ్‌లు ఎదగాలనుకుంటున్న ఎంతో మందికి ఆమె స్ఫూర్తిగా నిలిచారు. "హార్డ్‌వర్క్‌తోనే ఈ స్థానానికి చేరుకున్నాను" అని వినమ్రంగా అంటారామె. అంకితభావం, పట్టుదల, సృజనాత్మకత ఉంటే విజయం సాధించవచ్చని నిరూపించారు పంకజ్ భదౌరియా.

ఫ్యాషన్

స్వర్ణ కాంతులు కేవలం పట్టు చీరలకే పరిమితం కాదు. ధగధగలు చిందించే వేరే చీరలూ ఉన్నాయి. అవే 'గోల్డ్ లైక్రా' శారీస్. ఈవెంట్స్, పార్టీలు, ఫంక్షన్లలో స్వర్ణకాంతులతో వెలిగిపోవాలంటే ఇవిగో ఈ గోల్డ్ లైక్రా చీరలే కట్టుకోవాలి!

లవ్లీ లైక్రా




- ఎలాస్టిక్‌లా సాగుతూ, మెత్తగా, ఒంటికి హత్తుకుపోయేలా ఉంటాయి లైక్రా చీరలు. ప్లెయిన్ లైక్రా చీరలను సెక్విన్ వర్క్ ఉన్న బ్లౌజ్‌తో మ్యాచ్ చేసి కట్టుకుంటే స్టయిలిష్‌గా కనిపిస్తారు!
- నెటెడ్ మెటీరియల్‌తో జోడించి, బార్డర్‌లో మెరుపులీనే అటాచ్‌మెంట్స్‌తో కూడా లైక్రా చీరలను డిజైన్ చేసుకోవచ్చు. ఇలాంటివి ధరిస్తే పార్టీల్లో ప్రత్యేకంగా కనిపిస్తారు.
- ఎరుపు, బంగారు వర్ణాల కలబోత ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తుంది. కాబట్టి రెడ్ అండ్ గోల్డ్ లైక్రా చీరలను కూడా ఎంచుకుంటూ ఉండాలి. ఈ వెరైటీ చీరల ముందు పట్టు చీరలు కూడా వెలవెలపోతాయి.

హుందాగా, స్టైల్‌గా... మెరుపులీనే లైక్రా చీరలు అవసరానికి మించి ఆకట్టుకుంటూ, ఎబ్బెట్టుగా కనిపిస్తాయని భయపడవలసిన అవసరం లేదు. నిజానికి సరిజోడుగా ఉండే జ్యువెలరీ, ఇతరత్రా యాక్సెసరీస్‌ను జోడిస్తే, లైక్రా చీరల్లో కచ్చితంగా లవ్లీగా కనిపించవచ్చు. ఇందుకోసం టెంపుల్ జ్యువెలరీ లేదా యాంటిక్ జ్యువెలరీ ఎంచుకోవాలి. సందర్భానికి తగినట్టు మిగతా యాక్సెసరీస్‌ను కూడా ఎంచుకోవాలి. భారీ నగలకు బదులుగా వీలైనంత సింపుల్ నగలనే ధరించాలి. రాళ్లు పొదిగిన నగలైతే చాలా బాగుంటాయి. చేతిలో స్టోన్ స్టడెడ్ పర్స్, పాదాలకు హైహీల్స్ లేదా వెడ్జెడ్ హీల్స్ నప్పుతాయి.





చంద్రుడి పక్కనే 'డ్రోన్ భూగోళం' దానిలోనే భారతం.. డ్రోన్ షోను వీక్షిస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



నింగిలో డ్రోన్లు ఆవిష్కరించిన త్రివర్ణ పతాకం..!



సమ్మిట్‌కు ఆహ్వానం పలుకుతున్న డ్రోన్

ఏపీని ఆపలేరు!

"విజయవాడ వరదలప్పుడు డ్రోన్ సేవలను వినియోగించుకోవాలన్న ఆలోచన వచ్చింది. హెలికాప్టర్ల ద్వారా ఆహారం వరద ప్రాంతాల్లో పైనుంచి కిందకు వదిలేయడంవల్ల అవి ఎక్కువగా నీటిలో పడి పాడైపోయేవి. ఎత్తులో ఉన్న భవనాలపైకి విసరాలన్నా వీలయ్యేదికాదు. దీంతో దేశ వ్యాప్తంగా ఉన్న డ్రోన్లను రప్పించాం. వ్యవసాయనికి వాడే ఆ డ్రోన్‌ల సాయంతో లక్షన్నర మంది బాధితులకు ఆహారం అందించాం. డ్రోన్ల వినియోగం వ్యవసాయం, మౌలిక సదుపాయలు, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర వైద్యసేవలకూ విస్తరించాలి. ఇందుకు డ్రోన్ల డీరెగ్యులేషన్ జరగాలి"

- సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

తగ్గుతోందన్నారు. భారతదేశంలో యువత గణనీయంగా ఉండటమే ఆర్థికంగా దేశ ఎదుగుదలకు కారణమవుతుందని చెప్పారు. "రాష్ట్రాన్ని భవిష్యత్తు గేమ్ చేంజర్‌గా డ్రోన్‌లు మారుస్తాయి. అమరావతిని డ్రోన్ కేపిటల్‌గా మలుస్తాం. డ్రోన్ సమ్మిట్‌లో వచ్చిన అభిప్రాయాలను క్రోడీకరించి 15రోజుల్లో డ్రోన్ పాలసీ తీసుకువస్తాం. దీని సేవలు విస్తృతంగా వినియోగించుకునేలా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌తో అనుసంధానిస్తాం. వ్యవసాయం, మౌలిక సదుపాయలు, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర వైద్యసేవలకు డ్రోన్‌లను వినియోగించుకునేలా పరిశోధనలు సాగాలి" అని సీఎం కోరారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

ఆవిష్కరణలపై మోదీకి ఆసక్తి

టెలికాం డీరెగ్యులేషన్‌కు వాజపేయి కృషి

డ్రోన్ విషయంలో ఆ పాత్ర మోదీ పోషించాలి : చంద్రబాబు

ప్రధాని మోదీ ఇంగ్లీషును బాగా మాట్లాడటంతోపాటు సాంకేతికతను త్వరగా అర్థం చేసుకోగలుగుతారని సీఎం చంద్రబాబు కితాబు ఇచ్చారు. నూతన అవిష్కరణలపై ప్రధాని మోదీ ఆసక్తిని చూపుతారని కొనియాడారు. "గతంలో టెలికాం నియంత్రణను తగ్గించేందుకు నాటి ప్రధాని వాజపేయి సహకరించారు. ఇప్పుడు డ్రోన్‌లను ఎగురవేయడంపై ఉన్న ఆంక్షలూ..నియంత్రణను ఎత్తివేసేందుకు ప్రధాని మోదీ సహకరిస్తారనే నమ్మకం నాకుంది" అని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో డ్రోన్ వినియోగాన్ని విస్తృతపరుస్తామన్నారు. " డ్రోన్‌ల ఎగురవేతపై ఆంక్షలు తగ్గించేందుకు కేంద్ర మంత్రి రామ్మోహన నాయుడు ప్రయత్నించాలి. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 300 ఎకరాలను డ్రోన్ అకాడమీ, తయారీ, పైలట్ శిక్షణా కేంద్రాల కోసం కేటాయిస్తాం. గతంలో ప్రతి ఇంట్లో ఒక ఐటీ ఉద్యోగి ఉండాలని కోరాను. ఇప్పుడు ప్రతి ఇంట్లో ఒక వ్యాపారవేత్త ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. డ్రోన్ వినియోగంపై ఆంక్షలు సడలిస్తే .. అవి ఇంకా మరిన్ని సేవలు అందిస్తాయి" అని సీఎం వివరించారు.

యువకుడినైనా బాబుతో నేను పోటీ పడలేను: రామ్మోహన్

డ్రోన్ కేపిటల్‌గా అమరావతిని మార్చడంలో రాష్ట్ర ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం అందిస్తానని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు భరోసా ఇచ్చారు. "డ్రోన్ సమ్మిట్ ఎన్నికల కోసం కాదు...యువత భవిష్యత్తు కోసం నిర్వహిస్తున్నాం. యువకుడినైన నేను..సీఎం చంద్రబాబు వినూత్న ఆలోచనలతో పోటీ పడలేకపోతున్నాను. రాష్ట్రంలో డ్రోన్ల తయారీ రంగానికి ప్రోత్సాహకాలు అందిస్తాం" అని హామీ ఇచ్చారు.

రైతులకు ఖర్చు తగ్గించే డ్రోన్లు కావాలి

డ్రోన్ సమ్మిట్‌లో స్టాళ్లను పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుతో కలసి వివరాలు తెలుసుకున్న సీఎం

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రైతులకు మరింత సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డ్రోన్‌లను అందించాలని తయారీదారులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోరారు. ఒకే దఫాలో ఎరువులు, క్రిమిసంహారక మందులు పిచికారీతో పాటు పైరు ఎదుగుదలను పరీక్షించేలా డ్రోన్‌ల సాంకేతిక పరిజ్ఞానం పెంచాలన్నారు. దీనివల్ల రైతులకు ఖర్చు తగ్గుతుందని చెప్పారు. మంగళగిరిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మంగళవారం అమరావతి డ్రోన్ సమ్మిట్ జరిగింది. ఈ సమ్మిట్ ప్రాంగణంలో 50 డ్రోన్ స్టాళ్లను ఏర్పాటు చేశారు. 500 కిలోల బరువును మెసుకెళ్లే శక్తివంతమైన డ్రోన్‌తో పాటు.. 250 గ్రాములను మోయగలిగే చిన్న డ్రోన్‌లను కూడా ప్రదర్శనకు ఉంచారు. వీటిలో ఎక్కువగా వ్యవసాయానికి ఉపయోగపడేవే ఉన్నాయి. ఈ స్టాళ్లను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుతో కలసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దాదాపు గంటన్నర పాటు పరిశీలించారు. ప్రతి స్టాల్ వద్దకు వెళ్లి అక్కడి ప్రతినిధులతో రెండేసి నిమిషాలుపైగా మాట్లాడారు. డ్రోన్ ఎలా పని చేస్తుందో ఆరా తీశారు. ఈ డ్రోన్లు రైతులకు ఎలా సేవలందిస్తాయో అడిగి తెలుసుకున్నారు. 500 కిలోలు మోసుకెళ్లగలిగే డ్రోన్ పనితీరును ప్రత్యేకంగా పరిశీలించారు. పౌర సేవలు, వ్యవసాయం,రహదారులపై విశ్లేషణ, ప్రజారోగ్యం, మునిసిపల్ కాలువల తీరు, పేరుకున్న చెత్త పరిశీలన, ప్రాజెక్టుల పని తీరు, రౌడీ షీటర్లు, రోడ్లపై తాగి వాహనాలు నడిపేవారు, మహిళలపై అసభ్యంగా ప్రవర్తించేవారు ఇలా పలు సేవల్లో డ్రోన్‌లను వినియోగించే వీలుందని చంద్రబాబు చెప్పారు.



డ్రోన్ కాదు .. బుల్లి విమానమే

హైడ్రోజన్ ఎలక్ట్రిక్ పవర్డ్ వీటీఓఎల్ ఎయిర్‌క్రాఫ్ట్ డ్రోన్ సమ్మిట్‌లో అత్యంత ఆకర్షణగా నిలిచింది. 500 కిలోల బరువు మోయగలిగే ఈ బుల్లి విమానానికి ఎయిర్ పోర్టులూ.. రన్‌వేలూ అవసరం లేదు. ముంబై నుంచి పుణెకు 30 నిమిషాల్లో.. విజయవాడ నుంచి విశాఖకు 45 నిమిషాల్లో చేరుకోగల సత్తా ఉందని సంస్థకు చెందిన సతీష్ వివరించారు. పలు రకాలుగా వీటీఓఎల్ సేవలు వినియోగించుకోవచ్చనన్నారు.




వ్యోమా-ఎం .. సేవల్లో మేటి

చూసేందుకు ఆటబొమ్మలా ఉండే వ్యోమా -ఎం .. పలు రకాల సేవలు అందిస్తుంది. ఎయిరో 360గా పిలిచే ఈ వ్యోమా-ఎం డ్రోన్‌లు .. భూసర్వేలో, మైనింగ్‌లో సహకారాన్ని అందిస్తాయి. చంద్రబాబుకు తాము అందిస్తున్న సేవలను కంపెనీ ఎండీ ముత్తుకూరప్పన్ వివరించారు. ఏపీలోనూ సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పంటలకు క్రిమిసంహారక మందులను చల్లడంలో తమది ప్రత్యేక స్థానమన్నారు.

ఏ200-ఎక్స్‌టీ .. గట్టి పనిమంతుడు



ఏ200-ఎక్స్‌టీ డ్రోన్ గట్టి పనిమంతుడేనని చెప్పాలి. చంద్రబాబుకు తమ డ్రోన్ వివరాలను కంపెనీ డైరెక్టర్ నిహార్ వివరించారు. ఏటా 400కుపైగా డ్రోన్‌లు తయారుచేస్తున్నామని చెప్పారు. డ్రోన్‌ల రంగంలో ఎ200, ఎ410ఎక్స్‌టీ, ఏ15 డ్రోన్‌లను తయారు చేస్తున్నామని వివరించారు.



దూసుకుపోతున్న.. డ్రోన్ విమానం

సామాజిక చైతన్యం ఏదీ?

కెరీర్‌పైనే నేటి యువత దృష్టి

- ఐదేళ్లలో ఏపీ తీవ్రంగా నష్టపోయింది
- చంద్రబాబుకు సువర్ణావకాశం!
- కేంద్రంలో సానుకూలత కలిసి వస్తుంది
- పాలకుల తప్పులకు ఐఏఎస్, ఐపీఎస్‌ల వంత
- 'ఆంధ్రజ్యోతి'తో ప్రొఫెసర్ హరగోపాల్

(బాపట్ల - ఆంధ్రజ్యోతి)



సామాజిక స్పృహ, హేతుబద్ధమైన ఆలోచన, పోరాట స్ఫూర్తి... ఈ లక్షణాలు యువతలో క్రమంగా లోపిస్తున్నాయని ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు ప్రొఫెసర్ హరగోపాల్ పేర్కొన్నారు. పేదల కలెక్టర్‌గా, ఐఏఎస్ గాంధీగా ఖ్యాతి గడించిన ఎస్ఆర్ శంకరన్ జయంతి సందర్భంగా మంగళవారం బాపట్లలో నిర్వహించిన 'ప్రజాస్వామ్యం-సుపరిపాలన'పై నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. సమకాలీన అంశాలపై 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఇవీ ఆ వివరాలు...

? మీరు దశాబ్దాలుగా అధ్యాపక వృత్తిలో ఉన్నారు. సామాజాన్ని దగ్గరి నుంచి చూస్తున్నారు. అప్పటికీ, ఇప్పటికీ మీరు గమనించిన తేడా?

80, 90 దశకాలలో విద్యార్థులకు ఆశయాలు, సామాజిక చైతన్యం, సమాజానికి ఏదైనా చేయాలనే దృక్పథం కనిపించేవి. ఏళ్లు గడుస్తున్న కొద్దీ ఇవి పలుచబడుతూ వచ్చాయి. ప్రస్తుతం కెరీర్‌పై ఆలోచనకే పరిమితమవుతున్నారు.

? ప్రొఫెసర్ సాయిబాబా ఉదంతం, ఉపా చట్టంపై మీ అభిప్రాయాలు...

ప్రొఫెసర్ సాయిబాబా మరణం తర్వాత జాతీయంగా, అంతర్జాతీయంగా పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. ఆయనను అరెస్టు చేసినప్పుడే అందరూ గళమెత్తితే పదేళ్ల అక్రమ నిర్బంధం తప్పేదేమో! గతేడాది అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబును ఎలాంటి ఆధారాల్లేకుండా అరెస్టు చేసి వారాల తరబడి నిర్బంధించారు. అది తప్పని అప్పుడు కూడా చెప్పాను. పాలకులు ప్రత్యర్థులపై కక్ష సాధించడానికి కొన్ని చట్టాలను దుర్వినియోగం చేస్తున్నారు. అందులో 'ఉపా' ముఖ్యమైనది. అందుకే దానిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

? ఎస్ఆర్ శంకరన్‌లాంటి అధికారులు ఇప్పుడున్నారా?

నాటి తరం వారికి కొన్ని ఆశయాలు, ఆదర్శాలు ఉండేవి. ఆ మూలాల్లో నుంచి వచ్చిన ఐఏఎస్‌లకు ఉదాహరణే శంకరన్. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎవరైనా ఐఏఎస్‌లు ఓ సలహా ఇస్తే దానిని ఆయన ఆచరించేవారు. దీంతో మరోసారి స్వేచ్ఛగా వారు తమ అభిప్రాయాన్ని చెప్పడానికి అవకాశం కలిగేది. ప్రస్తుతం ఆ వాతావరణం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో ఎంతోమంది ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు పలు కేసుల్లో ఇరుక్కోవడం చూస్తున్నాం. పాలకుల మనసెరిగి నడుచుకుంటూ వారి తప్పులకు కూడా వంతపాడుతూ ఉండడమే ఇన్ని అనర్థాలకు మూలం!

? చంద్రబాబు పాలనపై మీ అభిప్రాయం?

సుదీర్ఘమైన పాలనానుభవం చంద్రబాబుది. అవమానాలు మిగిల్చిన చరిత్రే ఆయనకు ముఖ్యమంత్రి పదవి రూపంలో మరొక సువర్ణావకాశం ఇచ్చింది. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వానికి అరకొరగానే మెజారిటీ రావడం చంద్రబాబుకు కలిసొచ్చే అంశం. ఒక విధంగా చెప్పాలంటే గడచిన ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ భారీగా నష్టపోయింది. ఇప్పుడు కేంద్రంలో ఉన్న సానుకూలతలను ఆసరాగా చేసుకుని మళ్లీ గాడిన పెట్టగలరు. కాకపోతే అమరావతి నిర్మాణం ఎంత అవసరమో పల్లెసీమల అభివృద్ధి అంతే అవశ్యకం. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి.

2 వారాలు పేకాట ఆపితే.. ఆకాశమేమీ కింద పడిపోదు

- పేకాట క్లబ్‌లకు హైకోర్టు చురకలు

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పేకాట క్లబ్ యాజమాన్యాలకు హైకోర్టు చురకలు అంటించింది. రమ్మీ ఆటను అడ్డుకోకుండా పోలీసులను నిలువరించాలని దాఖలైన వ్యాజ్యాల్లో మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించింది. రెండువారాల పాటు పేకాట ఆపితే ఆకాశం ఏమీ కింద పడిపోదని వ్యాఖ్యానించింది. కనీసం ఈ రెండు వారాలైనా కుటుంబాలు సంతోషంగా జీవిస్తాయని పేర్కొంది. ఇలాంటి వ్యవహారాల్లో వాస్తవాలు తెలుసుకోకుండా ఆదేశాలు ఇస్తే కోర్టులు పేకాటను ప్రోత్సహిస్తున్నాయని ప్రజలు భావించే ప్రమాదం ఉందని తెలిపింది. పేకాట క్లబుల్లో చట్టబద్ధమైన కార్యకలాపాలే సాగుతున్నాయా? లేక చట్టవిరుద్ధమైన పనులు ఏమైనా చేస్తున్నారా? వివరాలు సమర్పించాలని పోలీసులను ఆదేశించింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. 13 కార్డుల రమ్మీ ఆట విషయంలో జోక్యం చేసుకోకుండా పోలీసులను ఆదేశించాలని కోరుతూ గుంటూరులోని ఎల్‌వీఆర్ క్లబ్, ఏలూరులోని ది కాస్మోపాలిటన్ క్లబ్ వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ వ్యాజ్యాలపై మంగళవారం హైకోర్టు విచారణ జరిపింది.

ఇంటి పక్కనే అత్యాచారం...

అయినా జగన్ పట్టించుకోలేదు: అనిత



అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): 'జగన్ సీఎంగా ఉండగా తన ఇంటికి కూత వేటు దూరంలో ఒక దళిత యువతిపై కాబోయే భర్త ఎదురుగా సామూహిక అత్యాచారం జరిగితే ఆయన ఆ వైపు కూడా చూడలేదు. కాలు కదిపి పరామర్శించలేదు. నిందితులను పట్టుకోవడానికి ఏ ప్రయత్నమూ చేయలేదు. రాష్ట్రాన్ని దోచుకోవడానికి, దాచుకోవడానికే సమయం అంతా వెచ్చించాడు. పదవి పోయిన తర్వాత ఇప్పుడు పరామర్శలకు బయలుదేరడానికి సిగ్గుండాలి' అని హోం మంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. మంగళవారం ఆమె ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర సంస్థల నివేదిక ప్రకారం జగన్ హయాంలో రాష్ట్రంలో మహిళలు, చిన్నారుల మీద జరిగిన ఘోరాలపై 2.04 లక్షల కేసులు నమోదయ్యాయని.. వాటిలో ఒక్క దానిపై నా ఆయన మాట్లాడలేదని.. ఏనాడూ సమీక్షలు జరపలేదని తెలిపారు. 21 రోజుల్లో శిక్షలు అంటూ చట్టబద్ధత లేని దిశ చట్టం గురించి పనికిమాలిన ఉపన్యాసాలు ఇచ్చారని దుయ్యబట్టారు.

అది నోరా.. నగరి డ్రైనేజా..: ఎంఎస్ రాజు



అనంతపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు చూస్తుంటే ఒక ఆడపిల్ల తల్లిగా నాకు భయమేస్తోందంటూ మేకప్ కరిగి పోయేలా రోజా కన్నీరు కారుస్తున్నారు. గతాన్ని మరచి మాట్లాడుతున్న రోజాది నోరా.. నగరి డ్రైనేజా' అని టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మండిపడ్డారు. మంగళవారం అనంతపురంలో మాట్లాడుతూ.. 'వైసీపీ పాలనలో.. ఒకట్రెండు రేపులకే రాద్ధాంతమా అని తిరుమలలో రోజా మాట్లాడడం ప్రజలెవరూ మరిచిపోలేదు. వైసీపీ ప్రభుత్వంలో 2 వేల పైచిలుకు మహిళల మీద అత్యాచారాలు, హత్యలు జరిగితే ఏ రోజూ ఈ రోజా నోరు మెదపలేదు. దాదాపు 30 వేల మంది మహిళలు అదృశ్యమైతే ఏ రోజూ మాట్లాడలేదు' అని ధ్వజమెత్తారు.

జగన్ పాపాలతోనే విద్యుత్ భారం: గొట్టిపాటి

ఒంగోలు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): 'జగన్ అరాచకాలతో అన్ని వ్యవస్థలు సర్వనాశనం అయ్యాయి. అందులో విద్యుత్ వ్యవస్థ దారుణంగా దెబ్బతింది. నాటి జగన్ ప్రభుత్వ పాపాలు, కక్షపూరిత విధానాలతో విద్యుత్ సంస్థలు మోయలేని భారాలు మోయాల్సి వస్తోంది. అంతే తప్ప టీడీపీ ప్రభుత్వం కావాలని ప్రజలపై ఎటువంటి భారం మోపడం లేదు' అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మంగళవారం ఒంగోలులో టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

డ్రోన్ భళా.. ఏపీకి కొత్త కళ

విన్యాసాలు అదుర్స్.. ఐదు గిన్నిస్ రికార్డులు నమోదు

దీపావళికి ముందే నింగిలో కాంతులు

అమరావతిలో 300 ఎకరాల్లో డ్రోన్ సిటీ : రామ్మోహన్

విజయవాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అమరావతి డ్రోన్ షో రికార్డులు బద్దలు కొట్టింది. సరికొత్త ప్రపంచ రికార్డులను నమోదు చేసింది. మొత్తం ఐదు విభాగాలలో గిన్నిస్ రికార్డులను నెలకొల్పింది. డ్రోన్ షోను వీక్షించటం కోసం వచ్చిన జనంతో కృష్ణానదీ తీరం పులకించింది. ప్రధాన వేదిక పున్నమిఘాట్ కి క్యూకట్టింది. రాత్రి 8.30 గంటలకు డ్రోన్‌షో మొదలైంది. ఒక్కసారిగా ఆకాశంలో నక్షత్రాలుగా 5,500 డ్రోన్లు పైకి లేచాయి. ఆకాశంలో వేలాది నక్షత్రాలుగా కనిపించిన డ్రోన్లు.. ఆ తర్వాత కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌ను డ్రోన్ సెన్సార్లు స్వీకరించి అత్యద్భుత ప్రదర్శన చేశాయి. ముందుగా ఏవియేషన్ రంగాన్ని పరియం చేస్తూ థీమ్ సాగింది. ఏవియేషన్ రంగానికి పుట్టుకకు దోహదపడిన రైట్ బ్రదర్స్ సృష్టించిన విమానంతో కూడిన తొలి ఏవియేషన్ తపాలా బిళ్లను ప్రదర్శించింది. 1911- 1961 లో గోల్డెన్ జూబ్లీ సందర్భంగా ఫస్ట్ ఏరియల్ పోస్ట్ ఒక రూపాయి భారత తపాలా బిళ్లను ఆవిష్కరించింది. ఆ తర్వాత విమానయాన రంగం విప్లవాత్మక మార్పులతో ఏ విధంగా ముందుకు సాగింది వివరించింది. ఆధునిక సౌకర్యవంతమైన విమాన ప్రయాణాలకు నిదర్శనంగా అతి పెద్ద బోయింగ్ విమానాన్ని ప్రదర్శించింది. మూడోదిగా అమరావతి డ్రోన్ సమ్మిట్‌ను ఒక చారిత్రకమైన ఘట్టంగా అభివర్ణిస్తూ విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రదర్శిస్తూ....అమరావతి భవిష్యత్తును ప్రస్తావిస్తూ బుద్ధుడి చిత్రాన్ని డ్రోన్లు ఆవిష్కరించాయి. ఆ తర్వాత గ్లోబల్‌గా విమానయానం ఏ విధంగా ఊపందుకుంది ? భారత్‌లో విమానయానరంగం ఏ విధంగా పురోగమిస్తుందని తెలిపే గ్లోబల్ ఏవియేషన్ ప్లానెట్ థీమ్‌ను ప్రదర్శించింది. ఆ తర్వాత సాంకేతిక విప్లవంగా డ్రోన్‌ను ఆవిష్కరించింది. నేటి యుగంలో డ్రోన్లు ఏ విధంగా వ్యవసాయ రంగంలో ఉపయోగపడుతున్నాయో ఈ థీమ్‌లో కళ్లకు కట్టినట్టు చూపింది. ఆ తర్వాత విమానయాన రంగానికి లెగసీగా చెప్పుకొనే ఇంటర్నేషనల్ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్ అతిపెద్ద లోగోను డ్రోన్లు ఆవిష్కరించాయి. చివరగా అమరావతి డ్రోన్ షో - 2024 ద్వారా భారతదేశం ఏ విధంగా ప్రపంచంలో సగర్వంగా నిలవబోతుందో చెప్పేలా అతిపెద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు.

● కృష్ణాతీరాన సంబరం

డ్రోన్ షోకు ముందు రెండు వేదికలపై నిర్వహించిన కల్చరల్ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఒక వేదికపై స్థానిక కళాకారులు నృత్య కార్యక్రమాలను నిర్వహించగా.. మరో ప్రధాన వేదికపై భోగిరెడ్డి శ్రావ్య మానస నేతృత్వంలో 'జరుగుతున్నది జగన్నాటకం...' అంటూ బృంద నృత్యం ఆకట్టుకుంది. ఆ తర్వాత హైదరాబాద్‌కు చెందిన త్రియోరీ ఆక్రోబాట్ టీమ్ ప్రదర్శించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. డ్యాన్స్ చేస్తూ ఆక్రోబాట్స్ చేయటం, సైకిల్‌పై విన్యాసాలు చేయటం ఆకట్టుకుంది. చివరిగా సైకిలెక్కిన ఆక్రోబాట్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. తర్వాత క్లాసికల్ పాటలతో, ఆధునిక, సంప్రదాయ వాయిద్య పరికరాల సమన్వయంతో నిర్వహించిన కచేరీ ఆకట్టుకుంది. ఈ కచేరీకి ముఖ్యమంత్రి చంద్రబాబు ఫిదా అయ్యారు. డ్రోన్ షో ముగిసిన తర్వాత నిర్వహించిన లేజర్ బీమ్ షో ఆకట్టుకుంది. చివరిగా భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. బాణసంచా వెలుగు జిలుగులు ముందే దీపావళిని తీసుకు వచ్చాయి.

● డ్రోన్ హ్యాకథాన్‌పై ఏపీ...

డ్రోన్లు వివిధ రంగాల్లో అవసరాలను ఎలా తీర్చగలుగుతాయన్న దానిపై సర్వే, వ్యవసాయ వినియోగ ఉపయోగాలు, అడవుల దహనాన్ని నియంత్రించటం, అర్బన్ ప్లానింగ్ - అనధికార కట్టడాల గుర్తింపు, గ్యాస్ పైపులైన్లను పరిశీలించటం, పబ్లిక్ సేఫ్టీ, ఆరోగ్యం, మెడికల్ సప్లై రవాణా, రోడ్డు ప్రమాదాలను నివారించటం, అభివృద్ధి పనుల సమీక్షలకు సంబంధించిన థీమ్‌లపై నిర్వహించిన డ్రోన్ హ్యాకథాన్‌కు 500 మంది తమ కాన్సెప్ట్‌తో పోటీ పడ్డారు. డ్రోన్ హ్యాకథాన్ విజేతలకు నగదు అవార్డులను ముఖ్యమంత్రి చంద్రబాబు అందించారు. కాగా, మొత్తం ఐదు అవార్డులను గిన్నిస్ సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రికి అందించారు.

● అసామాన్యం, అద్వితీయం : రామ్మోహన్‌నాయుడు

డ్రోన్ సిటీ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో 300 ఎకరాలను కేటాయించారని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు అన్నారు. డ్రోన్ సర్టిఫికేషన్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన అనుమతులు ఇవ్వటానికి సహకరిస్తామన్నారు. డ్రోన్లంటే పెళ్లిళ్లలో ఉపయోగిస్తామని అనుకుంటారని, డ్రోన్ల ఉపయోగాన్ని చంద్రబాబు గుర్తించి డ్రోన్లను అన్ని శాఖల అవసరాలను తీర్చటం కోసం వినూత్న నిర్ణయం తీసుకోవటం అసామాన్యమైన నిర్ణయమన్నారు. డ్రోన్లను వ్యవసాయం, వైద్యం, రవాణా, ప్రభుత్వ తదితర రంగాలలో ఉపయోగించుకోవాలన్న ఆలోచనతో డ్రోన్ సమ్మిట్‌ను ముఖ్యమంత్రి నిర్వహించటం అద్వితీయమన్నారు.



ఐదు గిన్నిస్ రికార్డులు..

- లార్జెస్ట్ ప్లానెట్‌ను డ్రోన్ షో ఆవిష్కరించింది. ఏవియేషన్ రంగంలో ప్రపంచంలోనే భారతదేశం ఏ విధంగా వెలిగిపోతుందో చెప్పేలా ప్రదర్శించిన ఈ ప్లానెట్ చిత్రానికి తొలి గిన్నిస్ రికార్డు లభించింది.
- కృష్ణానదీ తీరాన అతిపెద్ద ల్యాండ్‌మార్క్ ప్రదేశంలో డ్రోన్ షో నిర్వహించినందుకు లార్జెస్ట్ ల్యాండ్‌మార్క్‌గా రెండో గిన్నిస్ రికార్డు నమోదు చేసింది.
- అత్యంత పెద్ద బోయింగ్ విమానాన్ని త్రీడీ మూవింగ్ టెక్నాలజీలో చూపించినందుకు మూడో గిన్నిస్ రికార్డు లభించింది.
- ప్రదర్శనలో ఆవిష్కరించిన అతి పెద్ద డ్రోన్స్ ఇండియన్ ఫ్లాగ్ నాలుగో గిన్నిస్ రికార్డును సాధించింది.
- అతిపెద్ద ఏరియల్ లోగోను రూపొందించిన బాట్‌లాబ్ టీమ్‌కు ఐదో గిన్నిస్ అవార్డు వరించింది.

మిథున్‌రెడ్డికి ముందస్తు బెయిల్‌పై 29న నిర్ణయం

▸▸ అప్పటి వరకు తొందరపాటు చర్యలొద్దని పోలీసులకు హైకోర్టు స్పష్టీకరణ

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పుంగనూరు పట్టణ పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టులో వాదనలు ముగిశాయి.నిర్ణయాన్ని 29న వెల్లడిస్తామని న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ ప్రకటించారు. వ్యాజ్యాలపై నిర్ణయం వెల్లడించే వరకు మిథున్‌రెడ్డిపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించారు. ఇదే కేసులో నిందితులుగా ఉన్న మరికొందరు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై కూడా న్యాయమూర్తి తీర్పును రిజర్వ్ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన నేతిగుట్లపల్లె, ఆవులపల్లి రిజర్వాయర్ల కోసం సేకరించిన భూములకు పరిహారం చెల్లింపు విషయంలో వినతి పత్రం సమర్పించేందుకు వెళ్లిన తమపై ఎంపీ మిథున్‌రెడ్డి, ఆయన అనుచరులు దాడిచేశారంటూ ఏఎస్ఆర్‌కె ప్రసాద్, సొహైల్ బాషా ఇచ్చిన వేర్వేరు ఫిర్యాదుల ఆధారంగా మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, మరికొందరిపై పుంగనూరు పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో ముందస్తు బెయిల్ కోరుతూ మిథున్‌రెడ్డి హైకోర్టులో రెండు పిటిషన్లు వేశారు. ఇదే కేసులో నిందితులుగా ఉన్న మరికొందరు కూడా ముందస్తు బెయిల్‌కోసం పిటిషన్లు వేశారు. ఈ వ్యాజ్యాలు బుధవారం మరోసారి విచారణకు రాగా మిథున్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. త్వరలో పార్లమెంటు సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయని.. మిథున్‌రెడ్డికి ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ప్రాసిక్యూషన్ తరఫు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మర్రి వెంకటరమణ వాదనలు వినిపిస్తూ... పుంగనూరు వెళ్తే శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని, అక్కడ వెళ్లవద్దని మిథున్‌రెడ్డిని పోలీసులు హెచ్చరించారని.. అయినా దాడులు చేయాలనే ప్రణాళికతో అనుచరులను వెంటతీసుకొని పుంగనూరు వెళ్లారని తెలిపారు. మిథున్‌రెడ్డి వస్తున్నారని తెలిసి, ఆయనకు వినతిపత్రం ఇచ్చేందుకు ఫిర్యాదుదారులు మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటికి వెళ్లారని.. వారిపై రాళ్లు, కర్రలతో ఎంపీ అనుచరులు దాడి చేశారని.. ఈ ఘటనలో చాలా మంది గాయపడ్డారని వివరించారు. పిటిషనర్ పుంగనూరు వెళ్లకుంటే ఘటన జరిగేదే కాదన్నారు. ఆయనపై ఇదే తరహా కేసులు మరో ఏడు ఉన్నాయని, ఈ విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని, ముందస్తు బెయిల్ మంజూరు చేయవద్దని కోరారు.

అధ్యక్షా..! అక్రమం





అసెంబ్లీ ఆడియో టెండర్లలో గోల్‌మాల్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

టీడీపీ హయాంలో వెలగపూడిలో నిర్మించిన అసెంబ్లీ భవనంలో జర్మన్ కంపెనీ సాంకేతిక పరిజ్ఞానంతో మైకులు, డిజిటల్ ఆడియో సిస్టం ఏర్పాటు చేశారు. దీనిని మొదట సీఆర్‌డీఏ ఏర్పాటు చేయించి మూడేళ్లపాటు దాని నిర్వహణ చూసింది. ఆ గడువు ముగిసే సమయానికి వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఆడియో సిస్టం నిర్వహణ కోసం 2020 అక్టోబరులో టెండర్లు పిలిచారు. ఇందులో రెండు సంస్థలు సాంకేతిక అర్హత సాధించాయి. ఇందులో ఒకటి అట్లూరి అండ్ కో కాగా.. మరొకటి స్వస్తిక్ కమ్యూనికేషన్స్. అట్లూరి సంస్థ ఉమ్మడి రాష్ట్రంలో చాలాకాలం అసెంబ్లీ ఆడియో సిస్టం నిర్వహణ చేపట్టింది. ఇప్పుడు తెలంగాణ అసెంబ్లీలో కూడా నిర్వహణ అదే చూస్తోంది. స్వస్తిక్ కమ్యూనికేషన్స్ ప్రధానంగా సీసీ కెమేరాలు, ఇంటర్ కమ్ ఫోన్లకు సంబంధించిన నిర్వహణ చూస్తోంది. వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డికి చెందిన జగతి పబ్లికేషన్స్ సీసీ కెమేరాల నిర్వహణ ఈ సంస్థే చూస్తోంది. మూడేళ్లపాటు ఆడియో సిస్టం నిర్వహణ అనుభవం ఉండాలన్నది ఈ టెండర్‌లో ప్రధాన నిబంధన. ఈ టెండర్ పిలవడానికి సరిగ్గా రెండు నెలల ముందు విజయవాడలోని గవర్నర్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్సింగ్ గదిలో ఆడియో సిస్టం ఏర్పాటుకు స్వస్తిక్ సంస్థకు ఆర్డర్ లభించింది. ఆగస్టు 1న ఆర్డర్ ఇచ్చి రెండో తేదీకల్లా దానిని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. టెండర్లలో తన అనుభవం కింద స్వస్తిక్ ఈ ఆర్డర్‌ను చూపించడం గమనార్హం. అలాగే గతంలో వైసీపీ కార్యాలయంలో ఏదో పని చేసినట్లు మరో లేఖను జత చేసింది. అయినా మూడేళ్ల అనుభవం నిబంధనకు ఇది చాలదు. 2020 అక్టోబరు 29న అసెంబ్లీలో టెక్నికల్ బిడ్ తెరిచారు. ఎల్-1గా అట్లూరి, ఎల్-2గా స్వస్తిక్ సంస్థను ఎంపికచేశారు. అదేరోజు సాయంత్రం ఫైనాన్షియల్ బిడ్ కూడా తెరిచారు. అట్లూరి సంస్థ ఏడాదిపాటు ఆడియో సిస్టం నిర్వహణకు రూ.36లక్షలు కోట్ చేసింది. స్వస్తిక్ రూ.44లక్షలు పేర్కొంది. రెంటికి మధ్య రూ.8లక్షల తేడా ఉంది. ప్రస్తుత ప్రభుత్వ పెద్దలకు అందిన ఫిర్యాదులోని సారాంశం ప్రకారం.. ఈ బిడ్ తెరిచిన వెంటనే అట్లూరి సంస్థపై ఒత్తిళ్లు మొదలయ్యాయి. పైవారికి స్వస్తిక్‌కు ఇవ్వాలన్న ఆసక్తి ఉందని.. అందుచేత బిడ్ నుంచి స్వచ్ఛందంగా తప్పుకోవాలని అసెంబ్లీలోని కొందరు అధికారులు అట్లూరి ప్రతినిధులను పిలిపించి సూచించారు. ఎంత ఒత్తిడి చేసినా వారు ఒప్పుకోలేదు. దీంతో ఆ సంస్థపై అనర్హత వేటు వేయడానికి నాలుగైదు చిన్నచిన్న కారణాలు వెతికి పట్టుకుని ఫైలు తయారు చేశారు. తాము పెట్టిన నిబంధనల ప్రకారం డిమాండ్ డ్రాఫ్ట్ జత చేయాలని.. కానీ అట్లూరి సంస్థ బ్యాంకు గ్యారెంటీ చూపించిందన్నది ఇందులో ఒక కారణం. ఎంఎస్ఎంఈలుగా నమోదైన సంస్థలు డీడీ బదులు బ్యాంకు గ్యారంటీ చూపించవచ్చని కేంద్రం గతంలోనే ఆదేశాలు జారీచేసింది. అయినా అనర్హతకు దానిని కారణంగా చూపించారు. ఎక్స్‌టర్నల్ పవర్ సప్లయ్ యూనిట్ల సరఫరా ధరను ఈ రెండు సంస్థలు విడివిడిగా పేర్కొన్నాయి. అట్లూరితో పోలిస్తే స్వస్తిక్ పేర్కొన్న ధర దాదాపు రెట్టింపుగా ఉంది. అయితే 16 యూనిట్లు అని ఉండాల్సినచోట అట్లూరి టెండర్‌లో 2అని టైపింగ్ తప్పు దొర్లింది. ఆ ధరను 16 యూనిట్లకు వర్తింపజేసినా తేడా రూ.లక్ష దాటడం లేదు. టెండర్ మొత్తం విలువలో ఈ రెండు సంస్థల మధ్య తేడా రూ.8 లక్షలు ఉంది. అందులో నుంచి ఒక లక్ష తగ్గించినా అట్లూరి టెండర్ ఇంకా రూ.7లక్షలు తక్కువగానేఉంది. తాము 16 యూనిట్లు అడిగితే అట్లూరి సంస్థ 2 అని మాత్రమే పేర్కొందంటూ అనర్హతకు అదొక కారణంగా రాశారు. ఆడియో సిస్టం తయారు చేసిన జర్మన్ కంపెనీ నుంచి తాము సర్టిఫికెట్ అడిగామని, టెండర్ తమకు వస్తే దానిని తెస్తామని స్వస్తిక్ కంపెనీ వాగ్దానం చేసిందని.. అట్లూరి కంపెనీ ఏమీ చెప్పలేదని మరో కారణం రాశారు. సాధారణంగా టెండర్ ఎవరికి వస్తే వాళ్లు వెళ్లి ఆ కంపెనీ నుంచి సర్టిఫికెట్ తెచ్చుకుంటారు. ఇది ఆనవాయితీ. ఇటువంటి కారణాలు చూపించి అట్లూరి కంపెనీ బిడ్ తిరస్కరిస్తున్నట్లు అసెంబ్లీ అధికారులు ఫైలు తయారు చేసి నాటి స్పీకర్ తమ్మినేని సీతారాం వద్దకు పంపారు. ఆయన దానిని సమర్థిస్తూ సవివరంగా వివరణ రాశారు. అట్లూరి కంపెనీ సర్వీస్ బాగోలేదని, డీడీ బదులు బ్యాంకు గ్యారెంటీ ఇచ్చిందని... కొన్ని యూనిట్లు తక్కువ సరఫరా చేస్తామని చెప్పిందని.. ఈ కారణాల వల్ల అట్లూరి కంపెనీకి బదులు స్వస్తిక్ కంపెనీకే టెండర్ ఇవ్వాలని ఆయన ఆదేశించారు. ఆయన ఆదేశంతోనే తుది నిర్ణయం జరిగినట్లు ఇది స్పష్టం చేస్తోంది. స్వస్తిక్ కంపెనీ ఈ టెండర్ ఆధారంగా మూడేళ్లపాటు ఆడియో సిస్టం నిర్వహించి అసెంబ్లీ నుంచి నిధులు పొందింది. ఈ మొత్తం వ్యవహారంపై ఇటీవలే ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదులు అందాయి.

> మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం టెండర్ల వ్యవహారంలో ఇరుక్కున్నారు. ఆయన హయాంలో అసెంబ్లీలో ఒక పనికి పిలిచిన టెండర్లలో తక్కువకు కోట్ చేసిన వారిని కాదని.. తమకు కావలసిన వారికి దక్కేలా ప్రభావితం చేశారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. తక్కువ రేటుకు టెండర్ వేసిన కంపెనీని పక్కకు తప్పించడానికి చిన్న చిన్న కారణాలు చూపుతూ ఆయన స్వయంగా ఫైలుపై రాసి సంతకం కూడా చేసినట్లు సమాచారం. రేటు ఎక్కువ వేసినా.. నాటి సీఎం జగన్ కుటుంబ మీడియా కార్యాలయంలో సీసీ కెమేరాల నిర్వహణ చూస్తున్న సంస్థకు ఈ టెండర్ లభించడం విశేషం.

ఆడిట్ విభాగం పరిశీలన..

ఆడియో సిస్టం నిర్వహణ టెండర్ ఖరారుపై ప్రభుత్వ ఆడిట్ విభాగం పరిశీలనజరిపింది. తక్కువ ధరకు వేసిన సంస్థను పక్కన పెట్టడానికి చూపించిన కారణాలు సవ్యంగా లేవని నివేదికలో పేర్కొంది. స్వస్తిక్ కంపెనీ టెండర్‌ను ఆమోదించడం వల్ల మూడేళ్లలో సుమారుగా రూ.18లక్షల ప్రజాధనం వృధా అయిందని, తక్కువ ధర కోట్ చేసిన సంస్థ టెండర్‌ను ఆమోదించి ఉంటే ఈ వృధా జరిగేది కాదని స్పష్టం చేసింది. 16యూనిట్ల బదులు 2యూనిట్ల ధరను అట్లూరి కంపెనీ పేర్కొందన్న కారణం కూడా సమంజసంగా లేదని, ఆ ధరను 16 యూనిట్లకు వర్తించినా ఇంకా చాలాతేడా ఉందని వ్యాఖ్యానించింది. ఆడిట్ అభ్యంతరాలపై అసెంబ్లీ అధికారులు తమను తాము సమర్థించుకుంటూ సమాధానం పంపారు. కానీ వాటిని ఆడిట్ విభాగం ఉపసంహరించలేదు. 'అసెంబ్లీ అధికారులు తప్పుడు నిర్ణయం తీసుకుంటే స్పీకర్ సరిదిద్దాలి. కానీ ఆయన ఆ నిర్ణయాన్ని సమర్థిస్తూ ఫైలుపై రాశారు. తమకు కావలసిన సంస్థను నిబంధనలకు వ్యతిరేకంగా ఎంపిక చేయడంలో ఆయన పాత్ర ఉందనడానికి ఇదే నిదర్శనం' అని నివేదికలో పేర్కొన్నారు. ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదులు అందడంతో అసెంబ్లీ అధికార వర్గాలు ప్రస్తుతం ఈ ఫైళ్ల పరిశీలన చేపట్టాయి.

విద్యాసాగర్ అరెస్టులో చట్టనిబంధనలు పాటించాం!

▸▸ అరెస్టుకు కారణాలను పోలీసులు అప్పుడే చెప్పారు
▸▸ ఇప్పుడు రిమాండ్ చెల్లదనడం సరికాదు
▸▸ హైకోర్టులో ఏజీ దమ్మాలపాటి వెల్లడి
▸▸ వివరాలు తెలుసుకుని వాదనలు వినిపించండి
▸▸ విద్యాసాగర్ తరఫు సీనియర్ న్యాయవాదికి న్యాయమూర్తి సూచన.. విచారణ నేటికి వాయిదా

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ముంబై సినీనటి కాదంబరి జెత్వానీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసులో వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్‌ను అరెస్టు చేసే సమయంలో పోలీసులు చట్టనిబంధనల ప్రకారమే నడుచుకున్నారని అడ్వకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు నివేదించారు. అరెస్టు చేసేటప్పుడు నిందితుడిపై ఎవరు ఫిర్యాదు చేశారు.. ఏ కారణంతో అరెస్టు చేస్తున్నామో వారు వివరించారని.. అరెస్టు చేస్తున్న విషయాన్ని ఆయన స్నేహితుడికి కూడా తెలియపరిచారని వివరించారు. విద్యాసాగర్‌ను అరెస్టు చేసి రాష్ట్రానికి తరలించేందుకు అనుమతి కోరుతూ ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారని.. కోర్టు ఇచ్చిన ట్రాన్సిట్ ఆర్డర్‌పై పిటిషనర్ సంతకం కూడా చేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో అరెస్టుకు కారణాలు చెప్పలేదని, పోలీసులు చట్టనిబంధనలు అనుసరించనందున రిమాండ్ ఉత్తర్వులు చెల్లుబాటు కావన్న విద్యాసాగర్ వాదనలో అర్థంలేదన్నారు. మంగళవారం కోర్టు సమయం ముగియడంతో న్యాయస్థానం ఏజీ వాదనల కొనసాగింపు కోసం విచారణను బుధవారానికి వాయిదా వేసింది. ట్రాన్సిట్ ఆర్డర్‌పై విద్యాసాగర్ సంతకం ఉన్న నేపథ్యంలో ఈ వ్యవహారంపై వివరాలు తెలుసుకుని వాదనలు వినిపించాలని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డికి సూచించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. జెత్వానీ ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసులో తనకు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ విజయవాడ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ విద్యాసాగర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు వచ్చింది. విద్యాసాగర్ తరఫున టి.నిరంజన్‌రెడ్డి స్పందిస్తూ.. పిటిషనర్ అరెస్టు విషయంలో చట్టం నిర్దేశించిన మార్గదర్శకాలను పోలీసులు అనుసరించలేదని, అరెస్టుకు కారణాలను ఆయనకు వివరించలేదని.. బంధువులకు తెలియజేయలేదని తెలిపారు. అరెస్టుకు కారణాలను రిమాండ్‌కు ముందు ఆయనకు అందజేశారని.. రిమాండ్ ఆర్డర్‌లో సైతం వీటి ప్రస్తావన లేదని.. అందుచేత రిమాండ్ ఉత్తర్వులు చెల్లుబాటు కావని, వాటిని కొట్టివేయాలని కోరారు.

విద్యాసాగర్ పిటిషన్‌పై 5లోగా కౌంటర్ వేయండి

▸▸ పోలీసులకు హైకోర్టు ఆదేశం

కాదంబరి జెత్వానీని అరెస్టు చేసే సమయంలో ఆమె నుంచి ఇబ్రహీంపట్నం పోలీసులు స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఆమెకు వెనక్కి ఇవ్వకుండా ఆదేశాలివ్వాలని కోరుతూ కుక్కల విద్యాసాగర్ వేసిన పిటిషన్‌పై నవంబరు 5లోగా కౌంటర్ వేయాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. విచారణను నవంబరు 6కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. జెత్వానీ నుంచి సీజ్ చేసిన మొబైల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, అందులో ఉన్న డేటాను యథాతథంగా భద్రపరచాలని పోలీసులను ఆదేశిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను అప్పటివరకు పొడిగించారు.

కరువు సీమలో కుండపోత

▸▸ అనంత, సత్యసాయి జిల్లాల్లో భారీ వర్షం

అనంతపురం అర్బన్/పుట్టపర్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు కుండపోత వర్షం కురిసింది. నదులు, కాలువలు పొంగిపొర్లుతుండటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. రాప్తాడు మండలం బండమీదపల్లి చెరువు పొంగిపొర్లడంతోపాటు కనగానపల్లి చెరువుకు గండిపడటంతో వరద నీరు అనంతపురం జిల్లాకేంద్రాన్ని తాకింది. పండమేరు ఉగ్రరూపం దాల్చి అనంతపురం రూరల్ మండలంలోని పలు ప్రాంతాలను ముంచేసింది. అటవీ శాఖ వనమిత్ర వెనుక భాగంలో గుడిసెలు నీట మునిగాయి. పలు కాలనీల్లోని గుడిసెలు, ఆటోలు, ద్విచక్రవాహనాలు కొట్టుకుపోయాయి. భారీగా ఆస్తి నష్టం జరిగింది. కనగానపల్లి మండలంలో రికార్డు స్థాయిలో 198.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి నీట మునిగిన కాలనీలలో చిక్కుకుపోయిన ప్రజలను రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. రాప్తాడు మండలం బండమీదపల్లి చెరువు నిండి మరువ పారుతోంది. వంద ఎకరాలలో చీనీ చెట్లు, వరి పంటకు నష్టం వాటిల్లింది. బండమీదపల్లిలో సల్లాపురమ్మ ఆలయ పూజారి నారాయణప్పకు చెందిన 80 గొర్రెలు నీట మునిగి చనిపోయాయి. ముక్తాపురం చెరువు మరువ పొంగి పొర్లడంతో బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారిపై రాకపోకలు స్తంభించాయి. అనంతపురం జిల్లాలో 370 హెక్టార్లల్లో రూ.2.32 కోట్ల విలువైన పంటలు దెబ్బతిన్నాయి. అనంతపురంలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యేందుకు సినీనటుడు అక్కినేని నాగార్జున మంగళవారం ప్రత్యేక విమానంలో పుట్టపర్తి విమానాశ్రయానికి వచ్చారు. వంగపేరు ఉధృతి కారణంగా ఆయన దారి మళ్లి.. పెనుకొండ జాతీయ రహదారి మీదుగా అనంతపురానికి చేరుకున్నారు.



ఉప్పరపల్లిలో జగనన్న కాలనీ నుంచి బాధితులను తరలిస్తున్న అధికారులు

తుంగభద్రకు వరద పోటు

బళ్లారి(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని హోస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయానికి వరద ఉధృతి పెరిగింది. మంగళవారం 23 క్రస్టుగేట్లను ఎత్తి 1.05లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 1,633 అడుగులు కాగా, ప్రస్తుతం 1631.92 అడుగుల వరకు నీరు చేరింది. నీటినిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, 101.461 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి జలాశయానికి 1,12,136 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

బెంగళూరు కకావికలం

భారీవర్షాలకు బెంగళూరులో జనజీవనం అస్తవ్యస్తమైంది. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో వేలాది ఇళ్లలోకి నీరు చేరింది. భారీ వర్షాలతో విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వర్షాల కారణంగా బాబుసాబ్‌పాళ్యలో నిర్మాణంలో ఉన్న ఓ భవనం కూలింది. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందారు. శిథిలాల కింద మరో 13 మంది ఉన్నట్లు తెలుస్తోంది. వీరిని బయటకు తీసేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

'దానా' గండం..!

▸▸ బంగాళాఖాతంలో వాయుగుండం

విశాఖపట్నం, అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం పశ్చిమ వాయవ్యంగా పయనించి మంగళవారం ఉదయానికి వాయుగుండంగా బలపడింది. ప్రస్తుతం ఒడిశాలోని పారాదీప్‌కు 690 కి.మీ. ఆగ్నేయంగా కేంద్రీకృతమై ఉంది. బుధవారం ఉదయానికి తుఫాన్‌గా బలపడనుంది. దీనికి ఒమన్ దేశం సూచించిన 'దానా' పేరు పెట్టనున్నారు. బుధవారం ఉదయం నుంచివాయవ్యంగా పయనిస్తూ వాయవ్య బంగాళాఖాతంలో ప్రవేశించే క్రమంలో 24న తీవ్ర తుఫాన్‌గా మారుతుంది. తర్వాత అదే దిశలో పయనించి 25తెల్లవారుజాములోగా ఉత్తర ఒడిశాలోని పారాదీప్ నుంచి బాలాసోర్ మధ్య తీరం దాటుతుందని భారత వాతావరణ శాఖ తెలిపింది.కోస్తాలోని అన్ని ఓడరేవుల్లో ఒకటో నంబరు భద్రతా సూచిక ఎగురవేశారు. 25న తీరం దాటే సమయంలో ఉత్తరాంధ్రలో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. రానున్న 24 గంటల్లో రాయలసీమలో పలుచోట్ల, కోస్తాలో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కాగా, ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి అనిత ఆదేశించారు. 12 ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామని చెప్పారు.

టీడీపీ కార్యకర్త హత్య

▸▸ తిరుపతి జిల్లా లో ఘోరం

చిల్లకూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఇంట్లోకి పెట్రోల్ బాంబు విసిరిన వైసీపీ మూకలు.. బయట రాడ్లు, కర్రలతో కాపు కాసి దాడి చేసి టీడీపీ కార్యకర్తను దారుణంగా హత్య చేశాయి. తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం నాంచారమ్మపేటకు చెందిన పెంచలయ్య, రమణమ్మ దంపతుల కుమారుడు హరిప్రసాద్(21) ఎన్నికలకు ముందు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఎన్నికల్లో గ్రామంలో టీడీపీకి మెజార్టీ వచ్చింది.

గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు మధు, భానుచంద్ర, నారపరెడ్డి వెంకటకృష్ణ, కట్టా రామిరెడ్డి, దుంపల మధు, దుంపల భానుచందర్‌తో హరిప్రసాద్‌కు వివాదం ఉంది. సోమవారం మళ్లీ వివాదం చోటుచేసుకుంది. మంగళవారం వేకువన వైసీపీకి చెందినవారు హరిప్రసాద్ ఇంటికివెళ్లి పెట్రోలు పోసి బైకును తగలబెట్టారు. బాటిల్‌లో పెట్రోలు పోసి నిప్పంటించి ఇంటిలోకి విసిరారు. హరిప్రసాద్, అతడి సోదరుడు కాటయ్య బయటకు రాగా, వారిపై దాడిచేశారు. కాటయ్య పొలాల్లోకి పారిపోగా, హరిప్రసాద్‌పై దుండగులు రాడ్లు, కర్రలతో దాడి చేసి చంపేశారు.

రూ.570 కోట్ల 'స్వచ్ఛాంధ్ర' కుంభకోణంపై విజిలెన్స్ దర్యాప్తు

▸▸ విచారణ అధికారులుగా రాజమండ్రి, గుంటూరు ఆర్‌వీఈవోలు

గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌లో జరిగిన రూ.570 కోట్ల కుంభకోణంపై దర్యాప్తు ప్రారంభమైంది. శాసన మండలి మాజీ సభ్యుడు ఏఎస్ రామకృష్ణ, గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు ఈ కుంభకోణంపై ఇటీవల ఆధారాలతో సహా ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ జరిపించాల్సిందిగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ హరీష్ కుమార్ గుప్తాను సీఎం ఆదేశించగా రాజమండ్రి విజిలెన్స్ ఎస్పీ స్నేహిత, గుంటూరు ఎస్పీ శ్రవణ్ కుమార్‌లను విచారణ అధికారులుగా నియమించారు. మరోవైపు దర్యాప్తు కోసం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్య కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్‌కు శాఖాపరమైన ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ డైరెక్టర్ హరినారాయణ నేతృత్వంలో ముగ్గురు ఐఏఎస్ అధికారులతో త్రిసభ్య కమిటీని నియమించారు. ఈ కుంభకోణంపై మంగళవారం విజిలెన్స్ విచారణ ప్రారంభమైంది. గుంటూరు విజిలెన్స్ కార్యాలయంలో ఏఎస్ రామకృష్ణ, మన్నవ సుబ్బారావు దర్యాప్తు అధికారులను కలిసి తమ వద్ద ఉన్న ఆధారాలను అందజేశారు. కార్పొరేషన్‌లోని ఉన్నతాధికారుల అండదండలతో ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి రూ.570 కోట్ల విలువైన టెండర్లు కొంతమంది అక్రమంగా పొందారని రామకృష్ణ, సుబ్బారావు తెలిపారు. టెండర్ల నిబంధనలో పారదర్శకత లేదని, సరైన కారణాలు లేకుండా అనేక మినహాయింపులు ఇచ్చి.. నిధులు, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని వివరించారు. జ్ఞానేశ్వర, క్రీతి ఇంజనీరింగ్ అనే రెండు బోగస్ సంస్థలను ఏర్పాటు చేశారని, ఈ రెండు సంస్థలకు యజమాని ఒక్కరేనని తెలిపారు. కెనరా, ఐసీఐసీఐ, యాక్సిస్ బ్యాంకుల పేరుతో నకిలీ ధ్రువీకరణపత్రాలు సృష్టించారని, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ పూజారి ఆనందరావు, ఐఏఎస్ అధికారిణి వై.శ్రీలక్ష్మీ, మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి కాంట్రాక్టర్ బినామీగా ఉన్నారని ఆరోపించారు. ఈఎండీలు కట్టకుండా పీఎస్‌డీ, ఎఫ్ఎస్‌డీలు లేకుండా ఒప్పందాలు జరిగిపోయాయని పేర్కొన్నారు. విజిలెన్స్ అధికారులకు అన్ని ఆధారాలూ అందజేశామని చెప్పారు.



రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

రైల్వే ప్రాజెక్టులన్నీ మూడేళ్లలో పూర్తి చేయాలి

▸ ప్రతి ప్రాజెక్టుకు లక్ష్యం నిర్దేశించుకోవాలి: సీఎం చంద్రబాబు

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేపట్టిన అన్ని రైల్వే ప్రాజెక్టులు మూడేళ్లలో పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఏపీలో రూ.72 వేల కోట్ల రైల్వే ప్రాజెక్టులు చేపట్టేందుకు కేంద్ర మంత్రి సంసిద్ధత వ్యక్తం చేశారని, దానికి అనుగుణంగా ప్రతి ప్రాజెక్టుకు లక్ష్యాన్ని నిర్దేశించుకుని పూర్తి చేయాలన్నారు. రైల్వే లైన్ల పనులు, భూసేకరణ ఇబ్బందులు, ఆర్థిక అవసరాలపై సీఎం చంద్రబాబు మంగళవారం సచివాలయంలో రాష్ట్ర అధికారుల తోపాటు రైల్వే అధికారులతో ఉమ్మడిగా సమీక్షించారు. కోటిపల్లి-నర్సాపూర్, నడికుడి-శ్రీకాళహస్తి ప్రాజెక్టుల భూసేకరణకు రూ.20 కోట్లు ఇచ్చేందుకు సీఎం సమ్మతి తెలపారు. సత్తుపల్లి-కొవ్వూరు, కడప-బెంగళూరు రైల్వే లైన్లపై చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నారు. రేణిగుంట-గూడూరు, గుంటూరు-గుంతకల్ డబ్లింగ్ పనులు ఏడాదిలోనే పూర్తి చేయాలని సీఎం సూచించారు. అమృత్ ప్రాజెక్టు కింద 72 రైల్వే స్టేషన్లలో చేపడుతోన్న అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. సమీక్షలో మంత్రి బీసీ జనార్ధనరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఊరట

▸ బ్యాంకు రుణాలపై రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంపు డ్యూటీ మినహాయింపు

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరదల వల్ల నష్టపోయిన బాధితులకు ఊరట కల్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా వరద బాధితులు తీసుకున్న, తీసుకోబోయే బ్యాంకు రుణాలపై రిజిస్ట్రేషన్ ఫీజులు, స్టాంపు డ్యూటీలు మినహాయిస్తూ నిర్ణయించింది. రుణ పరిమితిని రూ.50,000గా నిర్ణయించారు. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2025 మార్చి 31 వరకు ఈ మినహాయింపులు వర్తిస్తాయని పేర్కొన్నారు.

వన్యప్రాణులపై నేరాలను సహించం

▸ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హెచ్చరిక

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులపై నేరాలను సహించబోమని ఉపముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లాలో చిరుతపులిని చంపడాన్ని ఆయన ఖండించారు. చిరుతపులి గోళ్ల కోసం కాళ్లను ఛిద్రం చేయడంతో పాటు దాని దంతాలు కూడా తొలగించడం అమానవీయమని మంగళవారం పేర్కొన్నారు. ఈ ఘటనపై విచారణ జరపాలని అటవీ అధికారులను ఆదేశించారు. నేరస్తులను గుర్తించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వన్యప్రాణులపై ఈ రకమైన చర్య నేరం మాత్రమే కాదని, పర్యావరణాన్ని సంరక్షించే మన కర్తవ్యాన్ని ఉల్లంఘించినట్లేనని పవన్ స్పష్టం చేశారు.

మద్యం డిస్టిలరీల్లో సీఐడీ సోదాలు

జగన్ హయాంలో కుంభకోణంపై ఆరా

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై సీఐడీ కూపీ లాగడం ప్రారంభించింది. రాష్ట్ర వ్యాప్తంగా మద్యం తయారీ డిస్టిలరీల్లో సీఐడీ అధికారులు విస్తృత స్థాయిలో సోదాలు చేపట్టారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు పలు జిల్లాల్లో 20 చోట్ల తనిఖీ చేశారు. చిత్తూరు, కడప, నెల్లూరు, నంద్యాల, కృష్ణా, ఉభయ గోదావరి, విశాఖపట్నం జిల్లాల్లో సోదాలు జరిగాయి. జగన్ ప్రభుత్వంలో మద్యం ఉత్పత్తి లెక్కలపై అధికారులు రికార్డులను పరిశీలించారు. ఎన్నికలకు ముందు జరిగిన ఉత్పత్తికి, మద్యం దుకాణాల్లో విక్రయాలకు మధ్య తేడా ఉన్నట్లు గుర్తించారు. డిస్టిలరీల నుంచి బేవరేజెస్ కార్పొరేషన్‌కు ఎంత మొత్తంలో మద్యం సరఫరా అయింది? ఎన్నికల సమయంలో అనధికారికంగా ఎవరెవరికి చేరిందనే లెక్కలను సీఐడీ అధికారులు పరిశీలిస్తున్నారు. బాట్లింగ్ యూనిట్లలో నిల్వ, సరఫరా వివరాల రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. సీఐడీ ప్రతి బృందంలోనూ ఒక ఎక్సైజ్ అధికారిని వెంట తీసుకువెళ్లారు. మద్యం తయారీలో నిబంధనల మేరకు నాణ్యత పాటించారా? లేదా? అనే విషయమై శాస్త్రీయంగా పరిశీలించారు. రికార్డులు స్వాధీనం చేసుకుని ఇన్వాయిస్, ఉత్పత్తి, విక్రయాలకు సంబంధించిన వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు.

ఉదయం నుంచి రాత్రి వరకు

భారీగా మద్యం ఆర్డర్లు పొందిన ఆదాన్ డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఎస్‌పీవై ఆగ్రోస్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, జేఆర్ అసోసియేట్స్, ఎంఎస్ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, సెంటినీ బయోప్రాడక్ట్స్, శార్వాణీ ఆల్కో బ్రూవరీస్‌లో రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఆయా కంపెనీలలోని మేనేజర్, రిజిస్టర్ నిర్వాహకుడు, ఫార్మాసిస్ట్ తదితరులను ప్రశ్నించి స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. "నీ పేరేంటి? ఇక్కడ నీ డ్యూటీ ఏంటి? ఎప్పటి నుంచి పని చేస్తున్నావ్?" అనే ప్రశ్నల నుంచి ఇన్వాయిస్‌లు, ప్రొడక్షన్, సేల్స్‌కు సంబంధించిన వివరాలు రాబట్టారు. ఉత్పత్తి సామర్థ్యం, 'జే బ్రాండ్ల' పేర్లు, సబ్ లీజుదారు ఎవరు? డిస్టిలరీ తయారు చేసిన లేదా కొనుగోలు చేసిన ఈఎన్ ఆల్కాహాల్ ఎంత? దాని ద్వారా చేయాల్సిన మద్యం ఉత్పత్తి ఎంత? చేసిందెంత? రాష్ట్రంలోని మద్యం షాపులకు సరఫరా చేసింది ఎంత? అనే అంశాలపై క్షుణ్ణంగా ప్రశ్నించారు. మద్యం ఉత్పత్తిలో విద్యుత్ వినియోగం వివరాలు సేకరించిన దర్యాప్తు అధికారులు ఎంత మద్యం తయారీకి ఎన్ని యూనిట్ల విద్యుత్ వినియోగం వినియోమవుతుందనే అంచనాలు వేయనున్నారు. వాటి ఆధారంగా కూడా అక్రమాలను వెలికి తీయనున్నారు. అదేవిధంగా డిస్టిలరీస్, బాట్లింగ్ యూనిట్ల కోసం కొనుగోలు చేసిన ఖాళీ సీసాలు, లేబుళ్ల వివరాలు కూడా అధికారులు సేకరించినట్లు తెలిసింది. ఆడిట్ వివరాలను స్వాధీనం చేసుకున్నారు. స్పిరిట్ ఎంత వినియోగించి మద్యం ఎంత ఉత్పత్తి చేశారనే లెక్కలు ఆడిట్‌లో ఉన్నందున దారి మళ్లిన మద్యం వివరాలు కూడా బయటపడే అవకాశం ఉంది. మంగళవారం ఉదయం నుంచి రాత్రివరకు ఈ తనిఖీలు కొనసాగా యి. బుధవారం కూడా ఇవి కొనసాగనున్నాయి.

ఐదేళ్లలో అందినంత!

జగన్ హయాంలో గత ఐదేళ్లలో భారీ మద్యం కుంభకోణం జరిగింది. నాసిరకం మద్యాన్ని కూడా అధిక ధరలకు విక్రయించారు. మద్యం దుకాణాల నుంచి వచ్చిన సొమ్ముకు లెక్కలు కూడా చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. మరో వైపు డిజిటల్ పేమెంటును కూడా అనుమతించలేదు. మొత్తంగా వైసీపీ పాలనలో ముఖ్యనేతల నుంచి క్షేత్రస్థాయి నాయకుల వరకు మద్యాన్ని ఆదాయ వనరుగా మార్చుకుని అందినంత దోచుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ఈ భారీ కుంభకోణాన్ని వెలికితీసే బాధ్యతను సీఐడీకి అప్పగించింది. దీంతో సీఐడీ అధికారులు విజయవాడలోని ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో ఇటీవల తనిఖీలు చేపట్టి రికార్డులు, ఫైళ్లు, కంప్యూటర్ హార్డ్ డిస్కులు సీజ్ చేశారు. వీటిని అధ్యయనం చేయగా సంచలన విషయాలు వెలుగు చూసినట్లు తెలిసింది.



నంద్యాలలోని ఎస్పీవై ఆగ్రోస్ ఇండస్ట్రీస్‌లో తనిఖీలకు వచ్చిన సీఐడీ బృందం

సీఐడీ గుర్తించిన దారుణాలు

- రాష్ట్రం మొత్తం మీద 90శాతం మద్యం ఆర్డర్లు తాడేపల్లి ప్యాలెస్ అనుయాయులకే అప్పగించారు.
- వైసీపీ నేతలతో అబ్కారీ అధికారులు చేతులు కలిపి అధిక కమీషన్లు ఇచ్చిన వారికే ఎక్కువగా మద్యం ఆర్డర్లు ఇచ్చినట్లు తేలింది.
- నంద్యాలలో ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్‌ను వైసీపీ నేతలు నియంత్రించారు.
- వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి బినామీ కంపెనీకి ఎక్కువ ఆర్డర్లు ఇచ్చారు.
- టీడీపీకి చెందిన వారి డిస్టిలరీస్‌ను వైసీపీ నేతలు లాక్కున్నారు.
- వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి అల్లుడికి డిస్టిలరీ లేకున్నా భారీగా మద్యం ఆర్డర్లు ఇచ్చారు.
- రాష్ట్ర వ్యాప్తంగా మద్యం సరఫరా చేసే కంపెనీలు ఏపీఎస్‌బీసీఎల్‌లో 100 వరకు రిజిస్టర్ కాగా 90శాతం ఆర్డర్లు కేవలం 10 సంస్థలకే దక్కాయి.
- ఆయా ఘటనల్లో వైసీపీ ముఖ్యనేతల నేరపూరిత కుట్ర ఉన్నట్లు సీఐడీ అధికారులు భావిస్తున్నారు.

తానా మహాసభలకు 3 మిలియన్ డాలర్ల విరాళాలు

▸ మహాసభల కన్వీనర్ ఉదయ్‌కుమార్ వెల్లడి

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) 24వ ద్వైవార్షిక మహాసభలను తెలుగు సంప్రదాయాలతో అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయని మహాసభల కన్వీనర్ ఉదయకుమార్ చాపలమడుగు, కాన్ఫరెన్స్ ఛైర్మన్ గంగాధర్ నాదెళ్ల తెలిపారు. వచ్చే జూలై 3-5వరకు నిర్వహించనున్న ఈ మహాసభల వేదికను డెట్రాయిట్ సబర్బన్ నోవీలో ఉన్న సబర్బన్ కలెక్షన్ షోప్లేస్‌ను ఎంపిక చేసినట్లు చెప్పారు. డెట్రాయిట్‌లోని సెయింట్ తోమా చర్చిలో ఇటీవల నిర్వహించిన కిక్ ఆఫ్ ఫండ్ రైజింగ్ ఈవెంట్‌కు వివిధ ప్రాంతాల నుంచి హాజరైన తానా నాయకులు, దాతల నుంచి 3 మిలియన్ డాలర్ల మేర నిధులకు హామీ లభించిందని వివరించారు. ఇటీవల మరణించిన తానా నాయకులు చలసాని మల్లికార్జునరావు, కొడాలి చక్రధర్‌రావు మృతికి సంతాపం వ్యక్తంచేస్తూ, వారి సేవలను కొనియాడారు.

వాట్సాప్‌లోనే ఇక సర్టిఫికెట్లు

(మొదటి పేజీ తరువాయి)

అంగీకరించింది. మంత్రి నారా లోకేశ్ చొరవతో మెటా ఈదిశగా నిర్ణయించింది. మంగళవారం ఢిల్లీలోని వన్ జన్‌పథ్‌లో మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మెటా ఇండియా వైస్ ప్రెసిడెంట్ సంధ్యా దేవనాథన్, డైరెక్టర్ రవి గార్గ్, డైరెక్టర్(పబ్లిక్ పాలసీ) నటాషా, రాష్ట్ర ప్రభుత్వం తరపున ఐఏఎస్ అధికారులు యువరాజ్, ఆర్టీజీఎస్ సీఈవో దినేశ్ పాల్గొన్నారు. ఏఐ ద్వారా మరిన్ని పౌర సేవలు అందించేలా ఏపీ అధికారులు, మెటా ప్రతినిధులు ఎంఓయూ చేసుకున్నారు. మెటా ప్లాట్‌ఫాం వాట్సాప్ బిజినెస్ ద్వారా ఇకపై కులం, ఇతరత్రా ధ్రువీకరణ పత్రాలు వేగంగా, సులభంగా పొందేందుకు వీలు కలుగుతుంది. కాగా, మెటాతో ఎంఓయూను చరిత్రాత్మక మైలురాయిగా మంత్రి లోకేశ్ అభివర్ణించారు. రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని మెటా ఇండియా వైస్ ప్రెసిడెంట్ సంధ్యా దేవనాథన్ ప్రకటించారు.

విద్యార్థులకు త్వరలో శుభవార్త: లోకేశ్

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు త్వరలోనే శుభవార్త చెబుతామని మంత్రి లోకేశ్ మంగళవారం ఎక్స్‌లో ప్రకటించారు. "ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో రూ.3,500 కోట్లు బకాయిలు పెట్టి వైసీపీ ప్రభుత్వం మిమ్మల్ని మోసం చేసింది. ఈ సమస్య పరిష్కారానికి కేబినెట్ సహచరులతో చర్చిస్తాను. త్వరలోనే శుభవార్త వింటారని మీకు హామీ ఇస్తున్నా. మీకు అండగా ఉంటా' అని అన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణ ఆగినట్లే!?

(మొదటి పేజీ తరువాయి)

ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొంటున్నాయి. అయితే ప్లాంటు కార్మికుల్లో మాత్రం నమ్మకం కుదరడం లేదు. ప్రైవేటీకరణ ఆపాలంటూ ఆందోళన సాగిస్తూనే ఉన్నారు. అయితే, టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక.. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నిలబెట్టే ప్రయత్నాలు ఢిల్లీ స్థాయిలో జరిగాయి. ఎన్‌ఎండీసీలో గానీ, సెయిల్‌లో గానీ విలీనం చేయాలన్న కార్మిక సంఘాల ప్రతిపాదనను టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు కేంద్ర పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. ముడిసరుకుల కొనుగోలుకు బ్యాంకులు కూడా రుణాలివ్వని పరిస్థితి తలెత్తడంతో.. తొలుత ఆర్థిక సాయం చేయాలని అభ్యర్థించారు. దరిమిలా కేంద్ర ఉక్కు శాఖ ఇటీవల రెండు విడతలుగా రూ.1,650 కోట్లు సాయం చేసింది. 2 నెలల క్రితం రూ.500 కోట్లు ఇచ్చి వాటిని చట్టబద్ధమైన చెల్లింపులకే వినియోగించాలని నిబంధన విధించింది. ఆ మొత్తాన్ని జీఎస్‌టీ చెల్లింపునకు ఉపయోగించారు. రెండో విడతగా రూ.1,150 కోట్లు వచ్చాయి. రుణాలివ్వడానికి నిరాకరించిన బ్యాంకులకు ఈ నిధులు చెల్లించి రుణ పరపతిని పునరుద్ధరించుకోవాలని ఉక్కు శాఖ సూచించింది. ఆ నిబంధనను కూడా యాజమాన్యం అమలు చేసింది. దాంతో బ్యాంకులు విదేశాల నుంచి బొగ్గు దిగుమతి చేసుకోవడానికి అవసరమైన క్రెడిట్ లెటర్లు ఇచ్చాయి. ఇంకో 3, 4 రోజుల్లో బొగ్గు రానుంది. ఈ నెల 27వ తేదీ నుంచి రెండో బ్లాస్ట్ ఫర్నేస్‌లో కూడా ఉత్పత్తి ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సెయిల్‌లో విలీనానికి నో?

విశాఖ స్టీల్‌ప్లాంటుకు ముడి పదార్థాల కొరత లేకుండా ఉండాలంటే సొంత ఇనుప గనులు కేటాయించాలన్న డిమాండ్ రెండు దశాబ్దాల నుంచీ ఉంది. దానిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఇప్పుడు ఇతర సంస్థలతో పోటీ పడి గనులను వేలంలో దక్కించుకునే పరిస్థితి లేదు. అందుకే ఉద్యోగ సంఘాలు ఈ కర్మాగారాన్ని స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్)లో విలీనం చేస్తే ముడి పదార్థాల సమస్య ఉండదని, సెయిల్‌కు కూడా ఈ సముద్ర తీర ప్లాంటు ఎగుమతి, దిగుమతులకు ఉపయోగపడుతుందని ప్రతిపాదించాయి. కానీ కేంద్రం ఆసక్తి చూపలేదు. కొన్ని కార్మిక సంఘాలు అలా సెయిల్‌లో విలీనం కోరుకోవడం లేదంటూ ఆ ప్రతిపాదనను పక్కన పెట్టేసింది.

దీపమ్ నుంచి డీనోటిఫై చేస్తేనే..

ఈ ఏడాది మేలో జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో ఛత్తీస్‌గఢ్‌లోని నగర్‌నార్ స్టీల్‌ప్లాంటును ప్రైవేటుపరం చేయబోమని, ఎన్‌ఎండీసీ ఆధ్వర్యంలోనే కొనసాగిస్తామని బీజేపీ నాయకులు హామీ ఇచ్చారు. అయితే ఆరు నెలలైనా ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. విశాఖ ప్లాంటును కూడా ప్రైవేటీకరణ చేయబోమని చెబుతున్నారు. కానీ కార్మికుల్లో నమ్మకం కుదరడం లేదు. ఆర్థిక శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపమ్) జాబితా నుంచి విశాఖ ప్లాంటును తొలగిస్తేనే వారు విశ్వసించడానికి ఆస్కారం ఉంటుంది. స్టీల్‌ను నాన్ స్ట్రాటజిక్ (వ్యూహాత్మకం కాని) రంగంగా పేర్కొని పెట్టుబడులు ఉపసంహరించాలని మోదీ ప్రభుత్వం గతంలోనే నిర్ణయించింది. అందులో భాగంగానే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు ప్రయత్నాలు చేపట్టింది. కార్మికుల ఉద్యమం వల్ల గానీ, కూటమి నేతల అభ్యర్థనలతో గానీ ఇప్పుడు వెనక్కి తగ్గిందని అంటున్నారు. అయితే ప్రైవేటీకరణ యత్నాలను నిజంగా ఆపేసిందని కార్మిక సంఘాలు, ప్రజలు నమ్మాలంటే.. స్టీల్‌ను తొలుత వ్యూహాత్మక రంగంలో చేర్చాలి. ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ఈ ప్రకటన చేయాలి. ఆ తర్వాత విశాఖ ఉక్కును దీపమ్ నుంచి డీనోటిఫై చేయాలి. అప్పుడే ప్రైవేటీకరణ ఆగినట్లు లెక్క! అంతవరకూ ఎలాంటి ప్రకటనలు చేసినా తాము విశ్వసించే అవకాశం లేదని ఉక్కు ఉద్యోగులు స్పష్టం చేస్తున్నారు. పైపెచ్చు విశాఖ స్టీల్‌ప్లాంటులో స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్‌ఎస్)కు ఎవరు ఆసక్తిగా ఉన్నారో ఈ నెల 29వ తేదీలోగా పేర్లు ఇవ్వాలని యాజమాన్యం తాజాగా కోరింది.

బొత్సకు జీ హుజూర్!

▸ తిరుమల దర్శనాల్లో రెడ్‌కార్పెట్.. కూటమి ప్రభుత్వంలోనూ అదే దర్జా

▸ టీటీడీ అధికారులపై చంద్రబాబు సీరియస్

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారిందన్న మాటేకానీ వైసీపీ నేతల హవా తిరుమలపై ఏమాత్రం తగ్గడం లేదు. నిబంధనల ప్రకారం మంత్రి సిఫారసు లేఖ ఇచ్చినా 12 మందికి మించి దర్శనాలకు అనుమతించని చోట.. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ సిఫారసు లేఖపై 26 మందికి ఒకే రోజు టీటీడీ దర్శనాలు చేయించడమే దీనికి నిదర్శనం. కొద్దిరోజుల కింద ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఆ సమావేశంలో చాలా మంది ఎమ్మెల్యేలు.. తమకు తిరుమల దర్శనాల్లో అన్యాయం జరుగుతోందని ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యేల సిఫారసు లేఖలను వారానికి ఐదు రోజులు మాత్ర మే టీటీడీ అనుమతిస్తోందని, మిగతా రెండు రోజులు లేఖలు తీసుకోవడం లేదని అధినేత దృష్టికి తెచ్చారు. దీంతో ఎమ్మెల్యేల దర్శనం కోటాను పెంచాలని టీటీడీని సీఎం కోరారు. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేల పరిస్థితి ఇదీ.. కానీ, వైసీపీలో కీలక నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ఇచ్చిన సిఫారసు లేఖపై గత వారం ఏకంగా ఒకేరోజు 26 మందికి దర్శనాలకు అనుమతి ఇచ్చారు. ఈ విషయం సీఎంవో దృష్టికి వెళ్లింది. వారు.. దీనిపై సీఎం చంద్రబాబుకు పూర్తి వివరాలు అందించారు. టీటీడీ అధికారుల నిర్వాకం గురించి తెలుసుకున్న ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టీటీడీ నిబంధనలు పక్కన పెట్టి పదుల సంఖ్యలో టికెట్లు ఎలా జారీ చేస్తారని నిలదీశారు. ఇలాంటి సంఘటన మరోసారి జరగడానికి వీల్లేదని ఆయన టీటీడీ అధికారులకు స్పష్టం చేశారు.

జరిగింది ఇదీ...

ఇప్పుడు టీటీడీలో కీలకమైన స్థానంలో ఉన్న ఓ అధికారి.. బొత్స మంత్రిగా పని చేసిన సమయంలో ఆయన శాఖలో పని చేశారు. అప్పటి నుంచి ఇద్దరికీ పరిచయం ఉంది. దీంతో బొత్స మాట కాదనలేక ఆయన కోరినంతమందికీ సదరు అధికారి దర్శనాలు జరిపించేశారు. నిజానికి, టీటీడీలోని కొంతమంది అధికారులు.. వైసీపీ నేతలతో ఉన్న పాత పరిచయాలను ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే కీలకమైన శాఖల్లో బదిలీలు చేపట్టింది. అధికారులకు పోస్టింగ్ ఇచ్చే సమయంలో వారికి గత వైసీపీ ప్రభుత్వ పెద్దలతో ఏ స్థాయిలో సంబంధ బాంధ్యవాలు ఉన్నాయనేది చెక్ చేసుకోలేదు. దీంతో వైసీపీతో టచ్‌లో ఉన్న కొందరు అధికారులకు కీలకమైన స్థానాల్లో పోస్టింగ్‌లు లభించాయి.

విజయవాడ మెట్రోను 'అమరావతి'తో అనుసంధానించండి

▸ కేంద్ర మంత్రి ఖట్టర్‌తో మంత్రి నారాయణ

న్యూఢిల్లీ, అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): 'గత టీడీపీ హయాంలో ప్రతిపాదించిన విశాఖ, విజయవాడ మెట్రో ప్రాజెక్టులపై త్వరగా నిర్ణయం తీసుకోవాలి' అని రాష్ట్ర మునిసిపల్, పట్టణాభివృద్ధి మంత్రి నారాయణ కోరా రు. మంగళవారం కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తో సమావేశమైన ఆయన ఈమేరకు విజ్ఞప్తి చేశారు. రెండు మెట్రో ప్రాజెక్టులకు సంబంధించి పూర్తి వివరాలతో రూపొందించిన తాజా ప్రతిపాదనలను కేంద్ర మంత్రికి అందించా రు. ఈ భేటీలో మంత్రితో టీడీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయులు, రాష్ట్ర మునిసిపల్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ పాల్గొన్నారు. విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్లే అంశంపై ఈ భేటీలో చర్చించారు. విజయవాడ మెట్రోను రాష్ట్ర రాజధాని అమరావతికి అనుసంధానించే ప్రతిపాదనలు కూడా ఇప్పటికే కేంద్రానికి పంపినట్లు కేంద్ర మంత్రి దృష్టికి నారాయణ తీసుకెళ్లారు. అమృత్ 2 పథకం గత ఐదేళ్లుగా రాష్ట్రంలో అమలుకు నోచుకోలేదని కేంద్ర మంత్రికి చెప్పారు. అమృత్ 2 అమలుకు ఉన్న మార్గాలపై చర్చలు జరిపారు. తన ప్రతిపాదనలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని మంత్రి నారాయణ తెలిపారు.



కేంద్ర మంత్రి ఖట్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రాష్ట్ర మంత్రి నారాయణ

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.